27-6Pg1exHMNWJQE.qxd:27-6Pg1exHMNWJQE.qxd 1/1/02 6:48 AM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం : fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 147 పేజీలు: 16 వెల: 6.50


'సర్'కు యేడాది.. 6 కోట్ల ఓట్లు తొలగింపు

వెనిజులా భూకంపంలో 600 దాటిన మృతులు

5లో

# టీచర్లే ఛేంజ్ మేకర్లు



శుక్రవారం సింగపూర్ అధ్యయనయాత్రకు వెళ్లిన టీచర్ల సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్


## విద్యా వ్యవస్థలో మార్పునకు ఉపాధ్యాయులే నాయకత్వం వహించాలి

## విద్యారంగంలో ఎపి.ని నం.1 చేద్దాం

## సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన టీచర్లతో మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు గారి ప్రజా ప్రభుత్వం టీచర్లను లీడర్లు భావిస్తోంది, కష్టపడి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపునిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన 37మంది ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసంలో సమావేశమయ్యారు. సింగపూర్ అధ్యయన యాత్రలో తాము తెలుసుకున్న అంశాలు, రాష్ట్రంలో వాటిని అమలు చేయ డానికి గల అవకాశాలను వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో మార్పునకు నాయకత్వం వహించే లీడర్లని అన్నారు. విద్యద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుంది, అందుకోసమే నేను పట్టుదల, కమిట్ మెంట్ తో విద్యాశాఖను తీసుకున్నాను, ప్రపంచంలో అత్యుత్తమ మోడల్ విద్యావిధానం కోసం అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశించిన స్వర్ణాంధ్ర సాధనలో విద్యాశాఖ కీలకపాత్ర వహిస్తుంది, క్వాంటమ్, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలు అమలు చేయడం విద్యాశాఖ ద్వారా మాత్రమే సాధ్యమని అన్నారు. నేను చిన్న వయసులోనే అమెరికా వెళ్లి స్టాన్ ఫోర్డ్‌లో విద్యనభ్యసించాను, అక్కడ 100 దేశాల విద్యార్థులతో కలిసి ఐడియాస్, నాలెడ్జి, కల్చర్ పంచుకునే అవకాశం లభించిందని తెలిపారు. విదేశాల్లో శిక్షణపొందిన ఉపాధ్యాయులంతా ఛేంజ్ మేకర్స్‌గా తయారు కావాలి. సింగపూర్ అధ్యయన యాత్రలో మీరు నేర్చుకున్న అం >>2

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం



## యువత భవిష్యత్తును కాపాడడమే లక్ష్యం

## మాదకద్రవ్యాలు సేవిస్తే శిక్షలు ఖాయం

## ఈగల్ టీమ్‌తో నిరంతరం నిఘా: సీఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 26 ,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో డ్రగ్స్‌కు చోటు లేదని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా సందేశం ఇచ్చారు. డ్రగ్స్‌పై పోరాటం అంటే యువత భవిష్యత్తును కాపాడటమే అని అన్నా రు. ఏపీలో డ్రగ్ ట్రాఫికింగ్‌పై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. డ్రగ్స్ అక్రమ రవాణాదారులను చట్టం ముందు నిలబెడతామని అన్నారు. డ్రగ్స్ మహమ్మారి బారినపడ్డ వారికి అన్ని విధాలా సహాయం అందించి సాధారణ జీవితంలోకి తీసుకువస్తామన్నారు. గౌరవప్రదమైన పునరావాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు. నేటి తరం పిల్లలు ఎంతో ఫాస్ట్‌గా, క్లారిటీగా ఉంటున్నప్పటికీ, చిన్న అవగాహన లోపం వల్ల డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ (నివారణే మేలు) అన్నట్లుగా, యువత వీటి జోలికి వెళ్లకుండా ముందే కాపాడుకోవడం ముఖ్యమని చెప్పారు. 60 నుండి 70శాతం స్నేహితుల ప్రభా వమే పలువురు ఈ వ్యసనానికి బానిసలుగా మారడానికి కారణమన్నారు. దేశంలో దాదాపు 3.5నుండి 4 కోట్ల మంది గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని, ముఖ్యంగా 13నుండి 18సంవత్సరాల వయస్సు వారు ఎక్కువగా దీనికి ఆకర్షితులవుతున్నారని హోంమంత్రి ఆందోళన వ్యక్తం >>2



### మాదకద్రవ్య రహిత భారత్‌ను నిర్మిద్దాం: అమిత్‌షా

2లో



# కొత్తగా ఏడు బుల్లెట్‌ట్రైన్ కారిడార్లు

## గంటకు 350 కి.మీ వేగంతో బి35 కొత్తరైళ్లు

**న్యూఢిల్లీ,జూన్ 26:** భారతదేశ రైల్వే వ్యవస్థలో వందే భారత్ రైళ్లు వేగంగా దూసుకుపోతుంటే ఇప్పుడు అంతకంటే వేగంగా దూసుకుపోయే బుల్లెట్ రైళ్లుకూడా భారత్‌లో పరిగెత్తబోతున్నాయి. బుల్లెట్ ట్రైన్ కారిడార్లను కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. 7 కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ కారిడార్ల కోసం బి35 పేరుతో అత్యాధునిక హైస్పీడ్ రైళ్లను అభివృద్ధి చేయాలని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్ణయించింది. ఈ రైళ్ల రూపకల్పన, తయారీ కోసం సంస్థలు ఎంపిక చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. భారత్‌లోనే తయారు కానున్న ఈ బి35 బుల్లెట్ ట్రైన్లు గరిష్టంగా గంటకు 350 >>2

# సకాలంలో సబ్సిడీ ఎరువులు



## ఎపిఎఐఎంఎస్ 2.0తో అక్రమ మళ్లింపులకు పూర్తిగా చెక్

## ఎరువుల కొరత రాకుండా చర్యలు

## కౌలు రైతులు సహా అర్హులందరికి సమాన అవకాశం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా, సకాలంలో సబ్సిడీ ఎరువులు అందించేందుకు ప్రవేశపెట్టిన APAIMS 2.0వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది జూన్ 8వ తేదీ నుంచికృష్ణా, కాకినాడ జిల్లాలను మినహాయించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏపిఎఐఎంఎస్ 2.0 ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2,97,733 మంది రైతులకు 48, 588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874మెట్రిక్ టన్నుల డీఏపీ విజయవం తంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను అమలు చేస్తోం దన్నారు. దీనివల్ల అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందేలా పూర్తి భరోసా కల్పించామని మంత్రి పేర్కొన్నారు. రైతు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా అవసరమైన పరిమాణంలోనే ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు. దీంతో సమతుల్య ఎరువుల వినియోగం పెరిగి, రైతులకు దిగుబడులు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ కూడా సక్రమంగా వినియోగమవుతుందని చెప్పారు. ఏపిఎఐఎంఎస 2.0 ద్వారా ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, మళ్లింపులు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాలు పూర్తిగా అరికట్టే అవకాశం లభించిందన్నారు. ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై రాష్ట్రవ్యాప్తంగా రియల్‌టైమ్ పర్యవేక్షణ సాధ్యమవుతోందని, భౌతిక నిల్వల సమన్వయంతో ఖచ్చితమైన నిల్వల నిర్వహణ జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత తలెత్త కుండా, అవసరమైన సమయంలో అవసరమైన పరిమా ణంలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా పంపిణీ నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. కౌలు రైతులతో సహా అర్హులైన ప్రతి రైతుకు సమాన అవకాశాలు కల్పించేలా ఈ వ్యవస్థ రూపొందించబడిందని చెప్పారు. ఎరువుల కొరత, నాణ్యత, అధిక ధరలు లేదా పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 155251 కు కాల్ చేయవచ్చని మంత్రి తెలిపారు.

రైతులు తమ ఎరువుల కొనుగోలు చరిత్ర, అర్హత వివరాలను కూడా సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించామని, రైతుకేంద్రీకృత, పారదర్శక, సాంకేతికత ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థగా ఏపిఎఐఎంఎస్ 2.0 వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఏ నిజమైన రైతుకూ ఎరువు నిరాకరించ బడకూడదు. ఏ అనధికార వ్యక్తి లేదా రైతు కాని వ్యక్తికి సబ్సిడీ ఎరువు అందకూడదు అన్నదే ఏపిఎఐఎంఎస 2.0 మార్గదర్శక సూత్రమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవస్థ ప్రారంభ దశలో కొద్దిపాటి సాంకేతిక సమస్యలు ఎదురైనప్పటికీ వాటిలో అధిక భాగం ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు వీగిశ లేదా సర్వర్‌కు సంబంధించిన తాత్కాలిక సమస్యలు ఎదురవుతున్నా, ప్రత్యేక సాంకేతిక బృందాలు 24/7 పర్యవేక్షణ చేస్తూ వాటిని వెంటనే పరిష్కరిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం APAIMS 2.0పూర్తిస్థాయిలో సజావుగా పనిచేస్తూ రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎరువుల పంపిణీ >>2



ప్రమాద స్థలంలో తుఫాను వాహనం

# రెండు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

## మాచర్లలో నలుగురు, పీలేరులో ముగ్గురు

**మాచర్ల, జూన్ 26 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా మాచర్ల సమీపంలోని నగరవనం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుంచి పొదిలికి వెళ్తున్న తుఫాన్ వాహనం రోడ్డుపై ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. తుఫాను వాహనంలో మొత్తం 13 మంది ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారమందుకున్న >>2



# ముదిరిన అయోధ్య విరాళాల వివాదం

## ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, మరో సభ్యుని రాజీనామా

## 8 మంది నిందితుల అరెస్టు

5లో

## సాయికృష్ణ అదృశ్యం కేసు

# మరో ముగ్గురి కోసం గాలింపు

## ఘటనపై తీవ్రంగా స్పందించిన మానవ హక్కుల కమిషన్

## సిబిఐ దర్యాప్తు కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన సాయికృష్ణ తల్లి

**విజయవాడ.జూన్ 26, ప్రభాతవార్తప్రతినిధి:** లాకప్ డెత్ అయిన గాదే సాయికృష్ణ కేసులో సిట్ కీలక ఆధారాలను సేకరిస్తుంది. ఇప్పటికే ఈ కేసులో సీఐ నాగరాజుకు అతడి స్నేహితుడు, ఇద్దరు సిబ్బంది సహకరించినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించింది. నాగరాజు అరెస్టుతో హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, నాని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో శుక్రవారం హెడ్‌కానిస్టేబుల్ అశోక్ ఇంటికి సిట్ పోలీసులు వెళ్లారు. అతను ఇంట్లో లేకపోవడంతో పోలీసులు తిరిగి వచ్చేసారు. ఈ కేసులో సీఐ నాగరాజును రిమాండ్ నుంచి తమ కస్టడీకి అప్పగించాలని సీట్ విజయవాడ కోర్టు పిటిషన్ వేసింది. సాయికృష్ణ కేసులో నిందితుడు నాగరాజు నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని 12 రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. అరెస్టు చేశాక విచారణకు సమయం లేకపో యిందని, దీనివల్ల పూర్తి వివరాలు రాలేదని పిటిషన్‌లో పేర్కొం ది. కౌంటర్ దాఖలుకు సమయం కావాలని నాగరాజు తరఫు న్యాయవాది సమయం కోరడంతో 29వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ఈ క్రమంలో సిట్ పలువురు అనుమాని స్తోంది, సిఐకి లాకప్‌డెత్‌లో సహకరించినకానిస్టేబుళ్లు సురేశ్, అశోక్, నాని ముగ్గురూ వడ్డేశ్వరం వెళ్లారని సిట్ గుర్తించింది. ప్రస్తుతం పరారీలో ఉన్న ముగ్గురి కోసం సిట్ అధికారులు గాలిస్తు న్నారు. మే 29న వడ్డేశ్వరం వెళ్లిన సీసీ ఫుటేజ్‌ను సిట్ స్వాధీనం చేసుకుంది. సీడీఆర్, సీసీ ఫుటేజ్ ఆధారంగా సాయికృష్ణ అదృ శ్యం కేసులో ముగ్గురు కీలకంగా ఉన్నారని సిట్ గుర్తించింది. సాయికృష్ణ మృతదేహాన్ని ఏం చేశారు? ఎక్కడ పడేశారు? అన్న వాటిపైనా సిట్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కస్టడీలోనే మరణించినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న ప్రత్యేక దర్యాప్తు బృందం పూర్తి వివరాల కోసం విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ బృందం సాయికృష్ణను మా ర్కాపురం నుంచి తీసుకొచ్చి కృష్ణలంక స్టేషన్‌లో అప్పగించినట్లు తేలింది. మే 6 నుంచి 8వ తేదీ వరకు స్టేషన్‌లో ఉన్నా ఆ తర్వాత ఏమయ్యాడో మిస్టరీగా మారింది. స్టేషన్‌లో మొత్తం 60 మంది సిబ్బంది ఉన్నారు. వీరిని అందరినీ సిట్ ప్రశ్నించి, స్టేట్ మెంట్లు రికార్డు చేస్తోంది. కృష్ణలంక స్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజీ మాయంపైబాధ్యులు రికార్డులు సమర్పించేలా >>2



# తరుణ వ్యాధులకు చెక్

## అన్ని పంచాయతీల్లో ముందస్తు చర్యలు: డి.సిఎం పవన్

### దోమల నియంత్రణపై అధికారులతో సమీక్ష

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల్ని ఆదేశించారు. 'ఫ్రైడే – డ్రైడే' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. క్రమం తప్పకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయాలి. శుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో తరుణ (సీజనల్) వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు పారిశుధ్య నిర్వహణ, మంచినీటి భద్రత, దోమల నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయగలుగుతామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయపద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామంలో క్రమం తప్ప కుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. సోషల్‌మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలనిసూచించారు. పాఠశాలలు, >>2





గ్రానైట్ లారీ దగ్ధమవుతున్న దృశ్యం ఓబుల్‌రెడ్డి(ఫైల్)

# చెట్టును ఢీకొని దగ్ధమైన లారీ

## ఉరవకొండ మండలంలో దుర్ఘటన డ్రైవర్ ఓబుల్ రెడ్డి సజీవ దహనం, తీవ్రగాయాలతో బయటపడిన క్లీనర్

**ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త:** అనంతపురం–బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో ఉరవకొండ మండలం కొట్టాలపల్లి–బూదగవి గ్రామాల మధ్య శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డుప్రమాదం విషాదం నింపింది. గ్రానైట్ లోడ్‌తో వెళుతున్న లారీ ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొని బోల్తాపడి లారీ దగ్ధంకాగా లారీలో మంటలు చెలరేగి డ్రైవర్ ఓబుల్‌రెడ్డి (41)సజీవ దహనమయ్యాడు. అతికష్టం మీద క్రీనర్ పుల్లయ్య ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి ఉరవకొండ సీఐ బి.మహానంది తెలిపిన మేరకు వివరాల్లో వెళితే కర్నాటక రాష్ట్రం బళ్లారి సమీపంలోని ఈఁలకల్‌నుంచి గ్రానైట్ లోడతో లారీ అనంతపురం–బళ్లారి >>2

# నడక భక్తులకు 'దివ్య దర్శనం' లేదా?



రోజా అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో తిరుమల చేరుతున్న 20వేల మంది

## 14 సంవత్సరాల క్రితం ఆరంభించిన పథకానికి తిలోదకాలు!

## టోకెన్లను పునరుద్ధరించాలని కోరుతున్న భక్తులు

**తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:** కాలినడకన ఏడుకొండలకు నడచివచ్చే భక్తుల సౌలభ్యం కోసం ప్రవేశపెట్టిన దివ్యదర్శనం టోకెన్లకు నేడు టిటిడి పెద్దలు పూర్తిగా చరమగీతం పెట్టేశారు. మెట్లదారిలో తిరుమలకు వచ్చే భక్తులకు మరింత త్వరగా దర్శనం చేయించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సాధారణ సర్వదర్శనం కంటే ,సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లకంటే దివ్యదర్శనం టోకెన్‌లు కలిగిన భక్తులకు రెండుగంటలు ముందుగానే శ్రీవారి దర్శనం చేసుకునే వెసలుబాటు ఉండేది. ఇప్పుడు ఆ దివ్యదర్శనాన్ని పూర్తిగా రద్దుచేసే శారు. దీంతో కాలినడకన వచ్చినా భక్తులకు సర్వదర్శన టైమ్‌స్లాటే అమలవుతోంది. రోజువారీగా 20వేలమంది వరకు భక్తులు కాలినడకన అలిపిరి, శ్రీవారిమెట్టుమార్గాల్లో తిరుమలకు చేరుకుంటున్నారు. ఇలా వస్తున్న భక్తులకు వీలైనంత త్వరగా వెంకన్న దర్శనం చేయించాలని దాదాపు 14 సంవత్సరాల క్రిందట దివ్యదర్శనం పేరుతో టోకెన్లు జారీ చేసే విధానం అమలుచేశారు. తొలుత ఈ టోకెన్‌లు కలిగిన భక్తులకు ఒక లడ్డూఉచితంతోబాటు మరో లడ్డూ అదనంగా రెండులడ్డూలు మంజూరు చేశారు. ఆ తరువాత 2014లో ఏర్పాటైన తెలుగుదేశం ప్రభుత్వంలోని టిటిడి బోర్డుపెద్దలు ఈ పథకానికి తిలోదకా లిచ్చేశారు. వరుసగా కొలువుదీరిన టిటిడి బోర్డులు రకరకాలుగా లడ్డూ ప్రసాదాలను కుదిస్తూ చివరకు 2019లో ఏర్పాటైన వైసిపి ప్రభుత్వంలోని టిటిడిబోర్డు పెద్దలు అన్నిదర్శనాల భక్తులకు ఒకలడ్డూ ఉచితంగా అందించేలా ఆమోదించి అమలు చేస్తున్నారు. లడ్డూల కోసం కాకున్నా >>2

27-6pg2exHMNWJQE.qxd:27-6pg2exHMNWJQE.qxd 1/1/02 6:49 AM Page 1





ద్రాక్షారామం మార్కెట్‌లో దగద్ధమౌతున్న దుకాణ సముదాయాలు

## ద్రాక్షారామంలో అగ్నిప్రమాదం:

# 48 దుకాణాలు బూడిద.. రూ.3 కోట్ల నష్టం!

**,రామచంద్రపురం,జూన్ 26 (ప్రభాత వార్త):** డా బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామంలోని స్థానిక మార్కెట్ సముదాయంలో గురువారంఅర్ధరాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా చెలరేగిన మంటలు క్షణాల వ్యవధిలోనే వ్యాపించి,సుమారు 48కి పైగా కూరగా యలు, మాంసం, కిరాణా దుకాణాలను పూర్తిగా బూడిద చేశాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 కోట్ల వరకు ఆస్తినష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న రామచంద్రపురం, మండపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. **రూ.60 లక్షల తక్షణ సాయం ప్రకటించిన మంత్రి:** ప్రమాద స్థలాన్ని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జాయింట్ కలెక్టర్ వై.ఖోం నైదియా దేవి, ఎస్పీ రాహుల్ మీనా, ఇతర ప్రజాప్రతినిధులు పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ స్పందిస్తూ.. తన తండ్రి ఖసత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌ఖ ద్వారా రూ.20 లక్షలు, అలాగే ఇతర దాతల నుంచి మరో రూ.40 లక్షలు.. మొత్తంగా రూ.60 లక్షల ఆర్థిక సహాయాన్ని కేవలం గంట వ్యవధిలోనే సేకరించి ప్రకటించారు. ప్రభుత్వం తరపున డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా పూర్తి సాయం అందిస్తామని జేసీ హామీ ఇవ్వగా, పోలీస్ శాఖ తరపున ఎస్పీ రాహుల్ మీనా రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు.

# సకాలంలో సబ్సిడీ ఎరువులు

>> కొనసాగు తోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ ఎరువుల పంపిణీలో చోటుచేసుకున్న అక్రమాలు, మళ్లింపులు, నిల్వలు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాల వంటి అవకతవకలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడానికే ఏపిఐఎంఎస్ 2.0 వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ పారదర్శక విధానం అమలులోకి రావడంతో అక్రమాలకు అవకాశం లేకుండా పోయిందని, దీంతో కొందరి స్వార్థ ప్రయోజనాలకు గండిపడిందని పేర్కొ న్నారు.గతంలో తనకు అనుకూలమైన కొందరు డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా యూరియా, డీఏపీ వంటి సబ్సిడీ ఎరువులను అక్రమంగా మళ్లించే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఏపిఐఎంఎస్ 2.0 వల్ల అలాంటి అక్రమాలకు పూర్తిగా చెక్ పడిందన్నారు. వాస్తవాలను వక్రీకరించి రాజ కీయ లబ్ధిపొందాలని చేసే ప్రయత్నాలను రైతులు విశ్వసిం చరని, పారదర్శక పాలనతో నిజమైన రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 2026-27 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో పొగాకుఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

# నడక భక్తులకు ‘దివ్య దర్శనం’ లేదా?

>> దేశంలోని నలుమూలల నుండి వస్తున్న భక్తులు ఏడుకొండలవాడిపై భక్తితో, తమ మొక్కుబడుల్లో భాగంగా కాలినడకన తిరుమలకు వస్తుండటం పరిపాటి. ఇలా కాలినడకన తిరుమలకు చేరుకునే భక్తులకు “దివ్య”దర్శనమ్ టోకెన్లు జారీచేసే విధానం అమలు చేశారు. అయితే కరోనా సమయంలో వీటిని రద్దుచేసినా ఆ తరువాత మళ్ళీ పునరుద్ధరణ జరగలేదు. టిటిడి బోర్డు పెద్దలు, టిటిడి అధికారులు సామాన్యభక్తులకు మరింత తక్కువసమయంలో సంతోషంగా శ్రీవారి దర్శనం చేయించా లనే తపనతో వినూత్న ఆలోచనతో ఎఐ అమ లు చేస్తున్నారు. అయితే కాలినడక భక్తులకు కూడా సర్వ దర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లే జారీచేస్తుండటంతో దర్శ నానికి సాధారణ రోజుల్లోనూ దాదాపు ఆరేడుగంటలపైనే నిరీక్షణ తప్పడంలేదు. 2020సంవత్సరం వరకు వేంకటేశ్వరస్వామి దర్శనంలో కాలినడకన వచ్చే భక్తులకు ప్రత్యేకంగా దివ్యదర్శనమ్ పేరుతో అలిపిరి ,శ్రీవారిమెట్టు నడకమార్గంలోనే టోకెన్లు జారీచేసేవారు. రోజువారీగా 15వేల టోకెన్ల వరకు అందుబాటులో ఉండేది. అయితే ఇవి పునరుద్ధరణ చేయకపోవడంతో కాలినడకన అలిపిరి, శ్రీవారిమెట్టుమార్గంలో చేరుకునే భక్తులకు సర్వదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లే జారీఅవుతున్నాయి. ఈ టోకెన్లు కూడా అలిపిరి భూదేవికాంప్లెక్స్‌లోని కౌంటర్లలో జారీచేస్తు న్నారు. భక్తుల రద్దీని బట్టి టోకెన్లు అందుకున్న భక్తులకు మరుసటిరోజు దర్శనం కేటాయిస్తున్నారు. టోకెన్లు అం దుకున్న భక్తులు అదేరోజు రాత్రి తిరుమలకు చేరుకుంటే వారికి వసతి సౌకర్యం కూడా దొరకడంలేదు. అలిపిరి నడకమార్గంలో ఇప్పటికీ టోకెన్లు పునరుద్ధరణ కాలేదు. ఇప్పుడు అలిపిరి భూదేవికాంప్లెక్స్‌లో జారీచేస్తున్న టైమ్‌స్లాట్ సర్వదర్శనమ్ టోకెన్లు అందుకున్న భక్తులు కాలినడకన లేక రోడ్డుమార్గంలో కూడా తిరుమలకు చేరుకుని ఇష్టదైవమ్ దర్శనం చేసుకునే వెసలుబాటు ఉంది. ఇలా రోజుకు శ్రీవారిమెట్టుమార్గంలో ఐదువేలమందివరకు ,అలిపిరి మార్గంలో 15వేలమంది వరకు భక్తులు వస్తున్నారనేది టిటిడి వర్గాల సమాచారం. నడకదారిలో కొండకు వచ్చినా సాధారణ సర్వదర్శనమ్‌లోనే వైకుంఠమ్ -2నుండి ,రద్దీ పెరిగితే ఆలయంవెలుపల క్యూలైన్లనుండి ప్రవేశించాల్సి వస్తోంది.

**నడకదారుల్లో టోకెన్లు ఇవ్వరా!?:** సాధారణంగా తిరుమలకు రోజువారీగా లక్షమందివరకు భక్తులు వస్తుంటే వారిలో 15వేలమంది నుండి 20వేలమంది భక్తులు కాలినడక మార్గాల్లోనే చేరుకుంటున్నారు. మరీ వారాంతం శుక్ర,శని,ఆదివారాల్లో ఈ రద్దీ 25వేలమంది వరకు కనిపిస్తుంది. ఇప్పుడు శ్రీవారిమెట్టుమార్గానికి సంబంధించి కేవలం 3వేల టోకెన్లు మాత్రమే టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ చేస్తున్నారు. భక్తుల రద్దీ పెరిగినా ఆ తరువాత మరుసటిరోజే టోకెన్లు జారీ చేస్తారు.

**శ్రీవారిమెట్టుమార్గంలో నడచివచ్చే భక్తుల టోకెన్లు:** స్కానింగ్‌ను 1200వ మెట్లువద్ద జరుగుతుంది. భక్తులకు ఎలాంటి ఇబబందులు,అసౌకర్యం లేకుండా మెట్లవద్ద జారీచేసే టోకెన్లు కౌంటర్లను ఏకంగా శ్రీనివాసమంగాపురంలోని కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలోపలకు మార్చాలని 2025లోనే నిర్ణయించారు. ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకునే దిశగా కార్యాచరణ రూపొందించారు. దీనికోసం పురావస్తుశాఖ అధికారులకు లేఖలు రాశారు. అయితే ఇంతవరకు అతీగతీ లేదు. అలిపిరి నడకమార్గంలోనూ టోకెన్లుజారీని పునరుద్ధరించాలని గతంలోనే నిర్ణయించారు. అయితే ఇప్పటికీ దివ్యదర్శనమ్ టోకెన్లు మాత్రం జారీచేయడంలేదు.కాలినడకన తిరుమలకు చేరుకున్న భక్తులను గతంలో దివ్యదర్శనమ్ కాంప్లెక్స్ క్యూలైన్లనుండి అనుమతించి వీరికి త్వరగా ఆ దేవదేవుని దర్శనం చేయించేవారు.ఇప్పుడా పరిస్థితులు లేకపోవడంతో కాలినడకన వచ్చేభక్తులకు అసౌకర్యం ,ఇబ్బందులు తప్పడంలేదు..దివ్యదర్శనం పునరుద్ధరిస్తారా లేకమంగళం పాడేస్తారా అనేదిభక్తుల్లోఅయోమయం నెలకొంది.

# అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తత!

## హార్ముజ్ నౌకలపై దాడులకు పాల్పడుతున్న ఇరాన్: ట్రంప్

**వాషింగ్టన్,జూన్ 26:** మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి చెలరేగుతున్నాయి. హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు.సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందించిన ట్రంప్ ఇరాన్ కనీసం నాలుగు వన్‌వే అటాక్ డ్రోన్లను నౌకలపై ప్రయోగించిందని తెలిపారు. వాటిలో ఒక డ్రోన్ భారీ కార్గో నౌక ఎగువ డెక్‌ను ఢీకొని నష్టాన్ని కలిగించిందన్నారు. అయితే అమెరికా బలగాలు మిగిలిన మూడు డ్రోన్లను కూల్చివేశాయని చెప్పారు.ఈ దాడి ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి స్పష్టమైన ఉల్లంఘన అని ట్రంప్ విమర్శించారు. దాడికిగురైన నౌక పేరు లేదా ఘటన జరిగిన ఖచ్చితమైన సమయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు.ఇదిలా ఉండగా, ఓమన్ తీరానికి సమీపంలో ఓ వాణిజ్య నౌక గుర్తు తెలియని ప్రక్షేపక దాడికి గురైనట్లు యునైటెడ్ కింగ్‌డమ్ సముద్ర భద్రతా సంస్థ యూకేఎంటీఓ వెల్లడించింది. నౌక కుడివైపు భాగంలో దాడి జరగడంతో బ్రిడ్జ్‌కు నష్టం వాటిల్లిందని తెలిపింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది.ప్రస్తుతం అమెరికాఇరాన్ మధ్య శాశ్వతంగా యుద్ధానికి ముగింపు పలికే దిశగా చర్చలు కొనసాగుతున్నాయి.హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు, ఇరాన్ అధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వల భవిష్యత్తు వంటి కీలక అంశాలపై ఇరుదేశాలు చర్చిస్తున్నాయి. ఈ నెలప్రారంభంలో కుదిరిన తాత్కాలిక ఒప్పందంప్రకారం 60రోజుల్లో తుది నిర్ణయానికి రావాల్సి ఉంది.

# తరుణ వ్యాధులకు చెక్

>>అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే తాగు నీటి నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. తాగు నీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలు అనేవి కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా, అవి నిశ్శ బ్దంగా ఆరోగ్యాన్ని నాశనం చేస్తూ, కుటుం బాలను ముక్కలు చేస్తూ, మన సమాజ పునా దులనే బలహీనపరిచే ఒక తీవ్రమైన సామాజిక సవాలు అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

>> చేశారు. కేవలం స్నేహితుల ఒత్తిడి వల్లే 60 నుంచి 70 శాతం మంది వీటికి బానిసలవు తున్నారని, ఇలాంటి అలవాట్లు చేసే స్నేహితులు శత్రువులతో సమానమని హెచ్చరించారు.ఎన్నో కష్టాలకోర్చి, తమ స్థాయికి మించి పిల్లలను హాస్టల్స్ లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను యువత అపహాస్యం చేయవద్దని కోరారు. ఒక్కసారి గంజాయికి బానిసైతే జైలు పాలవ్వడం ఖాయమని, ఈ మధ్య కాలంలో తల్లిదండ్రులు కూడా ఇలాంటి పిల్లలకు బెయిల్ ఇప్పించడానికి ముందుకు రావడం లేదని గుర్తుచేశారు. గతంలో డ్రగ్స్ బారిన పడేవారి సగటు వయసు 25 ఏళ్లు ఉండగా, అది క్రమంగా 20 నుండి18 ఏళ్లకు అంతకంటే తక్కువకు పడిపోవడం యువత భవిష్యత్తుకు పెద్ద ఉపద్రవంగా భావించవచ్చునన్నారు.సమాజంలో ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నా లేదా విక్రయిస్తున్నా వెంటనే ఈగల్ టీమ్‌కు గానీ, టోల్ ఫ్రీ నెంబర్లకు గానీ సమాచారం అందించాలన్నారు. నెంబర్లు గుర్తులేకపోతే యూనివర్సల్ నెంబర్ 112 కు లేదా ఏ ప్రభుత్వ విభాగానికైనా సమాచారం ఇచ్చి, ఈ భూతాన్ని మొక్కలోనే తుంచివేయాలన్నారుడ్రగ్ ట్రాఫికింగ్‌పై జీరో టాలరెన్స్ విధానంతో ప్రభుత్వం ముందుకు వెలుతోందన్నారు. ప్రతి కుటుంబానికి సురక్షిత భవిష్యత్తు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ‘డ్రగ్స్ వద్దు బ్రో’ ప్రచారానికి ప్రజలంతా సహకరించాలని పిలుపునిస్తూ డ్రగ్స్ వద్దు బ్రో హాష్ ట్యాగ్‌కు తన పోస్టును సీఎం చంద్రబాబు ట్యాగ్ చేశారు.

## మాదకద్రవ్య రహిత భారత్‌ను నిర్మిద్దాం: అమిత్‌షా

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్)సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు.శుక్రవారం ఆయన ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,పోలీసు ఉన్నతాధికారులు,నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్‌పై వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు 2047 నాటికి డ్రగ్స్ రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఇందుకు సాంకేతికత సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు.ముఖ్యంగా మాదక ద్రవ్యాలు సరఫరా,విక్రయం చేసే వారిపై కఠినంగా మరియు జీరో టోలరెన్స్ గా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన నిఘా ఉంచి కింగ్ పిన్ లను పెట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలన్నారు. విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎపిలో ఈగల్ పోలీసు విభాగం ప్రత్యేక రాష్ట్ర స్థాయి మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్ధవంతంగా పనిచేస్తోందని చెప్పారు.ఒకప్పుడు ఆంధ్రఒడిశా సరిహద్దు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలులో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని అన్నారు. రైల్వే నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రాల మధ్య జరిగే మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు,జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్,ఈగిల్ మరియు శునక దళాలను సంయుక్తంగా మోహరించి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈగల్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన డేటా సెంటర్‌ను నిర్వహించడంతో పాటు రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని తెలిపారు.ఈవీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ,ఈగల్ ఎస్పి ఆపరేషన్స్ కెయం. మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎన్సిబి ఎస్పి జెడి పంకజ్,ఎన్సిబి డిఎస్పి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.త

# మరో ముగ్గురి కోసం గాలింపు

>> ఆదేశాలు ఇవ్వాలని విజయలక్ష్మి మ్మ మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయవాది సతీష్‌బాబు వాదనలు వినిపించారు. సాయికృష్ణ మృతదేహం ఏమైందో రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొనలేదన్నారు. ప్రతి స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరుపై పర్యవేక్షించాల్సిన బాధ్యత జిల్లాస్థాయి కమిటీకి ఉందని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం సీసీటీవీ ఫుటేజీ కోసం జిల్లా స్థాయి కమిటీకి నోటీసులిచ్చింది. నిందితుడిగా ఉన్న నాగరాజుకూ నోటీసులు ఇచ్చింది. విచారణను ఈనెల 29కి కోర్టు వాయిదా వేసింది. ఇక సాయికృష్ణ లాకప్ డెత్ ఉదంతంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణకు చెందిన హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని ఇచ్చిన ఫిర్యాదుతో కస్టడీ హింసపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్రంగా స్పందించింది. విజయవాడలో అక్రమ నిర్బంధం, హింస నిజమేనని ప్రాథమిక విచారణలో సిట్‌సైతం నిర్ధారించింది.అంతే కాకుండా సాయికృష్ణ లాకప్ డేత్‌ను సిట్ సిఐ నాగరాజు రిమాండ్ రిపోర్టులోను స్పష్టం చేసింది.చేసింది. డిలీట్ చేసిన సీసీటీవీ ఫుటేజీని వెంటనే రికవరీ చేయాలని, నదిలో కలిపిన బాధితుడి అస్థికలను వెలికితీయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నమోదైన ఎఫ్‌ఐఆర్ స్టేటస్, నిందితుల పూర్తి వివరాలు, బాధిత కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారంపై వారం రోజుల్లోగా సమగ్ర యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (సమర్పించిన నివేదిక) ఇవ్వాలని ఏపీ పోలీస్ బాసులకు అల్టిమేటం జారీ చేసింది. తన కుమారుడు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసును సీబీఐ లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని కోరుతూ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి మ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే సాయికృష్ణను కోర్టు ముందు హాజరు పర్చాలని విజయలక్ష్మి కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలోనే కేసులో సీబీఐ లేదా స్వతంత్ర దర్యాప్తును కోరుతూ శుక్రవారం ఆమె హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో పోలీస్ ఉన్నతాధికారుల పాత్ర ఉందని, వాస్తవాలను తొక్కిపెడుతున్నారని విజయలక్ష్మి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర పోలీస్ యంత్రాంగంతో సంబంధం లేని స్వతంత్ర దర్యాప్తు సంస్థకు సాయికృష్ణ అదృశ్యం కేసును అప్పగించాలని ఆమె కోరారు.

## మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించండి: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 26,ప్రభాత వార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆర్టీజీఎస్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల ప్రగతిపై ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ శాఖల సమాచారాన్ని క్రోడీకరించేందుకు చేపట్టిన డేటాలేక్ పనులన్నీ జులై నాటికి పూర్తికావాలని మంత్రి ఆదేశించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో అడ్డంకులు తొలగించాలి. రేషన్ కార్డుల విభజన, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం, తొలగించే ప్రక్రియను మరింత సులభతరం చేయాలి. సంజీవని కార్యక్రమాన్ని కూడా డేటా లేక్ తో అనుసంధానించాలి. పాఠశాలల్లో డ్రాప్ అవుట్లను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, తగ్గించడానికి గల మార్గాలను అన్వేషించాలి. విద్యారంగంలో సమగ్ర సమాచారాన్ని ట్రాక్ చేస్తున్నాం. అన్ని శాఖల సమాచారం డేటా లేక్ ద్వారా అనుసంధానం కావాలని మంత్రి సూచించారు. మనమిత్ర ప్రజలకు మరింత చేరువ కావాలి అన్నారు.ప్రజల్లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై మరింతగా అవగాహన కలిగేలా నెలరోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలకు కలిగే ఉపయోగం, వినియోగం, పై వివరించాలన్నారు.

# టీచర్లే ఛేంజ్ మేకర్లు

>> శాలను స్కూలు, క్లస్టర్, మండలాల్లో అమలు చేసేందుకు నాయకత్వం వహించండి. సహ టీచర్లకు మెంటరింగ్ చేయండి. టీచర్ - స్టూడెంట్ - సబ్జెక్ట్ రిలేషన్ షిప్ ముఖ్యం. ప్రస్తుతం మనం మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టి, సాఫ్ట్ వేర్ మర్చిపోతున్నాం. రాష్ట్రంలో లీప్ మోడల్ విద్యావ్యవస్థ సాధనకు కలిసికట్టుగా పనిచేయాలి. టీచర్లు బోధనపైనే శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యావ్యవస్థలో ఆశించిన మార్పు తేవడం వెనువెంటనే సాధ్యం కాదు, ఇందుకు కొంత సమయం పడుతుంది. రాష్ట్రంలో మనం చేపట్టిన సంస్కరణల కారణంగా ఈ ఏడాది లక్షమందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మారారు, ఇది శుభపరిణామం, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మించిన టీచర్లు ప్రైవేటు స్కూళ్లలో లేరు, ఆదర్శవంతమైన విద్యావ్యవస్థ (ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్) సాధనకు మీ సహకారం కావాలి, కలిసికట్టుగా పనిచేసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలి, లక్షలాదిమంది బిడ్డల భవిష్యత్తు మనపై ఆధారపడి ఉంది. ఈరోజు దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ గురించి చర్చ జరుగుతోంది. ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో పోటీపడాలి, ఉపాధ్యాయులకు నామద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి లోకేష్ చెప్పారు. ఎటువంటి పైరవీలకు తావులేకుండా టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తెచ్చి సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకంగా ప్రమోషన్లు ఇచ్చాం. మీకుఅత్యంత శక్తి, సామర్థ్యాలు ఉన్నాయి, ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ ను ప్రపంచానికి చాటిచెప్పాలి, ఇందులో భాగంగా ఇప్పుడు తొలిఅడుగు వేశాం... అభ్యసన ఫలితాలు, ఎనలిటికల్ థింకింగ్ పై దృష్టిసారించాలి. విద్యావ్యవస్థలో అన్ని సమస్యలను ఒకేరోజు పరిష్కరించడం సాధ్యం కాదు,ప్రాధాన్యత క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తాం, ప్రజాప్రభుత్వం మీ వెంట ఉంది, విద్యారంగంలో ఏపీని నెం.1గా తయారుచేసేందుకు సమిష్టిగా కృషిచేద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. సింగపూర్ టూర్ ద్వారా ఉపాధ్యాయులు వివిధ అంశాలపై కెపాసిటీ బిల్డింగ్ పై శ్రద్ధవహించాలి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75ఏళ్ల వయసులో ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉంటారు. ఇటీవల ఆయన సింగపూర్ వెళ్లి ప్రధాని, ఇతర మంత్రులను కలిసి పలు కొత్తవిషయాలపై అధ్యయనం చేశారు, గతకొంతకాలంగా ప్రభుత్వ టీచర్లకు గౌరవం పెరిగింది, మీరు లీడర్లుగా, ఛేంజ్ మేకర్స్ గా తయారుకండి, మీకు అండగా మేముంటామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ తమీమ్‌అన్సారియా,ఎస్ సీఈఆర్ టీ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెట్టును ఢీకొని దగ్ధమైన లారీ

>>42వ నంబర్ జాతీయ రహదారి గుండా నెల్లూరు జిల్లాలోని క్రిష్ణపట్నం పోర్టుకు బయలు దేరింది. లారీ శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో విడనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామ దాటి బూదగవి గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్టుకు బలంగా ఢీకొని బోల్తా పడింది.దీంతో క్షణాల్లోనే డీజిల్ ట్యాంక్ పేలి లారీ క్యాబిన్‌కు నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఘోర ప్రమాదంలో లారీడ్రైవర్ ఓబుల్‌రెడ్డి క్యాబిన్ లోపలే చిక్కుకు పోయి బయటకురాలేక లారీతోపాటే సజీవ దహన మయ్యాడు. లారీ క్లీనర్ పుల్లయ్య మాత్రం అతికష్టం మీద లారీ నుండి ప్రాణాలతో బయటపడ్డాడు. లారీక్లీనర్ పుల్లయ్యను సీఐ బి.మహానంది విచారించి ఆయన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఘోర ప్రమాదంలో సజీవ దహనమైన లారీడ్రైవర్ఓబుల్‌రెడ్డి కడపజిల్లా పులివేందుల నియోజకవర్గంలోని లింగాల మండలం కర్ణ పాపయ్యపల్లి వాసిగా గుర్తించారు.ఆయనకు భార్యరామలక్ష్మి, కొడుకు మహేంద్రనాథ్, కుమార్తె తేజశ్విని ఉన్నారు.

# కొత్తగా ఏడు బుల్లెట్‌ట్రైన్ కారిడార్లు

>> కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రూపొందించనున్నారు. సాధారణ సేవల్లో గంటకు 320 కిలోమీటర్ల వేగంతో నడిచేలా ప్రణాళిక సిద్ధం చేశారు. భవిష్యత్తులో దేశంలోని అన్ని కొత్త బుల్లెట్ ట్రైన్ మార్గాల్లో ఇవే ప్రధాన హైస్పీడ్ రైళ్లుగా మారనున్నాయి. ముంబై - పుణె,పుణె - హైదరాబాద్, హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై, చెన్నై - బెంగళూరు, ఢిల్లీ - వారణాసి, వారణాసి - సిలిగురి కారిడార్లు ప్రకటించింది. ఈ బుల్లెట్ ట్రైన్ కారిడార్లు అందుబాటులోకి వస్తే ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గుతుంది.ముంబై - అహ్మదాబాద్: 1 గంట 57 నిమిషాలు, ముంబై - పుణె: 48 నిమిషాలు, బెంగళూరు - చెన్నై: 73 నిమిషాలు, బెంగళూరు - హైదరాబాద్: 2 గంటల 10 నిమిషాలు, పుణె - హైదరాబాద్: 2 గంటల 8 నిమిషాలు, ఢిల్లీ - లక్నో: 2 గంటలు, ఢిల్లీ - వారణాసి 3 గంటల 15 నిమిషాలు తగ్గుతుందని ప్రకటించింది. ఇక దేశంలోని తొలి 508 కిలోమీటర్ల ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా గుజరాత్‌లోని సూరత్‌వాపి మధ్య 97 కిలోమీటర్ల విభాగంలో 2027 ఆగస్టు నాటికి బుల్లెట్ ట్రైన్ సేవలు ప్రారంభించాలని హైస్పీడ్ రైల్వే కారిడార్ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. బి35 బుల్లెట్ ట్రైన్ల అభివృద్ధితో భారత్‌లోనే అత్యాధునిక హైస్పీడ్ రైళ్ల తయారీకి ఊతం లభించనుంది. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ కారిడార్లలో వేగవంతమైన, స్వదేశీ సాంకేతికతతో రూపొందిన రైలు సేవలు అందుబాటులోకి రావడంతో రవాణా రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది.



శుక్రవారం తెల్లవారుజామున పీలేరు వద్ద నప్రమాదానికి గురైన కారు, ఆటో

# ఏడుగురు దుర్మరణం

>> పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, క్షతగ్రాతులను సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మృతుల వివరాలు, గాయపడిన వారి పరిస్థితిపై పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రమాద స్థలంలో మృతి చెందారు. మిగిలిన వారిని 108 వాహనం ద్వారా మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వైద్యులు వెల్లడించారు. వీరి స్వగ్రామం మార్కాపురం జిల్లా వెనిగండ్ల మండలం సీఎస్‌పురం నాగిరెడ్డిపాలెం. వీరు గత 20 సంవత్సరాలుగా హైదరాబాదులో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి బంధువు అంత్యక్రియలకు తుఫాను వాహనం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

**పీలేరులో.. పీలేరు , జూన్ 26 ప్రభాతవార్త:** అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఆరుగురు తీవ్రంగా గాయపడిన ఈ సంఘటన అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలో శుక్రవారం వేకువ జామున చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు పీలేరు మండలం రేగళ్ల కప్పాకు చెందిన మెహరూన్ (75) తన కోడలు ఇర్ఫానా పుట్టిన ఊరైన కలికిరి మండలం టి.చంద్రావారిపల్లె పంచాయతీ దూదేకుల పల్లెలో ఆమె తల్లిని చూసి అలాగే పీర్ల పండగ చూసి వస్తామని గురువారం రాత్రి ఆటోలో వెళ్లారు. అక్కడ పీర్ల ఊరిగింపు సంబరాలు ముగించుకుని శుక్రవారం వేకువజామున ఆటోలో తిరిగి స్వగ్రామం రేగళ్లకు బయలుదేరారు. పీలేరు మండలం రాణావడ్డిపల్లె మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారుఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో మెహరూనీతో పాటు మనవడు, ఆటోడ్రైవరు ముబారక్ (55) సంఘటనా స్థలంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో ఇర్ఫానా, ఆమె పెద్ద కుమారుడు మొహ్మద్ నౌహీద్(19), రెండవ కుమారుడు మొహ్మద్ (18),మొహరూనీ కుమార్తె హుస్సేనీ కుమారులైన మొహ్మద్ అజ్మల్, మొహ్మద్ ఆసీఫ్ పీలేరులో ప్రధమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. మార్గ మధ్యంలో మొహ్మద్ మృతి చెందాడు.

# వానలే వానలు!

## మూడు రోజులపాటు భారీ వర్ష సూచన

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత నుండి మధ్య మహారాష్ట్ర వరకు తెలంగాణ మరియు దాని పరిసర ప్రాంతాలపై నున్న ఉపరితల ఆవర్తనం మీదుగా ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ..దీని ప్రభావంతో రేపు చెదురుమదురుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు... ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు..శనివారం ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ,మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొన్నారు.ఆదివారం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే పొలాల్లో పనిచేసే రైతులు,శ్రామికులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

## వారం - వర్జ్యం

**27-06-2026, శనివారం**
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
త్రయోదశి రా.12.44, అనూరాధ రా.10.11
వర్జ్యం : తె.4.28-ఉ.6.16
దు.తె.5.37-ఉ.7.17
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. శ్రమకు అదృష్టం తోడవుతుంది. అనుకూల ఫలితాలు.

**వృషభం:** కోర్టుకేసులు పరిష్కారమవుతాయి. రాజకీయరంగం లోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మిథునం:** చిన్ననాటి మిత్రుల ద్వారా కీలక సమాచారం అందుకుంటారు. నష్టం రావల్సిన చోట నష్టం రాదు.

**కర్కాటకం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. పారిశ్రామిక వర్గాల వారికి అన్ని విధాల ప్రోత్సాహం లభిస్తుంది.

**సింహం:** పొదుపు పథకాల పట్ల ఎక్కువ ఆకర్షితులవుతారు. నూతన యత్నాలలో పురోగతి సాధిస్తారు. బంధువుల కలయిక.

**కన్య :** కీలక వ్యవహారాలలో అవరోధాలు ఏర్పడినా పూర్తి చేస్తారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులువుంటాయి.వాహనసౌఖ్యం.

**తుల:** ఉద్యోగులకు విధి నిర్వహణలో బాధ్యతలు పెరుగుతాయి. పారిశ్రామిక రంగాలలోని వారు సామరస్యం వహించాలి.

**వృశ్చికం:** ఆహార నియమాలలో జాగ్రత్త అవసరం. దానధర్మాలు చేస్తారు. శుభ కార్యాలను విజయవంతంగా పూర్తిచేస్తారు.

**ధనుస్సు:** మీ పేరును పలుకుబడిని, హోదాను ఉపయోగించి కీలకమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు.

**మకరం:** ఎంతటి వారికైనా మాటల చాతుర్యంతో ఆకట్టుకుంటారు. చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. కొత్త పరిచయాలు.

**మీనం:** తగాదాలు, వివాదాలకు దూరంగా వుండండి. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వేదాంతధోరణి అలవరచుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

27-6Pg3exHMNWJQEG.qxd:27-6Pg3exHMNWJQEG.qxd 1/1/02 7:09 AM Page 1






# యువశక్తే దేశానికి పెట్టుబడి

**● గంజాయి, మాదకద్రవ్యాలను నిర్మూలిస్తాం ● డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం ● హోం మంత్రి వంగలపూడి అనిత**

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో అత్యంత శక్తివంతమైన మానవ వనరులైన యువశక్తి భగ్నం కాకుండా, రాబోయే తరాల అభివృద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, ఏ తల్లిదండ్రులైనా ఒంట్లో బాగోలేని బిడ్డకు జీవితాంతం సేవ చేయడానికై సిద్ధపతారని చెప్పారు. కానీ.. గంజాయి మత్తులో పడి జైల్లో ఉన్న బిడ్డను విడుదల చేసేందుకు ఏ పేరెంట్స్ కూడా ముందుకు రారన్నారు. హోం మంత్రి అయిన కొత్తలో ఓ వ్యక్తి తనకు ఫోన్ చేసి చెప్పిన విషయం షాక్‌కు గురయ్యేలా చేసిందన్నారు. నాలుగో తరగతి చదువు తున్న పిల్లాడు గంజాయికి బానిసయ్యాడంటూ సదరు వ్యక్తి చెప్పిన విషయం విని భయాందోళనకు గురైనట్లు చెప్పారు. ఈగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని.. నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్స్ తిరుగుతున్నాయని హోం మంత్రి తెలిపారు. ఎక్కడో చెట్టు కింద కూర్చొని గంజాయి తీసుకున్నా కూడా డ్రోన్ పట్టేస్తుందన్నారు. అంత స్ట్రిక్ట్‌గా సర్వైలెన్స్ పనిచేస్తున్నాయని చెప్పారు. విజయవాడ కమిషనరేట్‌లో ఏ మూలకు వెళ్లినా సీసీటీవీ కెమెరాలు పనిచేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని.. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని యువతకు సూచించారు. చిన్న చిన్న ఆనందాల గురించి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని, తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చే పరిస్థితి తీసుకురావొద్దన్నారు. లీగల్ టీమ్ ఆపరేషన్ గరుడ పేరుతో మెడికల్ షాప్‌లను కూడా తనిఖీ చేస్తోందని అనిత తెలిపారు. గంజాయి పట్టడంలో పోలీస్ డాగ్‌లు ఉత్తమ అవార్డులు కూడా తెచ్చాయని తెలిపారు. మత్తు పదార్థాల సమాచారం ఉంటే 1972కి కాల్ చేయాలని.. ఇన్ఫర్మేషన్ ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి అందరి సహాయ సహకారాలు ఇవ్వాలని హోం మంత్రి అనిత పిలుపునిచ్చారు. గంజాయి రవాణా, సాగును అరికట్టడానికి 450 మంది సిబ్బందితో పనిచేస్తున్నఈగల్‌ఖి టాస్క్‌ఫోర్స్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని కొనియాడారు. గత గత ప్రభుత్వ కాలంలో ఏజెన్సీ పరిధిలో దాదాపు 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేదని దానిని ధ్వంసం చేశామని, ప్రస్తుతం అక్కడ గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించి ఖిజీరో కల్టివేషన్‌ఖి సాధించామని స్పష్టం చేశారు. లిక్విడ్ గంజాయి (హాష్ ఆయిల్) తయారీ కేంద్రాలపై కూడా కఠినచర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గంజాయి లేదా డ్రగ్స్ రవాణా చేసినా, దగ్గర పెట్టుకున్నా, కన్స్యూమ్ చేసినా ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. పట్టుబడితే కనీసం ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో ప్రతి మూలలోనూ సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి లేదా డ్రగ్స్ అమ్మకాలు, రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 1972 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని హోం మంత్రి పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హోమ్ మంత్రి అనిత హామీ ఇచ్చారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి, 20 సూత్రాల కార్యక్రమ అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఈగల్ వింగ్ ఎస్పీ కె. నగేష్ కుమార్, నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ సంస్థ రాష్ట్ర సమన్వయ అధికారి ఉమారాణి, తదితరు పాల్గొని ప్రసంగించారు. అనంతరం 'నా దేశాన్ని మాదక ద్రవ్యరహితంగా మార్చడానికి నా శక్తి మేరకు నేను కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఈగల్ వింగ్ ఏర్పాటుచేసిన స్టాల్స్ ను హోం మంత్రి పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నేచర్ క్యాంపెయిన్ లో "సే నోటు డ్రగ్స్"అని హోం మంత్రి అనిత, డ్రగ్స్ వద్దు బ్రో అని జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీ శా సిగ్నేచర్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఈగిల్ వింగ్ ఎస్పీ జి. స్వరూపారాణి, రాష్ట్ర స్థాయి దేవి ఇన్స్టిట్యూషనల్ సొసైటీస్ చైర్ పర్సన్ శ్రీమతి దేవి, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారి ఐఎఎస్ ఆర్ణ వీడియో చూసి నవ్వకుండా ఉండలేరు: సిఎం చంద్రబాబు




**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** సోషల్ మీడియాలో ఐఏఎస్ ఆర్ణగా ఎంతో గుర్తింపు పొందిన ఓ చిన్నారి పోస్ట్ చేసిన వీడియోపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సరదాగా స్పందించారు. ఈ వీడియోను చూసి నవ్వకుండా ఉండలేరంటూ ఆయన వ్యాఖ్యానించారు. చిన్నారి ఆర్ణకు తన పూర్తి మద్దతు ఉంటుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. ఇటీవల ఆర్ణ తండ్రి తన కుమార్తెకు సంబంధించిన ఓ వీడియోను ఎఐ సహకారంతో రూపొందించి సోషల్ మీడియాలో పంచుకున్నారు. నటుడు వెంకటేశ్ సినిమాలోని డైలాగులను బ్యాక్‌గ్రౌండ్‌లో జతచేసి ఈ వీడియోను రూపొందించారు. తన క్యూట్ హావభావాలతో ఆర్ణ ఆకట్టుకోవడంతో ఈ వీడియో క్షణాల్లో వైరల్ అయింది. లక్షలాది మంది నెటిజన్లు ఈ వీడియోను చూసి మురిసిపోయారు. ఈ వైరల్ వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా వెళ్లింది. దీనిపై ఆయన తన అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతాలో స్పందించారు. "సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిన్నారి ఐఏఎస్ ఆర్ణ వీడియో చూసి నవ్వకుండా ఉండలేరు" అని పోస్ట్ చేశారు. అంతేకాకుండా ఆర్ణకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని కూడా ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్పందనతో ఈ వీడియో ఇప్పుడు మరింతగా ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే సోషల్ మీడియా స్టార్‌గా ఉన్న ఆర్ణకు, సీఎం నుంచి ప్రశంసలు దక్కాయి.

# తిరుమల సమాచారం



## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

### - తిరుమలలో డిజిపి హారీష్‌కుమార్‌గుప్తా

**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసుశాఖలో స్నేహపూర్వక సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రజలకు పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించేలా చూస్తున్నామని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. తిరుపతి జిల్లా పోలీసు శాఖ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవారి ఆలయ భద్రతతోబాటు యాత్రికుల రక్షణకు పోలీసుశాఖ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. పూర్తిస్థాయిలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా ఆలయం పరిసరాలేగాక తిరుమల మొత్తం భక్తుల కదలికలపై నిఘా ఉంచుతున్నారన్నారు. టిటిడితో కలసి పోలీస్‌శాఖ భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. శుక్రవారం ఉదయం ఎపి డిజిపి హరీష్‌కుమార్‌గుప్త కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ స్వాగతం పలికారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర డిజిపి గుప్తాకు శ్రీవారితీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీవారి చిత్రపటం అందజేశారు.

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.45 లక్షలు విరాళం



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన సాయి బాలాజీ డెవెలపర్స్ సంస్థ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.45 లక్షలు విరాళంగా అందించింది. ఆ సంస్థ భాగస్వామి ఆకుల రవికుమార్ తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిలను అందజేశారు.

## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్‌కుమార్, జస్టిస్ సుబేందుసమంత, జస్టిస్ దుర్గాప్రసాద్, జస్టిస్ బులుసు శివశంకరరావు తదితరులు ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ



**నెల్లూరు(కలెక్టరేట్), జూన్ 26 ప్రభాతవార్త:** మొదటి రోజు బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ సందల్ మాలీతో మొదలవుతుంది. 2026లో ఈ పండుగ జూన్ 26, శుక్రవారం నుంచి మొదలైంది. మొదటి రోజు కార్యక్రమం సందల్ మాలీ / సొందల్ మాలీ. దర్గాలోని 12 మంది వీరుల సమాధులకు ఔషధ లేపనం/గంధం పూస్తారు. ఇదే పండుగ ప్రారంభ వేడుక. భక్తులు చెరువులో స్నానం చేసి, తమ కోర్కెల రొట్టెలు తీసుకొని ఒకరికొకరు మార్చుకుంటారు. మొక్కు తీరినవాళ్లు తెచ్చిన రొట్టెను కొత్తగా మొక్కుకునే వాళ్లు తీసుకుంటారు దర్గా దర్శనం చేసుకొని 12 మంది వీరుల సమాధులకు మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది 1416 లక్షల మంది వస్తారని అంచనా. భద్రత, శానిటేషన్, మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేశారు.

# నేర నియంత్రణలో తిరుపతి జిల్లా భేష్

**● మెరుగైన ప్రజా సేవల దిశగా కార్యక్రమాలు ● డిజిపి హారీష్‌కుమార్ గుప్తా**



**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రాలకు నిలయమైన తిరుపతి జిల్లాలో అటు యాత్రికుల ఇటు ప్రజల భద్రతకు ఆధునిక సాంకేతిక ఆధారిత పోలీసింగ్ విధానం అమలుచేస్తుండటం అభినందనీయమని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. పోలీస్ సంక్షేమం, మెరుగైన ప్రజా సేవల దిశగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా డిజిపి అభినందించారు. ఇదే స్ఫూర్తితో యాత్రాస్థలం, నిత్యం విఐపిల తాకిడి ఉండే తిరుపతిజిల్లాలో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్, జిల్లా పోలీస్ కార్యాలయం ప్రధాన ప్రవేశ ద్వారం (గ్రౌండ్ గేట్), ప్రహరీగోడ నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతలు, నేర నియంత్రణ, పోలీస్ సంక్షేమం, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌పై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిపారు. డ్రోన్లు, సైబర్ మానిటరింగ్‌తో పటిష్ట భద్రతా వ్యవస్థ నిర్వహిస్తుండటం పట్ల డిజిపి ప్రశంసించారు. మాదకద్రవ్యాల విక్రయాలు, వాడకం నిర్మూలనలో తిరుపతి పోలీసుల చర్యలు పూర్తిస్థాయిలో సత్ఫలితాలు నిస్తున్నాయన్నారు. శాంతిభద్రతల విభాగం అదనపు డిజిపి మధుసూదన్ రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసులుతో కలసి శుక్రవారం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు.

జిల్లా పోలీసింగ్, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత, పోలీస్ సంక్షేమం తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న పోలీసింగ్ విధానాలు, ప్రజా భద్రత చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణపై సమగ్ర ప్రజెంటేషన్‌ను ఎస్పీ సుబ్బరాయుడు అందించారు. కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, సిపి కెమెరాల పర్యవేక్షణ, రాత్రి బీట్ వ్యవస్థ, ఇంటిగ్రేటెడ్ పోలీసింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై డిజిపి సమీక్షించారు.

ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో డ్రోన్ సాంకేతికతను నేర నియంత్రణ, జనసమ్మర్థ నిర్వహణ, ప్రత్యేక ఆపరేషన్లలో సమర్థవంతంగా వినియోగిస్తున్నట్లు గుప్తా తెలుసుకున్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా డ్రగ్ టెస్టింగ్, అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ యువతను రక్షించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. మహిళల భద్రత కోసం శక్తి టీమ్ ద్వారా తక్షణ స్పందన, అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవు తున్నాయని, సైబర్ నేరాల నియంత్రణకు ఏర్పాటు చేసిన సైబర్, సామాజిక మాధ్యమాల మానిటరింగ్ వ్యవస్థ చురుకుగా పనిచేస్తోందని డిజిపి ప్రశంసించారు.

అంతేగాక తిరుపతి జిల్లాలో రోడ్డుప్రమాదాల నివారణకు ఇటీవల జిల్లా కలెక్టర్‌తో కలిసి నిర్వహించిన రహదారి భద్రత బస్సు యాత్ర, ప్రమాదాలకు గురయ్యే (బ్లాక్ స్పాట్స్) ప్రాంతాల గుర్తింపు, ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాల వివరాలను కూడా ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు శ్రీనివాస్, రవిమనోహరచారి, శ్రీలత, రామకృష్ణ, డిఎస్పీలు, సిఐలు, పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు సోమశేఖరరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బంగారు కవచం తొలగించి వేదోక్తంగా ఉత్సవర్లకు జ్యేష్ఠాభిషేకం



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** జ్యేష్టమాసంలో జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేట్లుగా ప్రతి సంవత్సరం మూడురోజుల పాటు తిరుమల శ్రీవారికి నిర్వహించే జ్యేష్ఠాభిషేకం శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనములైన స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు 1990వ సంవత్సరంలో ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలో ఉన్న కల్యాణమండపంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఋత్వికులు శాంతి హోమం నిర్వహించారు. శతకలశ ప్రతిష్ఠ ఆవాహన, నవకలశ ప్రతిష్ఠ ఆవాహన, కంకణ ప్రతిష్ఠ అనంతరం స్వామి, అమ్మవార్లకు అర్ఘ్యం, పాద్యం, ఆచమనీయం చేసి కంకణధారణ చేశారు. ఆ తరువాత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి కి వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. వేదపండితులు శ్రీసూక్తం, భూ సూక్తం, పురుష సూక్తం, నీలా సూక్తం, నారాయణ సూక్తాలను పఠిస్తుండగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వజ్రకవచాన్ని అలంకరించారు. సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులు వజ్రకవచంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. నేడు ఉత్సవర్లు ముత్యపు కవచంతో, ఆదివారం స్వర్ణ కవచంతో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి ్మ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ అర్చకులు పాల్గొన్నారు.

## వకుళమాత సన్నిధిలో 'అక్షర గోవిందం'

**● జులై 3 నుండి చిన్నారులకు అక్షరాభ్యాసం ● అన్నప్రాశన సేవలు**



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** చిన్నారుల్లో సనాతన ధర్మ సంప్రదాయాలపై ఆసక్తి పెంపొందించి వారి విద్యారంభం, జీవితారంభం దైవానుగ్రహంతో శుభప్రదంగా సాగాలనే సంకల్పంతో టిటిడి జులై 3 నుండి "అక్షరగోవిందం" కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. సాక్షాత్తు శ్రీవేంకటేశ్వర స్వామి తల్లి తిరుపతి రూరల్ పేరూరు వద్ద వకుళామాత ఆలయంలో నూతనంగా "అక్షర గోవిందం" అన్నప్రాశన కార్యక్రమాలను ప్రారంభించనుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి, వకుళామాత ఆశీస్సులతో అక్షరాభ్యాసాన్ని జులై 3వ తేదీ మధ్యాహ్నం 12గంటల నుండి 12.30 గంటల వరకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వకుళామాత సన్నిధిలో చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. కార్యక్రమం అనంతరం ఆశీర్వచనం, ప్రసాదం, ప్రత్యేక "అక్షర గోవిందం కిట్" అందజేస్తారు.

**3 నుండి 5 సంవత్సరాల చిన్నారులకు అవకాశం:** అక్షరగోవిందం, అన్నప్రాశనం కార్యక్రమంలో 3 నుండి 5 సంవత్సరాల వయస్సు చిన్నారులు పాల్గొనవచ్చు. అక్షర గోవిందం కిట్‌లో రాతపలక, బలపాలు, అక్షింతలు, పసుపు, కుంకుమ, శ్రీవారి కంకణం, ఫటిక బెల్లం, వకుళామాత, వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు, సరస్వతీదేవి చిత్రపటాలు, గోవింద నామాలు, వేంకటేశ్వర సుప్రభాతం, పెద్ద బాలశిక్ష తదితర పూజా, విద్యా సామగ్రిని ఉచితంగా అందజేస్తారు.

**వేదోక్తంగా అన్నప్రాశన సేవ:** ఆలయ అర్చకుల పర్యవేక్షణలో వేదమంత్రోచ్చారణల మధ్య చిన్నారులకు తొలి అన్నప్రాశనను ఆగమోక్తంగా నిర్వహించి, వేంకటేశ్వరస్వామి, వకుళా మాతల ఆశీస్సులను అందజేస్తారు. జులై 4 నుండి మంగళవారం మినహా అన్ని రోజుల్లో వకుళమాత ఆలయ అర్చకులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో ఆలయంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ బ్యాచ్‌కు 25 మంది చిన్నారులు చొప్పున రెండు బ్యాచ్‌లలో మొత్తం 50 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు గంట ముందస్తుగా ఆలయ ప్రాంగణంలో పేర్లు నమోదు చేసుకోవాలి. చిన్నారులు తల్లిదండ్రులు, సంరక్షకులతో కలిసి సంప్రదాయ వస్త్రధారణలో హాజరుకావాలని టిటిడి సూచించింది. వకుళామాత, వేంకటేశ్వరస్వామి దివ్య అనుగ్రహంతో తమ పిల్లల విద్యారంభం, అన్నప్రాశనను పవిత్రంగా నిర్వహించుకునేందుకు ఈ ప్రత్యేక సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## రఘురామకృష్ణంరాజు స్థలం కబ్జా యత్నం

**విశాఖపట్నం, జూన్ 26 ప్రభాతవార్త:** అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు చెందిన 333 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు భూ బకాసుర్ల ముఠా ప్రయత్నించడం సంచలనం సృష్టిస్తోంది. విశాఖపట్నంలోని మధురవాడలో ఉన్న ఈ స్థలానికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో యథేచ్ఛగా నకిలీ రిజిస్ట్రేషన్లు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు చెందిన రూ.2 కోట్లకు పైగా విలువైన స్థలాన్ని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు ఒక ముఠా ప్రయత్నించడం సంచలనం సృష్టిస్తోంది.డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు 1989లోనే విశాఖ మధురవాడ పరిధిలో 333.33 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం దీని ధర రూ.2 కోట్లకు పైగా ఉంటుంది. అయితే, ఈ విలువైన స్థలంపై కన్నేసిన కొందరు కేటుగాళ్లు.. రఘురామకృష్ణంరాజు సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలను సృష్టించారు. ఆ ఫోర్జరీ డాక్యుమెంట్లతో సదరు స్థలాన్ని పలుమార్లు ఒకరి నుంచి ఒకరికి యాజమాన్య బదిలీ (రిజిస్ట్రేషన్) కూడా చేసినట్లు తెలుస్తుంది.

ఈ ఏడాది మే 25, 26 తేదీల్లో కొందరు వ్యక్తులు ఆ స్థలంలోకి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో స్థానికంగా ఉన్న రఘురామకృష్ణంరాజు స్నేహితుడు ఈ విషయాన్ని గమనించి, తక్షణమే ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన రఘురామకృష్ణంరాజు.. తన వద్ద ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్లను, సదరు వ్యక్తులు చూపిస్తున్న కాగితాలను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. తన సంతకాన్ని పక్కాగా ఫోర్జరీ చేసి, నకిలీ రిజిస్ట్రేషన్లతో భూమిని కాజేయాలని చూసినట్లు ఆయన గుర్తించారు. దీంతో పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. తన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారితో పాటు, ఈ ఫోర్జరీ వెనుక ఉన్న దోషులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదుల కోరారు. సదరు నకిలీ రిజిస్ట్రేషన్లు ఎక్కడ జరిగాయి, దీని వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులు ఎవరు అనే కోణంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసినట్లు తెలుస్తుంది.

## ఉద్యాన వర్సిటీ 38 రకాల నూతన వంగడాలను అభివృద్ధి చేయటం అభినందనీయం

**తాడేపల్లిగూడెం, జూన్ 26 ప్రభాతవార్త:** ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించటమే లక్ష్యంగా ఉద్యాన విశ్వ విద్యాలయం 38 రకాల నూతన వంగడాలను అభివృద్ధి చేయటం అభినందనీయమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కితాబిచ్చారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం 19వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రాంగణంలోని క్రీడా మైదానంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ కట్టుపల్లి ధనుంజయరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం తన 19 ఏళ్ల ప్రస్థానంలో జాతీయస్థాయిలో ఎన్నో మైలురాళ్ళను అధిగమించటం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు సామాజిక స్పృహతో, రైతుల పక్షాన ఆలోచించే దృక్పథంతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఉద్యాన విద్య, పరిశోధనలు కేవలం ఆదాయం, ఉద్యోగాల కల్పన కోసమే కాకుండా ప్రజలకు పౌష్టికాహార భద్రత ఆరోగ్య భద్రత కల్పించే గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యాలవుతారని ఉద్యాన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విశ్వ విద్యాలయానికి అవసరమైన ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన నిధులను, బిఎస్సి హార్టికల్చర్ డిగ్రీకి యూజీసీ నుంచి తగిన గుర్తింపు ఇప్పించడానికి కేంద్ర స్థాయిలో కృషి చేస్తానని వివరించారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ కట్టుపల్లి ధనుంజయరావు మాట్లాడుతూ పరిశోధన రంగంలో, విశ్వ విద్యాలయం 38 నూతన ఉద్యాన వంగడాలను రాష్ట్ర విత్తన ఉపసంఘం ద్వారా, 31 పంట రకాలను కేంద్ర విత్తన ఉపసంఘం ద్వారా విడుదల చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు.

## పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్లు

**● 42 మంది ఎంపిడిఒలకు డిడిఒలుగా పదోన్నతి**

**● కూటమి సర్కారొచ్చాక10 వేల మందికి పైగా...**

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆ శాఖ అధికారులకు శుభవార్త చెప్పారు. 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు (ఎంపిడిఒ), డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా (డిడిఒలు) పదోన్నతులు కల్పించే ప్రక్రియకు పచ్చజెండా ఊపారు. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితాను డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డిపిసి) ఆమోదించింది. దీంతో త్వరలోనే వీరందరూ ఉన్నత హోదాలో బాధ్యతలు చేపట్ట నున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పదోన్నతుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 10 వేల మందికి పైగా సిబ్బందికి ప్రమోషన్లు కల్పించారు. గత పదేళ్లలో ఇంత భారీ సంఖ్యలో ఈ శాఖలో పదోన్నతులు ఇవ్వడం ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు.

pnb Housing Finance Limited Ghar Ki Baat

అనుబంధం-IV-A - స్థిరాస్తి/లు యొక్క ఇ-వేలం బహిరంగ విక్రయ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యందు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు పేర్కొన్నటు చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క విక్రయం కొరకు ఇ-వేలం-విక్రయ ప్రకటన

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష్ భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ-110001, ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com

బ్రాంచి చిరునామా: 3వ అంతస్తు, దత్ ఐల్యాండ్ బిల్డింగ్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం - 530003, ఆంధ్రప్రదేశ్

| రుణం నెం./రుణగ్రహీత పేరు/ సహ-రుణగ్రహీత/హామీదారు/ చట్టబద్ధ వారసులు (A) | డిమాండ్ మొత్తం & తేది (B) | స్వాధీనత యొక్క స్వభావం (C) | తనఖా పెట్టబడిన ఆస్తుల వివరణ (D) | రిజర్వు ధర (RP) (E) | బయానా IRP (F) | బిడ్ సమర్పణకు చివరి తేది (G) | బిడ్ ఇంక్రిమెంట్ (H) | ఆస్తి తనిఖీ తేది & సమయం (I) | వేలం తేది & సమయం (J) | తెలిసిన అభ్యంతరాలు (K) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| HOU/VSKP/0919/746451 అద్దేపూడి విజయలక్ష్మి / చొక్కాకుల ప్రసాద్ రావు B.O: విశాఖపట్నం | రూ. 37,28,110.20 10.10.2025 నాటికి | భౌతికంగా | ఫ్లాట్ నం.202, మొదటి అంతస్తు, వసుంధర ఆర్కేడ్-2, లక్ష్మీపురం, గొల్లవిల్లావనిపాలెం, హనుమాన్ టెంపుల్ దగ్గర, లక్ష్మీపురం గ్రామం, సుజాత నగర్, D.No. 96/25, LIC కాలనీ, సర్వే నం.93/3, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530051 | రూ. 37,18,000 | రూ. 3,71,800 | 16.07.2026 | రూ. 10,000 | 03.07.2026 ఉ.11.00 గం. నుండి సా.3.00 గం. | 31.07.2026 మ.02.00 గం. నుండి సా.3.00 గం. | *లేవు/ తెలియదు |

... ఫోన్: 7428193765/9948562886/9392320800/9059529997/8790120868, ఇ-మెయిల్: auction@pnbhousing.com, PNBHFL యొక్క అధీకృత వ్యక్తి లేదా www.pnbhousing.com సంప్రదించగలరు.

ప్రదేశము : విశాఖపట్నం, తేది: 26.06.2026 సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

మేధావి అంటే మరెవరో కాదు. ప్రతి చిన్న పెద్ద విషయాన్ని స్పష్టంగా చూడగలవాడే మేధావి.

- గోథె

# పాలకుల నిర్వాకానికి దర్పణం ధరలే

**అదుపులేకుండా పెరిగిపోతున్న ధరలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. బడుగు, పేద వర్గాలే కాదు మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిమితిలేని ఆదాయం కలవారి గురించి చింతలేదు కానీ రెక్కాడితే కానీ డొక్కాడని ప్రజలు, నెలసరి జీతగాళ్లు, పరిమిత ఆదాయం గలవారి పరిస్థితి అయోమయంగా తయారయింది. ఇతర మార్గాల్లో ఆదాయం ఉంటే తప్ప సంసారాన్ని నడపలేని పరిస్థితులు దాపురించాయి. ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా అన్ని వర్గాలకు సంబంధించిన ఈ ధరల పెరుగుదల సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదు. గతంలో ఉల్లిగడ్డల ధరలు పెరగడంతో అధికారాన్ని కోల్పోయిన కేంద్ర ప్రభుత్వ పెద్దలను చూశాం. పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఉద్యోగుల జీతభత్యాలు ఏ రీతిలో పెంచినా ఆశించిన ఫలితాలు రాకపోగా పేదరికం మరింత పెరుగుతుంది.**

అదుపు ఆజ్ఞా లేకుండా పెరిగిపోతున్న ధరలను నియంత్రిస్తాం, నల్లబజారుదారులపై ఉక్కుపాదం మోపుతాం అంటూ ఎవరు అధికారంలో ఉన్నా చెప్పే మాటలే చెప్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం చేయలేకపోతున్నారు. స్వరం మారుతున్నదేతప్ప పాట మాత్రం పాతదే అన్నట్లుగా ఉంది పాలకుల ధోరణి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ధరల విషయంలో ఆవేదన, ఆందోళన వ్యక్తం చేసి రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేపట్టిన నేతలే అధికారంలోకి రావడంతోనే మారిపోతున్నారు. ఇటీవల అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలతో సామాన్యులు విలవిల్లాడిపోతున్నారు. ఒక్కరోజు ఉన్న ధర మరుసటి రోజు ఉండడం లేదు. ఒక పట్టణంలో ఉన్న ధర మరో నగరంలో ఉండడం లేదు. ఇక ధరలు కొండెక్కడానికి గల కారణాలు, కారకులు ఎవరో, ఎవరికి చెప్పుకోవాలో, ఎవరు చర్యలు తీసుకుంటారో దిక్కుతోచక సన్నజనంతోపాటు మధ్యతరగతి ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పోని ఉత్పత్తి చేస్తున్న రైతుకు గిట్టుబాటు ధర వస్తున్నదంటే అదీ లేదు. అక్కడ పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. పండించిన పంటలకు ధరలు తగ్గిపోతున్నాయి. గిట్టుబాటు ధరలు రాక అన్నదాతలు అన్నానికి జరక్కా, అప్పులు చెల్లించలేక, ఆత్మాభిమానం చంపులేక ప్రాణత్యాగం చేస్తున్నారు. రైతుల వద్ద పంటలు ఉన్నప్పుడు వాటి ధరలు విపరీతంగా పడిపోతున్నాయి. వారి వద్ద నుంచి ప్రైవేట్ వ్యక్తుల గోదాముల్లోకి చేరుకోగానే ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి.ఇదంతా ఒక పక్కా వ్యూహం ప్రకారం కృత్రిమ కొరత సృష్టించి ఇష్టానుసారంగా ధరలను పెంచుకుంటున్నారు. ఇదేదో ఇప్పటికిప్పుడు కొత్తగా వచ్చిందని చెప్పడం లేదు. ఎప్పటి నుంచో జరుగుతున్నది. రాను రాను పెరిగిపోతున్నది.ఇందులో కొందరు దళారులు,వ్యాపారస్తులు కీలకపాత్ర వహిస్తారన్న విషయం అధికారులతోసహా అందరికి తెలిసిందే. కొందరు దళారులు కమిషన్ల రూపంలో కోట్లాది రూపాయలు భోంచేస్తున్నారు.చట్టప్రకారం లైసెన్సులు పొందినా, నిబంధనలను అతిక్రమించిఅటు రైతులను, ఇటు వినియోగదారులను దోపిడీచేస్తున్నారు. ఇలా దోపిడీకి గురికాకుండా నివారించి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించి వినియోగదారులకు సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులను అందించడంలో కీలకపాత్ర వహించాల్సిన మార్కెట్ కమిటీలు రైతులు, వినియోగదారులకు భక్షక కంపెనీలుగా తయారయ్యాయి. దళారులను అదుపు చేయలేకపోగా కొన్ని చోట్ల వారితోనే కుమ్మక్కైపోతున్నారు. అనేక సందర్భాల్లో ఈ విషయాలు వెలుగుచూశాయి. రైతులు ఉద్యమించారు. ధర్నా చేశారు. కొన్ని చోట్లదాడులు కూడా చేశారు. అయినా ఏమాత్రం ఫలితంఉండడం లేదు. ఇందుకు ప్రధాన కారణం

దామెర్ల సాయిబాబ

ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ వేదికలు ఎక్కిఅరిచే పెద్దలే మార్కెట్ కమిటీల విషయంలో ఇదే ప్రజాస్వామ్యాన్ని భూస్థాపితం చేయడమే. నామినేషన్ పద్ధతి ఎవరు ఎప్పుడు ప్రవేశపెట్టారో కానీ, రైతుల పాలిట శాపాలుగా పరిణమించాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక కావాల్సిన రైతు ప్రతినిధులకు బదులు బంధుమిత్రులనో, లేక తమ తోకలుగా, బాకాలుగా ఉన్న రాజకీయ కార్యకర్తలను ఈ కమిటీల్లో నేతలు నియమించుకుంటున్నారు. ఇలా మార్కెట్ కమిటీలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. ఇందులో ప్రజలచే తిరస్కరించబడినవారు, ఎన్ని

## ఒక్క మాట

కల్లో పోటీ చేసే సత్తా లేనివారు, ప్రజాసేవ అంటే ఏమిటో తెలియని వారిని సైతం ఈ కమిటీల్లో చేర్పిస్తున్నారు. పాలకుల దయాదాక్షిణ్యాలమీద ఎంపిక అయిన పాలక మండళ్ల ఉనికి నామ మాత్రమే కాదు దళారుల సంక్షేమ ధ్యేయంగా పనిచేసే పరి స్థితులు ఏర్పడ్డాయి. పాలక మండళ్లకు ఎసిగదులు, కార్లు లాంటి సౌకర్యాలు కల్పించుకొనేందుకు మార్కెట్ కమిటీ నిధులు వెచ్చించే పెద్దలు రైతులు అహర్నిశలు కష్టపడి పండించి మార్కెట్లోకి తెచ్చిన పంటను వర్షం నుండి కాపాడుకునేందుకు టార్పాలియన్లు ఇవ్వలేకపోవడం పరిశీలిస్తే పరిస్థితి అర్థమవుతుంది. ధరల నిర్ణయంలో దళారులదే కీలక పాత్రగా మారిపోయింది. అవసరం అనుకుంటే పోటీగా ఇతర ప్రాంతాల నుంచిసరుకులు రప్పించి స్థానిక రైతుల ఉత్పత్తులను దెబ్బతీస్తున్నారు. కొందరు రైతుల పేరుతోనే గ్రామాల్లో సరుకును నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెరిగిన తర్వాత మార్కెట్లోకి దించుతున్నారు. ఇలా ఇష్టం వచ్చిన రీతిలో ఇష్టానుసారంగా ధరలు పెరిగిపోతున్నాయి. ఈ భాగోతమంతా బహిరంగంగా జరుగుతున్నా కోట్లాది మంది రైతులు అల్లాడుతున్నా పాలకులు హెచ్చరికలు, ప్రకటనలు సమీక్షలు, సమావేశాలతో కాలం గడుపుతున్నారే తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా మార్కెట్ కమిటీల్లో తమ అనుచరులను ఎలా నియమించుకోవాలి? ప్రత్యర్థులను ఎలా తొలగించాలి? అనే ఆలోచించి, చర్చించి చట్టాలు తెచ్చేందుకు ప్రయత్నాలు చేశారేతప్ప ఈ కమిటీలు ప్రజలకు ఎలా ఉపయోగపడుతు న్నాయి? రైతులకు ఎలా సేవలు అందిస్తున్నాయనే విషయంలో ఆలోచించడం లేదనే చెప్పొచ్చు. వ్యాపారులు లాభాల కోసమేవ్యాపారాలు చేస్తున్నారనేది వాస్తవం. అలాగే కమిషన్ల కోసమే దళారీ వ్యవస్థ ఉన్నదనేది కూడా నిజం. అలా వారు వ్యవహరించడాన్ని తప్పుపట్టలేం. కానీ నెలనెలా వేలాది రూపాయలు జీతభత్యాల రూపేణ ప్రజాధనాన్ని భోంచేస్తున్నా అధికారులను ఏమనుకోవాలి? కేవలం కొందరు అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, అసమర్థత, ఆశ్రిత పక్షపాతం కారణంగా వీటన్నింటికి మించి రాజకీయ జోక్యంతోనే ఈపరిస్థితులు దాపురిస్తున్నాయి.ధరలు అదుపు తప్పు తున్నప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇతరప్రాంతాల నుంచి సరుకులు తెప్పించి వినియోగదారులకు అందుబాటులో ఉంచి ధరలను నియంత్రించేందుకు గతంలో ఎన్నోసార్లు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు అలాంటి ప్రయత్నాలేమి జరగడం లేదు. గతంలో ఉల్లిగడ్డల ధరలు అందుబాటులో లేనంతగా పెరగడంతో ప్రభుత్వమే ఇతర రాష్ట్రాలనుంచి కొనుగోలుచేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చింది.దీంతోధరలు తగ్గాయి.అలానే కందిపప్పు విషయంలోకానీ ఇతర పప్పు ధాన్యాల విషయంలో అప్పటి పాలకులు తీసుకున్న చర్యల కారణంగా ధరలను నియంత్రించగలిగారు. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితే వస్తే విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులతో ఒక్కసారిగా ఉమ్మడి రాష్ట్రంలో దాడులు నిర్వహించారు. కోట్లాది రూపాయల విలువైన అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. అవన్నీ మార్కెట్లోకి రావడంతో ధరలు దిగి వచ్చాయి. ఏదిఏమైనా ధరలనియంత్రణ విషయంలో పాల కులు వ్యవహరిస్తున్న తీరుసర్వత్రా విమర్శలకు గురవుతున్న ది. అదుపులేకుండా పెరిగిపోతున్న ధరలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. బడుగు, పేద వర్గాలే కాదు మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు.పరిమితిలేని ఆదాయం కలవారి గురించి చింతలేదు కానీ రెక్కాడితేకానీ డొక్కాడని ప్రజలు, నెలసరి జీతగాళ్లు,పరిమిత ఆదాయంగలవారి పరిస్థితి అయోమయంగా తయారయింది. ఇతర మార్గాల్లో ఆదాయం ఉంటే తప్ప సంసారాన్ని నడపలేని పరిస్థితులు దాపురించాయి. ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా అన్నివర్గాలకు సంబంధించిన ఈధరల పెరుగుదల సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదు. గతంలో ఉల్లిగడ్డల ధరలు పెరగడంతో అధికారాన్ని కోల్పోయిన కేంద్ర ప్రభుత్వ పెద్దలను చూశాం. పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఉద్యోగుల జీతభత్యాలు ఏ రీతిలో పెంచినా ఆశించిన ఫలితాలు రాకపోగా పేదరికం మరింత పెరుగుతుంది. ●

# వెనిజులా విలవిల

సహజ వనరులకు సంపన్నమైన 'వెనెజులా' ఒక్కసారిగా ప్రకృతి కన్నెర్ర చేసి ఒకే ఒక నిమిషంలో 235 మందిని పొట్టన పెట్టుకుంది. ఎన్నో ఆర్థిక రాజకీయ, సామాజిక సంక్షోభంతో అతలాకుతలమవుతున్న ఆ దేశానికి నిన్నటి తాజా భూకంప విలయం సృష్టించిన విధ్వంస నష్టం తక్కువేమీ కాదు. లాటిన్ అమెరికాలో అత్యంత ధనిక దేశంగా పేర్కొనబడే వెనెజులాను అన్ని సమస్యలు ఒకేసారి చుట్టుముట్టేస్తున్నాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పేదరికం, భారీ వలసలు ఆ దేశాన్ని ఇబ్బందుల్లో ముంచెత్తాయి. కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న ఈ దేశం గత యేడాది ఆ దేశ అధ్యక్షుడిని అమెరికా బంది చేయడంతో తీరని నష్టం పొందింది. తాత్కాలిక పాలనలో ఏమాత్రం కుదుర్చుకున్నట్లు లేదు. తీరా ఈ ఉత్పాతం పెను భూకంపంతో వెనెజులా చిగురుటాకులా వణికిపోయింది. నిమిషం వ్యత్యాసంలో రెండు భారీ భూ ప్రకంపనల 'డబ్లెట్' తో దేశమంతా ఒక్కసారిగా అల్లాడిపోయింది. కరాకస్, లా గువైరాల్లో భారీ విధ్వంసమే జరిగింది. భారీ భవనాలెన్నో కుప్పకూలాయి. విద్యుత్ కమ్యూనికేషన్ వ్యవస్థలు నామరూపాల్లేకుండా పోయాయి. భూకంప తీవ్రత మానవ నష్టం భారీగానే జరిగింది. ఉత్తర వెనెజులాలో గురువారం రెక్టర్ స్కేలుపై 7.2, 7.5 తీవ్రతలతో రెండు శక్తివంతమైన భూకంపాలు నమోదయ్యాయి. కూలిన భవన శిథిలాల్లో వేల మంది ఉండి ఉండచ్చునని ఒక అంచనా. కానీ శిథిలాలు తొలగిస్తే తప్ప ఎంత ప్రాణ నష్టం వాటిల్లిందో చెప్పలేని పరిస్థితి. ఒక ప్రకృతి విపత్తు ఎంతటి మానవ విషాదంగా మారుతుందో ఈ భూకంప దుర్ఘటనలు వివరిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ముందుగా కాలిఫోర్నియా, తర్వాత వెనెజులా, ఆ తర్వాత జపాన్‌లో వరుస భూకంపాలు రావడం నిజంగా ఆశ్చర్యకరమే. వెనెజులా భూకంపం గురించి గూగుల్ కాస్త ముందుగానే అప్రమత్తం చేసింది. ఆండ్రాయిడ్ యూజర్లకు హెచ్చరిక సంకేతాలు పంపింది. అయినా తక్షణ అప్రమత్తత చేసుకోగల వ్యవస్థలను వెనెజులా అభివృద్ధి చేసుకోలేకపోయినందున ప్రాణనష్టం తగ్గించు కోలేకపోయింది. ప్రకృతి విపత్తులను అడ్డుకోవడం మానవ సాధ్యం కాదు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించు కునే విధంగా మానవాళిని సిద్ధం చేయడంలో వెనెజులా వెనుకబడింది. ఈ విషాద తీవ్రత, అప్రమత్తత లేని భూకంప వాతావరణం వెరసి వెనెజులాను ఇప్పట్లో కోలుకోలేని పరిస్థితులు తెచ్చి పెట్టాయి. నాణ్యమైన మౌలిక సదుపాయాలున్న చోట్ల ప్రకృతి విపత్తులను మానవ విపత్తులుగా మారకుండా గణనీయంగా తగ్గించుకోవడం ఎంతో అవసరం. ఎన్నో చమురు బావుల్ని, సంపదను తనలో ఇముడ్చుకున్న వెనెజులాలో భూకంప నిరోధక నిర్మాణ నిబంధనలంటూ ఏమీ లేవు. ఎప్పటికప్పుడు పాత భవనాల భద్రతా అంచనాలు, నూతన భవనాల నిర్మాణంలో ఆధునిక నిర్మాణ వ్యవస్థలను బలోపేతం చేయడంలో అక్కడి పాలనా వ్యవస్థకు ఇంకా అలవాటుకాలేదు. ఈనాటి భూకంపం చాలా రోజుల తర్వాత వచ్చినందున భూకంప సమీక్ష అప్రమత్తత కష్టమైనదే. వెనెజులా భూకంపం ప్రమాదనంతర చర్యలు, విపత్తు నిర్వహణా సామర్థ్యాల విషయమై ప్రపంచానికే ఓ హెచ్చరిక కాగలదు. ప్రపంచ వ్యాప్తంగా జపాన్,చిలీ, వంటి భూకంప ప్రభావిత దేశాలు, కఠిన నిర్మాణ ప్రమాణాలు, ముందస్తు హెచ్చరికల ప్రమాణాలు, ప్రకృతి విపత్తులనెదుర్కోవడంలో ప్రజలకు అవగాహన, సిబ్బందికి శిక్షణ వంటివన్నీ ఆయా దేశాలను స్వయం సిద్ధం చేస్తాయి. కానీ మిగిలిన దేశాల్లో ఈ వ్యవస్థలు లోపభూయిష్టంగా ఉన్నాయి. ఇప్పటికే వెనెజులా ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, సరైన పాలనాలేమి వంటి అంశాలు ఆ దేశాన్ని తిరోగమనంలోకి నెట్టుతున్నాయి. భూకంప ప్రభావంతో ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. జూన్ 25న తెల్లవారుఝామున 3.34 నిమిషాలకు వెనెజులాలో భూకంపం జరిగింది. కాస్త అటూ ఇటూలో మూడు ఖండాల్లో భూకంపాలు రావడానికి ఏమాత్రం సంబంధం లేదు. మొత్తంగా వెనెజులాకే ఎక్కువ నష్టం సంభవించింది. గతం కన్నా నయం 'భూకంపం చెప్పి రాదనే' పరిస్థితి నుంచి ఈసారి వెనెజులాలో భూకంపం వస్తోందని గూగుల్ ఆ దేశంలోని లక్షలాది ఆండ్రాయిడ్ ఫోన్లలో భూకంప హెచ్చరికలను ముందే మోగించింది. కానీ వారిలో సంసిద్ధత కనుపించలేదు. దాని బాధ్యత పాలక ప్రభుత్వాలు రూపొందించే ప్రణాళికలు, వ్యవస్థ లదే. గూగుల్ ఆండ్రాయిల్ ఎర్త్ క్వేక్, అలర్ట్ సిస్టమ్ ఉండటం తక్షణ స్పందనతో ప్రజల్ని తనకున్న వనరుల మేరకు భూకంప హెచ్చరికలు పంపడం ఆధునిక యుగంలో ఆహ్వానించదగినదే. గూగుల్ తపని తాను చేసింది. స్వల్ప సమయంలో భూమి కంపించడంతో ఎవరూ ఏమాత్రం జాగ్రత్త పడలేకపోయారు. ఇంతవరకు గతం ప్రస్తుతంలోకి వస్తే వెనెజులా ప్రభుత్వం ఏవిధంగా భూకంప పర్యవసానాలను గట్టెక్కించగలదో వేచి చూడాలి. దెబ్బతిన్న ఇల్లు ఆసుపత్రుల పునర్నిర్మాణం కోసం రూ.1890 కోట్లతో ప్రత్యేక ఫండ్‌ను ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగేజ్ ప్రకటించారు. వెనెజులాలో గత వందేళ్లలో సంభవించిన అతిపెద్ద భూకంపం ఇదే. సమీపంలోని బ్రెజిల్, కొలంబియా సహా మరికొన్ని దేశాల్లో భూకంపనలు వ్యాపించాయి. అక్కడ పెద్ద నష్టమేమీ లేదు. భూప్రకంపనలతో వేలాది మంది చనిపోయి ఉండొచ్చునని అధికారులు అంచనా వేశారు. ఏదిఏమైనా వెనెజులాలకు రాకూడని కష్టం వచ్చింది. ఇప్పుడు బాధితులకు సత్వర సేవలను ఆధునిక విధానంలో అందించడమొక్కటే ఆ దేశ లక్ష్యంగా కనపడుతోంది.

మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కాని మంచివారుగా మారటం అరుదు.



స్వీడేన్ బర్గ్

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.



మహాత్మా గాంధీ

# ఉపాధి కల్పనకు మూలస్తంభాలు ఎంఎస్ఎంఈలు

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు ఏ దేశ ఆర్థిక వ్యవస్థకు, దాని సమగ్ర అభివృద్ధికి వెన్నెముక వంటివి. ఇవి స్థానిక, జాతీయ ఆర్థిక వ్యవస్థలకు, ముఖ్యంగా శ్రామిక పేదలు, మహిళలు, యువత, బలహీన వర్గాల వారి సుస్థిర జీవనోపాధులకు దోహదపడతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం వ్యాపారాలలో 90శాతం, ఉపాధిలో 60-70 శాతం, ప్రపంచ జీడీపీలో 50 శాతం వాటా ఎంఎస్ఎంఈలదే. ఎంఎస్ఎంఈలు ఆర్థిక వ్యవస్థలను పరివర్తన చెందిస్తున్నాయి, ఉద్యోగ కల్పన, ఆదాయాన్ని ప్రోత్సహించడం, సమానమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ఎంఎస్ఎంఈల పాత్రపై అవగాహన పెంచేందుకు, 2017 నుండి ప్రతి ఏటా జూన్ 27వ తేదీని 'ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవం'గా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ప్రకటించింది.దేశ ఆర్థిక వ్యవస్థకు, స్థానిక ఉపాధి కల్పనకు, గ్రామీణ లేదా వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికీకరణకు ఎంఎస్ఎంఈలు మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వర్గీకరణ వాటి ఉత్పత్తి, పెట్టుబడి, వార్షిక టర్నోవర్‌లపై ఆధారపడి ఉంటాయి. మైక్రో ఎంటర్‌ప్రైజ్,పరిశ్రమ అనగా ఒక కోటిలోపు పెట్టుబడితో 5 కోట్ల లోపు వార్షిక టర్నోవర్ నమోదు చేయబడుతుంది. చిన్న లేదా స్మాల్ ఎంటర్‌ప్రైజ్ విభాగంలో పెట్టుబడి 10 కోట్ల వరకు ఉంటూ వార్షిక టర్నోవర్ 50కోట్ల వరకుఉంటుంది.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

మధ్యతరహా లేదా మీడియం పరిశ్రమలో 50 కోట్ల వరకు పెట్టుబడులు,250కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉంటుంది. ఎంఎస్ఎంఈలు ఆవిష్కరణ, ఉద్యోగ కల్పన, సుస్థిర అభివృద్ధికి శక్తివంతమైన చోదక శక్తులుగా ఉపకరిస్తున్నాయి.



ఎంఎస్ఎంఈలు సాంకేతికత, డిజిటల్ మౌలిక సదుపాయాలు, సరసమైన ఆర్థిక సహాయం, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వాలు భాగస్వామ్యాలకు ప్రాప్యతను విస్తరించడం ద్వారా సమ్మిళిత వృద్ధిని నడిపిస్తాయి. స్థితిస్థాప కతను బలోపేతం చేస్తాయి. పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయి. డిజిటల్ టెక్నాలజీలు, ఏఐ, గ్రీన్ ఇన్నోవేషన్‌లో వేగవంతమైన పురోగతులు, ఎంఎస్ఎంఈలకు ఉత్పాదకతను పెంచుకోవడానికి అపూర్వమైన అవకాశాలను అందిస్తున్నాయి. నైపుణ్య శిక్షణ, ఆవిష్కరణ, మరింత న్యాయమైన నిబంధనలు ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడానికి ఉత్తమ మార్గాలు. నేటి ఎంఎస్ఎంఈలు రాజకీయ అస్థిరత, యుద్ధాలు, ఘర్షణలు, వాతావరణ మార్పులు, డిజిటల్ మార్పుల వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. తగినంత రుణ సౌకర్యాలు లేకపోవడం, పేలవమైన మౌలిక సదుపాయాలు కఠినమైన పరిస్థితులలో పనిచేయడం వంటి కారణాల వల్ల ఎంఎస్ఎంఈలు సజావుగా నడవడం మరింత కష్టతరం అవుతోంది. ప్రపంచ ఎంఎస్ఎంఈల దినోత్సవం 2026ఇతివృత్తం ఆవిష్కరణ, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధిద్వారా ఎంఎస్ఎంఈలకు సాధికారత కల్పించడం ఏఐ ఆధారిత భవిష్యత్తులో మానవ కేంద్రీకృత వ్యవస్థాపకత. ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఉన్న హ్యూమన్‌సెంటర్‌డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫోరమ్ ఎంఎస్ఎంఈల భవిష్యత్ తరం" అనే సమాంతర ఇతివృత్తంతో నడుస్తోంది. దీని ప్రభావం ఈ రంగంలోని తదుపరి తరానికి నిర్వచనం ఇవ్వబోయే మహిళా సీఈఓలు, యువ వ్యవస్థాపకులు సూక్ష్మసంస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. భారతదేశంలో, ప్రభుత్వం పారిశ్రామిక సంస్థలు ఈ రోజును చిన్న వ్యాపారాల కోసం విధాన సంస్కరణలు, ఆర్థిక చేరిక ప్రయత్నాలు డిజిటల్ పరివర్తన కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించడానికి ఉపయోగిస్తాయి. భారతదేశంలో 7.4 కోట్లకు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయి.ఇవి 32కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, జాతీయ జీడీపీకి సుమారు 31.1శాతం వాటాను అందిస్తున్నాయి. ఈ సంస్థలు మొత్తం ఎగుమతులలో సుమారు 48.6 శాతం వాటాను కూడా అందిస్తున్నాయి. ●

# ప్రజావాక్కు



### మరో అవకాశం ఇవ్వండి

**దేశవ్యాప్తంగా** గత ఆదివారం జరిగిన నీట్ యూజీ రీ టెస్ట్‌కి కొంత మంది విద్యార్థులు ట్రాఫిక్ జామ్స్, రైళ్ల ఆలస్యంగా రావడం, సిటీబస్‌లు సమయానికి రాకపోవడం తదితర కారణాల వల్ల నీట్ యూజీ పరీక్ష రాయలేక పోయారు.వారిలోచాలామంది పరీక్షాకేంద్రాలకు నాలుగు నుంచి ఐదు నిమిషాలు మాత్రమే ఆలస్యంగా చేరుకున్నారు. ఇవన్నీ క్షమించదగిన విషయాలే. ఎందుకంటే ఇవన్నీ విద్యార్థుల అదుపులో లేని కారణాలు. మధ్యప్రదేశ్‌లో తండ్రి బైకు పంక్చర్ కావడంతో రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన బిడ్డను సెంటర్‌లోకి రానివ్వలేదు. జగిత్యాలలో తమ బిడ్డనులోనికి పంపాలని సెక్యూరిటీ సిబ్బందికాళ్ళమీద పడిందోమాతృమూర్తి.క్రమశిక్షణ పేరుతో సమయపాలన వంటి సాంకేతిక అంశాలలో వ్యవస్థ కూరుకుపోవడంలో అర్థం లేదు. అందువల్ల అటువంటి విద్యార్థులకు కరుణతో మళ్లీ నీట్ పరీక్ష రాయడానికి అవకాశం కల్పించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### సహ చట్టాన్ని నీరుగారుస్తున్న అధికారులు

ప్రజాసేవకులైన అధికారుల పనితీరు, పాలనలో పారదర్శకత, జవాబుదారీ తనం పౌరులు తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం 2005 లో తీసుకురాబడింది. ఎందుకంటే అధికారులు తీసుకుంటున్న లక్షలు లక్షల జీతాలు ప్రజలు పన్నులుగా చెల్లించిన డబ్బేకనుక.అందువలన అది దుర్వినియోగం అవుతుందా సద్వినియోగం అవుతుందా అని తెలుసుకోవలసిన అవసరం సామాన్యుడికి సైతం ఉంది. ఐతే అధికారులు మాత్రం అవకాశం వచ్చినపుడల్లా ఈ చట్టాన్ని దుర్వినియోగ పరుస్తున్నారు. ఒకసారి పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారినీ సమాచారం కోరితే నిర్ణీత సమయంలో కోరిన సమాచారం ఇవ్వడులేదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### బయోమెట్రిక్ అమలు చేయాలి

ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన లేకుండా విధి నిర్వహణలో సేవల పట్ల ప్రజలను ఇబ్బందిపెడుతూ వారికి నచ్చిన సమయానికి విచ్చేసి మరల తొందరగా వెళుతున్నారు. కావున అధికారులు ఉద్యోగులకు ఉదయం, సాయంత్రంబయోమెట్రిక్ విధానాన్ని అమలు కఠినతరం చేస్తేనేమారుమూల ప్రజలకు మేలుచేసే అవకాశం ఉంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలి

ప్రజారోగ్య పరిరక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తాయి. గ్రామీణ, పట్టణ పేద ప్రజలకు ఇవే మొదటి వైద్య సేవలకేంద్రాలుగా నిలుస్తాయి.అయితే పెరుగుతున్న జనాభా, కొత్త వ్యాధులు, వైద్య సేవలపై పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఈ ఆసుపత్రుల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాల్సి న అవసరం ఏర్పడింది.అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోవైద్యులు,నర్సు లు,సాంకేతిక సిబ్బంది కొరత కనిపిస్తోంది. అవసరమైన మందులు,పరీక్షా పరికరాలు, అత్యవసర చికిత్స సదుపాయాలు కూడా కొన్నిప్రాంతాల్లో తగిన స్థాయిలో లేవు. ఫలితంగా చిన్నవ్యాధులకే ప్రజలు పెద్ద నగరాల్లోని ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రభుత్వ వైద్య వ్యవస్థపై అదనపు భారం పడుతోంది. జిల్లా ఆసుప త్రుల్లో ఆధునిక నిర్ధారణ పరికరాలు,ప్రత్యేక వైద్య సేవలు, ఐసీయూ సదుపాయాలు, తగినపడకల సంఖ్యను పెంచడం అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అప్పుడలా ఇప్పుడిలా

**ఒకప్పుడు** ఎక్కడో దూర ప్రాంతంలో ఉన్న మాత్రులకి, చుట్టాలకి ఫోను చేసి మాట్లాడాలంటే ట్రంక్ కాల్ బుక్ చేసుకుని గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు చేతిలో ఉండే సెల్‌ఫోనుతో క్షణాల్లో ప్రపంచంలో ఎక్కడున్న వారితోనైనా మాట్లాడవచ్చు. వీడియోకాల్ అయితే ఎదురుగ ఉన్న మనిషితో మాట్లాడుతున్నట్లు ఉంటుంది. గతంలో బజారుకి వెళ్లి వస్తువు కొనాలంటే జేబులో డబ్బులు ఉండాల్సి ందే. అదే ఇప్పుడు షోరూంలో ఎంత ఖరీదు వస్తువు అయినా రోడ్డు పక్కన బండి మీద అమ్మే కూరగాయలు అయినా జేబులో నయాపైసా లేకపోయినా ఫోన్ పే చేసి కొనుక్కోవచ్చు. ఇదంతా అభివృద్ధే. అయితే ఈ అభివృద్ధి పుష్కరకాలంలో సాధించింది కాదు.

- మిథునం, హైదరాబాద్

### గురుకులాల్లో కుల వివక్షత?

**తెలంగాణా** రాష్ట్రంలో ఉన్న వివిధ గురుకులలలో కుల వివక్షత విపరీతంగా ఉంది. టీచింగ్, నాన్ టీచింగ్ ఎస్సి, ఎస్టీ, వికలాంగుల సిబ్బంది పై వివక్షత ఉంది. కనుక ప్రభుత్వం ప్రతి గురుకుల ప్రిన్సిపాల్‌లకు వివక్షత లేకుండా చూసే విధంగా ఆదేశాలు జారీ చేయాలి. కుల వివక్షతపై ప్రతి జిల్లా కేంద్రంలో ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ చట్టం 1989 పై అవగాహనా చైతన్య కార్యక్రమం నిర్వహించడం అవసరం.

- కదురు శ్రీనివాస్, వరంగల్

# సమాజంలో పెరుగుతున్న 'వృద్ధాప్య' సవాళ్లు

ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశం మనదే. ఇదే మన బలం అని ఇన్నాళ్లూ చెబుతూ వచ్చాం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతుందని ఆశలు వ్యక్తమవుతున్నాయి. కానీ ఈ పరిస్థితి ఎప్పటికీ అలాగే ఉండదు. దేశంలో జననాల రేటు తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మారకముందే, వృద్ధాప్య సమాజం సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే మన ముందున్న అసలు సమస్య. ప్రస్తుతం దేశ జనాభాలో దాదాపు 68 శాతం మంది 15 నుంచి 64 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారే. ప్రపంచంలోని చాలా దేశాలతో పోలిస్తే ఇది మనకు లభించిన అరుదైన అవకాశం. కానీ ఈ అవకాశానికి కూడా ఒక గడువు ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం 2050 నాటికి 60 ఏళ్లు దాటిన భారతీయుల సంఖ్య 34 కోట్లకు చేరే అవకాశం ఉంది. అంటే నేటి అమెరికా మొత్తం జనాభాతో సమానమైన వృద్ధ జనాభా ఒక్క భారత్‌లోనే ఉండబోతోంది. మరోవైపు, దేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు ఇప్పటికే జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 స్థాయి కంటే దిగువకు పడిపోయింది. కేరళ, తమిళనాడు,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి అనేక రాష్ట్రాల్లో ఈ సంఖ్య మరింత తక్కువగా ఉంది. అంటే నేడు యువ దేశంగా కనిపిస్తున్న మనం, రేపు వృద్ధుల సంఖ్య వేగంగా పెరిగే దేశంగా మారబోతున్నాం. వృద్ధాప్యం అసలు సమస్య కాదు. ప్రపంచంలోని ప్రతి దేశం ఏదో ఒక దశలో ఈ పరిస్థితిని ఎదుర్కొంటుంది. అసలు ప్రమాదం వేరే. ధనిక దేశంగా మారకముందే వృద్ధాప్య సమాజంగా మారడమే మన ముందున్న సవాలు. జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, చైనా వంటి దేశాలు మాత్రం ముందుగా తమ ఆర్థిక బలాన్ని పెంచుకున్నాయి. ప్రజల ఆదాయాలు పెరిగాయి. ఆరోగ్య,సామాజిక భద్రతా వ్యవస్థలను బలోపేతం చేసుకున్నాయి. ఆతర్వాతే అక్కడ వృద్ధుల సంఖ్య పెరిగింది. మన పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఇంకా మనం అభివృద్ధిచెందుతున్న దేశంగానే ఉన్నాం. తలసరి ఆదాయం ఇప్పటికీ అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. యువ నిరుద్యోగం ఇప్పటికీ పెద్ద సమస్యగానే ఉంది. వివిధ అంచనాల ప్రకారం యువతలో

డి చంద్రభాను

నిరుద్యోగం 15శాతానికి మించి ఉంది. చదువుకున్న వారికి తగిన ఉద్యోగాలు దొరకడం లేదు. మహిళల ఉద్యోగాల్లో భాగస్వామ్యం కూడా 40శాతం కంటే తక్కువగానే ఉంది. కోట్లాది మంది ఇప్పటికీ అసంఘటిత రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అంటే మనం ఇంకా పూర్తిగా ఎదగకముందే కొత్త సవాళ్లు మన ముందుకువస్తున్నాయి.అందుకే సంపన్న దేశంగా ఎదగకముందే వృద్ధాప్య సమాజంగా మారడం, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే అత్యంత క్లిష్టమైన సమస్యల్లో ఒకటిగా నిపుణులు భావిస్తున్నారు. అయితే జనాభా పరిమాణమే దేశ బలాన్ని నిర్ణయించే రోజులు



క్రమంగా ముగుస్తున్నాయి. ఒకప్పుడు ఎక్కువ జనాభా అంటే ఎక్కువ శ్రామిక శక్తి, ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం అనిభావించేవారు. కానీ కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్,ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో, కేవలం ఎక్కువ మంది యువత ఉండటం మాత్రమే సరిపోదు. అధిక నైపుణ్యాలు, ఉత్పాదకత, సాంకేతిక సామర్థ్యాలే దేశాల మధ్య పోటీలో అసలు తేడాను నిర్ణయిస్తున్నాయి. అంటే మన దేశానికి లభించిన జనాభా ప్రయోజనం శాశ్వతం కాదు. దాన్ని ఉపయోగించుకోవాల్సి న సమయం కూడా అపరిమి తం కాదు. రాబోయే రోజుల్లో వృద్ధుల సంఖ్య పెరగడం కేవలం సామాజిక సవాలు మాత్రమే కాదు. అదే పరిస్థితి కొత్త వ్యాపారాలు, కొత్త ఉద్యోగాలు, కొత్త సేవలకు కూడా మార్గం చూపవచ్చు. రాబోయే దశాబ్దాల్లో ఆరోగ్య సేవలు, వృద్ధుల సంరక్షణ, బీమా, ప్రత్యేక గృహాలు, సహాయక పరికరాలు, ఇంటి వద్దే వైద్య సేవలు వంటి రంగాల్లో భారీ డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. జపాన్, ఐరోపా దేశాలు ఇప్పటికే ఈ రంగాలను కొత్త వృద్ధి అవకాశాలుగా మార్చుకున్నాయి. మన దేశంలో మాత్రం ఈ అంశంపై ఇంకాపెద్దగా చర్చ మొదలుకాలేదు. వృద్ధాప్యాన్ని కేవలం సమస్యగా కాకుండా, కొత్త ఆర్థిక అవకాశంగా కూడా చూడాల్సి న అవసరం ఉంది. ఇప్పుడున్న పరిస్థితిని చూసి మనకు ఇంకా చాలా సమయం ఉందని అనుకోవడం ప్రమాదకరం. మహిళలకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడం, యువతకు నైపుణ్యాలను పెంచడం,ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడం, వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలి. అదే సమయంలో కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, ఆటోమేషన్ వంటి సాంకేతికతలను ఉపయోగించి ఉత్పాదకతను పెంచాల్సి న అవసరం కూడా ఉంది. ఎందుకంటే భవిష్యత్తులో దేశాల బలాన్ని నిర్ణయించేది జనాభా సంఖ్య కాదు. ఆ జనాభా ఎంత సమర్థంగా పనిచేస్తుందన్నదే అసలు విషయం. దశాబ్దాలుగా మనం యువ జనాభాను ఒక వరంగా భావిస్తున్నాం. కానీ వరాలు కూడా శాశ్వతంకావు. అవకాశాలకు కూడా ఒక గడువుఉంటుంది.చైనా తన యువ జనాభాను ఉపయోగించుకుని ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదిగింది. ఇప్పుడు అదే దేశం వృద్ధాప్య సమాజం సవాళ్లను ఎదుర్కొంటోంది. మన దేశానికి కూడా ఇప్పుడు ఒక అరుదైన అవకాశం లభించింది. కానీ అలాంటి అవకాశాలు ఎప్పటికీ ఎదురుచూడవు. మరోవైపు, జనాభా మార్పులు దేశవ్యాప్తంగా ఒకేలా ఉండవు. దక్షిణ భారతదేశంలోని అనేక రాష్ట్రాలు ఇప్పటికే తక్కువ జననాలరేటుతో వేగంగా వృద్ధాప్య సమాజాలుగా మారుతుండగా,కొన్ని ఉత్తర రాష్ట్రా లు ఇంకా యువజనాభాతో ఉన్నాయి. ఈ అసమానతలు భవిష్యత్తులో దేశంలోనే కొత్త ఆర్థిక,సామాజిక, వలస సవాళ్లకు దారితీసే అవకాశంఉంది. అందుకే దేశమంతటికీ ఒకే విధానం సరిపోదు.రాష్ట్రాల పరిస్థితులను బట్టి వేర్వేరువ్యూహాలు అవసరం.ప్రస్తుతం మన ముందున్న అసలు ప్రశ్న జనాభా ఎంత ఉందనేదికాదు. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశంగా ఉన్నమనం, ఈ అవకాశాన్ని సంపదగా మార్చుకోగలమా లేదా అనేదే తేల్చుకోవాల్సి న విషయం. నేడు మనకు వరంగా కనిపిస్తున్న ఈఅవకాశం, రేపు మనం కోల్పోయిన అవకాశంగా చరిత్రలో మిగిలిపోవచ్చు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

27-6Pg5.qxd:27-6Pg5.qxd 1/1/02 6:50 AM Page 1



# ముదిరిన అయోధ్య విరాళాల వివాదం







## ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, మరో సభ్యుని రాజీనామా

### బ్యాంకుల పాత్రపైనా 'సిట్'దర్యాప్తు

### ఎఫ్ఐఆర్‌లోని 8 మంది నిందితుల అరెస్టు

### దోషులను వదిలేది లేదు: సిఎం ఆదిత్యనాథ్

**అయోధ్య, జూన్ 26:** అయోధ్య రామమందిరానికి సంబంధించిన నిధుల దుర్వినియోగం వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' అధిపతి చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా తమ పదవుల నుంచి తప్పుకున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సమాచారశాఖ డైరెక్టర్ అందించిన సమాచారం ప్రకారం, ట్రస్ట్‌కు చెందిన ఈ ఇద్దరు కీలక సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. నైతిక కారణాలతోనే వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కోట్లాది మంది భక్తులను దిగ్భ్రాంతికి గురిచేసిన రామమందిర విరాళాల వివాదం నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఆలయ సిబ్బంది, బ్యాంకు అధికారులతో కుమ్మక్కై వందల కోట్ల రూపాయల విలువైన కానుకలు, విలువైన వస్తువులను దుర్వినియోగం చేశారని నివేదికలు వెల్లడించాయి. ఆలయ రోజువారీ కార్యకలాపాలు, శ్రీరాముడికి సమర్పించే కానుకల (చడావా) నిర్వహణను పర్యవేక్షించే బాధ్యత ట్రస్ట్‌పై ఉన్నందున, ఆలయంలో జరిగిన తీవ్రమైన అక్రమాలకు సంబంధించి బాధ్యతను నిర్ధారించే చర్యలో భాగమే ఇది. రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణలో లోపాలను ఎత్తిచూపుతూ సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) సమర్పించిన ప్రాథమిక నివేదిక తర్వాత, అధికారులను తొలగించాలనే డిమాండ్, వారిపై పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో ఈ రాజీనామాలు జరిగాయి. ఆలయ నిధులను అక్రమంగా తరలించడానికి కుమ్మక్కయ్యారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ సిబ్బంది, లెక్కింపు సిబ్బంది, మాజీ బ్యాంకు అధికారులతో సహా ఎనిమిది మంది వ్యక్తులపై గురువారం రాత్రి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న నిందితులందరినీ అరెస్టు చేసి జైలుకు తరలించారు. అరెస్టు అయిన వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామశంకర్ యాదవ్ (అలియాస్ తిన్ను) ఉన్నారు.

**పలువురు బ్యాంకు అధికారుల పాత్రపైనా సిట్ దర్యాప్తు:** రామ మందిర విరాళాల వివాదంలో నగదు, కానుకలను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఆలయ సహాయకుడు, మాజీ బ్యాంకు సిబ్బంది, నగదు లెక్కింపులో పాల్గొన్న వారితో సహా ఎనిమిది మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చడంతో, ఈ దొంగతనంలో 'కుమ్మక్కు' అయినందుకు పలువురు బ్యాంకింగ్ అధికారులు విచారణను ఎదుర్కొనే అవకాశం ఉంది. అరెస్ట్ అయిన ఎనిమిది మంది నిందితులను ప్రస్తుతం విచారిస్తున్నారు. విచారణ సమయంలో, తిను, సుభాష్ ఈ దొంగతనం జరిగిన తీరు గురించి, అలాగే ఇందులో మరికొంత మంది ప్రమేయం గురించి సంచలన విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. ఆలయ కానుకల దుర్వినియోగానికి మధ్యవర్తులుగా లేదా మాధ్యమాలుగా వ్యవహరించిన పలువురు ప్రభుత్వ బ్యాంకు అధికారుల పేర్లను కూడా వారు వెల్లడించినట్లు సమాచారం. ఈ నిధుల దుర్వినియోగం రాకెట్‌లో ఒకరు కాదు, పలువురు బ్యాంకింగ్ అధికారులు పాలు పంచుకున్నట్లు తేలింది. వారి అనుమానాస్పద ప్రవర్తనపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఆలయ దొంగతనం ప్రణాళిక, అమలులో తిన్ను యాదవ్, సుభాష్ శ్రీవాస్తవ కీలక పాత్ర పోషించినట్లు విచారణలో తేలింది. సుభాష్ ఈ ఆపరేషన్‌లో ఇతరులను చేర్చుకుని, ఆలయంలో నగదు కానుకలను లెక్కించే సిబ్బందికి విధులను కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి. టెంపుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మాజీ డ్రైవర్ అయిన తిన్ను, ఈ దొంగతనం వివాదంలో ప్రధాన వ్యక్తిగా వెలుగులోకి రాగా, అరెస్టయిన ఎనిమిది మందిలో సుభాష్ మాజీ బ్యాంకింగ్ ఉద్యోగిగా ఉన్నాడు. ఆలయంలో నగదు లెక్కింపు సిబ్బందిని పర్యవేక్షించింది సుభాషేనని, విరాళాలను దుర్వినియోగం చేయడంలో అతనే కీలక పాత్ర పోషించాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేర విధానానికి సంబంధించి, ప్రజల కంట పడకుండా ఉండేందుకు మొదట నగదు కట్టలను బాత్రూమ్‌లో దాచి, ఆ తర్వాత రాత్రివేళ ఆలయ ప్రాంగణం నుండి బయటకు తరలించినట్లు సమాచారం. ఆ తర్వాత, దొంగిలించిన డబ్బును వేర్వేరు ప్రాంతాల్లో వేరు చేసి, మోసగాళ్ల ఖాతాలకు మళ్లించారు. ఈ ముఠా గత 23 యేళ్లుగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు భావిస్తున్నారు.

**దోషులను వదిలేదిలేదు: సిఎం యోగి**

రామమందిర విరాళాల వివాదంలో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం మరోసారి స్పష్టం చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదిక సమర్పించిన వెంటనే చర్యలు మొదలయ్యాయని, దోషులు చట్టం ముందు నిలబడేలా చూస్తామని హామీ ఇచ్చారు. జూన్ 19న అయోధ్యలో పర్యటించినప్పుడు దర్యాప్తు తర్వాత చర్యలు తీసుకుంటానని తాను చెప్పానని, ఆ 'శిక్షా ప్రక్రియ' ఇప్పటికే మొదలైందని సిఎం పేర్కొన్నారు.



వెనిజులాలో భూకంపంధాటికి మట్టిలో కూరుకుపోయిన కార్లు

# వెనిజులా భూకంపంలో 600 దాటిన మృతులు

## వేలాదిమంది గల్లంతు

### తక్షణ సాయం అందించిన భారత్

**కారకాస్, జూన్ 26:** వెనిజులాలో సంభవించిన రెండుభారీ భూకంపాలు దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టాయి. రిక్టర్ స్కేలుపై 7.2, 7.5 తీవ్రతతో సంభవించిన భూకంపాల కారణంగా ఇప్పటివరకు 600మందిపైగా మృతి చెందగా, 4,300 మందికి పైగా గాయపడ్డారు. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. అనధికారిక లెక్కలప్రకారం లక్షమందికిపైగా ఈజంట భూకంపాలకారణంగా గల్లంతయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. వెనిజులా ఆరోగ్య మంత్రి కార్లోస్ అల్వారాడో మాట్లాడుతూ, ఆసుపత్రులకు చేరుకునేలోపే వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. శిథిలాల కింద ఇంకా ఎంతో మంది చిక్కుకుపోయి ఉండటంతో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని తెలిపారు. రాజధాని కారకాస్‌తో పాటు ఉత్తర తీర ప్రాంతాల్లో భవనాలు భారీగా కూలిపోయాయి. లా గువైరా ప్రాంతంలో అత్యధిక ప్రాణనష్టం సంభవించింది. అక్కడి ప్రధాన విమానాశ్రయం కూడా దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని స్థానికులు తమ చేతులతోనే రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన భారీ యంత్రాలు ఇంకా చేరలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పిపోయిన తమ చిన్నారుల కోసం తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. భూకంప ప్రభావంతో కారకాస్ నగరంలో విద్యుత్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. మెట్రో రైలు సేవలను నిలిపివేయగా, సహజ వాయువు సరఫరాను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. పాఠశాలలకు కొన్ని రోజుల పాటు సెలవులు ప్రకటించి, వాటిని సహాయ శిబిరాలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సహాయక చర్యల కోసం భారీ నిర్మాణ యంత్రాలను అందించాలని పరిశ్రమలను కోరారు. భూకంప బాధితుల సహాయార్థం అమెరికా కొన్ని ఆర్థిక ఆంక్షలను తాత్కాలికంగా సడలించింది. భూకంప సహాయ కార్యక్రమాలకు సంబంధించిన లావాదేవీలకు అక్టోబర్ 23 వరకు అనుమతి ఇచ్చింది. అమెరికా, మెక్సికో, బ్రెజిల్, కెనడా, స్పెయిన్, పోర్చుగల్, ఖతార్, డొమినికన్ రిపబ్లిక్ తదితర దేశాలు సహాయక బృందాలు, వైద్య సిబ్బంది, ఔషధాలు, తాగునీటి శుద్ధి పరికరాలు, డ్రోన్లు, శునక దళాలను వెనిజులాకు పంపిస్తున్నట్లు ప్రకటించాయి. అమెరికా భూగర్భ సర్వే సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, మొదటి భూకంపం కారకాస్‌కు పశ్చిమాన సముద్ర తీరానికి సమీపంలో సంభవించగా, కేవలం నిమిషం వ్యవధిలోనే రెండో భారీ భూకంపం అదే ప్రాంతాన్ని తాకింది. తక్కువ లోతులో సంభవించిన ఈ రెండు భూకంపాలు వరుసగా రావడంతో విధ్వంసం మరింత తీవ్రంగా మారిందని భూకంప నిపుణులు తెలిపారు.

భూకంపంతో అతలాకుతలమైన వెనుజులాకు ఆయా దేశాలు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా లాటిన్ అమెరికా దేశానికి ఆపన్న హస్తం అందించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 'ఆపరేషన్ అమిస్టాడ్' కొనసాగుతోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు.

ఇందులో భాగంగా సహాయక చర్యలకు అవసరమైన సామగ్రితో భారత సైన్యానికి చెందిన రెండు సి-17 విమానాలు బయలుదేరినట్లు చెప్పారు. భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామర్థ్యమున్న రెండు మొబైల్ ఆస్పత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలు పంపించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. క్లిష్ట సమయంలో వెనుజులా ప్రభుత్వానికి, అక్కడి పౌరులకు అవసరమైన సాయం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అమిస్టాడ్ అంటే స్పానిష్ భాషలో స్నేహం అని అర్థం.

## ఆపరేషన్ సిందూర్ అమరుల పేర్లను ప్రకటించిన భారత్

**న్యూఢిల్లీ,జూన్ 26:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన భయంకర ఉగ్రదాడికి ప్రతికారంగా భారత సైన్యం పాకిస్థాన్ గుండెల్లో దడపుట్టేలా జరిపిన మెగా కౌంటర్ ఆపరేషన్ ఆపరేషన్ సిందూర్. ఈ భీకర ఆపరేషన్‌లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఒక సర్జెంట్ వీరమరణం పొందారు ప్రభుత్వం నప్రకటించింది. సుబేదార్ మేజర్ పవన్ కుమార్ -హెడ్‌క్వార్టర్స్ 10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్. రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ - 4వ బెటాలియన్, జమ్మూకశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్. లాన్స్ నాయక్ దినేష్ కుమార్ - 5 ఫీల్డ్‌రెజిమెంట్. అగ్నివీర్ మూడ్ మురళీ నాయక్ -851 లైట్ రెజిమెంట్ (మన తెలుగు రాష్ట్రానికి చెందిన వీరుడు కావడం విశేషం). హవల్దార్ సునీల్ కుమార్ సింగ్ - 237 ఫీల్డ్ వర్క్‌షాప్. సర్జెంట్ సురేంద్ర కుమార్ - 39 వింగ్, భారత వైమానికదళం. ఆపరేషన్ సిందూర్‌లో శత్రువుల స్థావరాలను ధ్వంసం చేస్తూ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు గానూ రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌కు మరణానంతరం దేశపుమూడవ అత్యున్నత సైనిక పురస్కారమైన వీరచక్రను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. స్కై ఆపరేషన్స్‌లో కీలక పాత్ర పోషించిన ఐఎఎఫ్ సర్జెంట్ సురేంద్ర కుమార్‌కు మరణానంతరం వాయుసేన మెడల్‌తో గౌరవించింది.



# 'సర్‌'కు యేడాది!

## 6 కోట్ల ఓట్లు తొలగింపు

### కొనసాగుతున్న ప్రక్రియ

### డిసెంబర్‌కి ముగింపు

**న్యూఢిల్లీ, జూన్ 26:** ఓటర్ల జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ఇప్పటివరకు దాదాపు ఆరు కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి. ఈ ప్రక్రియ మొదలై జూన్ 26నాటికి యేడాది పూర్తయింది. ప్రతిపక్షం, ఎన్నికల సంఘం మధ్య వివాదానికి కారణమైన ఈ ప్రక్రియ, సుప్రీంకోర్టు దీని రాజ్యాంగబద్ధతను సమర్థించడంతో 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, గత ఏడాది జూన్ 24న బీహార్‌లో ఈ ఎస్ఐఆర్ పైలట్ ప్రక్రియ ప్రారంభమైంది. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత, అక్కడి ఓటర్ల జాబితా నుండి దాదాపు 65 లక్షల పేర్లు తొలగించబడ్డాయి. అయితే, పత్రాలు లేవనే కారణంతో పౌరుల ఓటు హక్కును తొలగించేందుకు ఎన్నికల సంఘం బిజెపి ఆదేశాల మేరకు పనిచేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడంలో ఎన్నికల సంఘం (ఇసి) వ్యవహరించిన తీరు రాజ్యాంగబద్ధమేనని మార్చిలో సుప్రీంకోర్టు ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఎస్ఐఆర్ సమయంలో పేర్లు తొలగించబడిన వ్యక్తులు పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో రాష్ట్ర సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత, ఓటర్ల జాబితా ప్రక్షాళన డేటాను సామాజిక భద్రతా పథకాలతో అనుసంధానిస్తున్నట్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. అర్హులైన పౌరులెవరూ జాబితాలో లేకుండా పోకూడదని, అనర్హులు ఎవరూ చేరకూడదని నిర్ధారించే ప్రక్రియగా పేర్కొంటూ, ఎస్ఐఆర్ ఇప్పుడు ఎన్‌సిఇఆర్‌టి సామాజిక శాస్త్ర పాఠ్య పుస్తకంలో కూడా చోటు దక్కించుకుంది.

గత యేడాది అక్టోబర్ 27న ప్రకటించిన ఈ ప్రక్రియ రెండవ దశలో ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాల్లో మొత్తం ఓటర్ల జాబితాలో 10.2 శాతం పేర్లు తొలగించబడ్డాయి.

వీటితోపాటు కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ముందు మొత్తం ఓటర్ల సంఖ్య 50.99 కోట్లకు పైగా ఉండేది. ఈ ప్రక్రియ తర్వాత, ఓటర్ల సంఖ్య 45.81 కోట్లకు చేరింది. అంటే 5.18 కోట్లకు పైగా తగ్గుదలనమోదైంది. శాతం పరంగా చూస్తే, ఓటర్ల జాబితాలో 10.2 శాతం మేర తగ్గింపు జరిగింది. ఓటర్ల జాబితాల నుండి మొత్తం 66,88,636 మంది మరణించిన ఓటర్ల పేర్లను తొలగించారు. ఇందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుండి 25.47లక్షల మంది, ఆ తర్వాతి స్థానంలో ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్ నుండి 24.16లక్షలమంది ఉన్నారు. అదనంగా, ఎస్ఐఆర్ ప్రక్రియలో వచ్చిన అభ్యంతరాలు, వాటి పరిష్కారం ఆధారంగా మరో 63.16 లక్షల పేర్లను తొలగించారు. 12రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాలు వేర్వేరు తేదీలలో విడుదలయ్యాయి, వీటిలో ఉత్తరప్రదేశ్ చివరిగా తన డేటాను విడుదల చేసింది.

36.73 కోట్ల మంది ఓటర్లతో కూడిన ఎస్ఐఆర్ ప్రక్రియ మూడవ దశ మే 14న ప్రారంభమైంది. ఈ యేడాది చివరలో ముగుస్తుంది. ఈ దశ ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్,సిక్కిం, త్రిపుర, తెలంగాణ, ఉత్తరాఖండ్ అనే 16రాష్ట్రాలు, ఢిల్లీ, చండీగఢ్, దాద్రా- నగర్ హవేలీ, డామన్- దయ్యూ అనే మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలు చేయబడుతోంది.

# సంక్షిప్త వార్తలు

## కనిష్కను కూల్చింది ఖలిస్థానీ ఉగ్రవాదులే: కెనడా



**ఒట్టావా, జూన్ 26:** ఖలిస్థానీ ఉగ్రవాదంపై మెతకవైఖరి అవలంబిస్తూ వారికి పరోక్షంగా మద్దతిస్తూ, ఆశ్రయమిస్తూ వచ్చిన కెనడా తన వైఖరిని మార్చుకుంటోందా? అవుననే సమాధానం వస్తోంది. ఎయిరిండియా కనిష్క విమాన ప్రమాదం జరిగి నాలుగు దశాబ్దాలు గడిచిన తర్వాత తొలిసారి.. 329 మంది ప్రాణాలను బలిగొన్న ఆ ఘటనలో ఖలిస్థానీ ఉగ్రవాదుల పాత్ర ఉందని అధికారికంగా అంగీకరించింది. ఇన్నాళ్లు ఖలిస్థానీ వేర్పాటువాదుల పేరును ఎన్నడూ ప్రస్తావించని ఆ దేశం.. ఇప్పుడు ఆ దారుణ మారణకాండకు వారే కారణమని స్పష్టం చేసింది. 1985 జూన్ 23న అట్లాంటిక్ మహాసముద్రంపై ఎయిరిండియా బోయింగ్ విమానం 'కనిష్క' కూలి అందులో ప్రయాణిస్తున్న వారంతా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

## అజాన్‌పై నిషేధం విధించేందుకు డెన్మార్క్ కసరత్తు



**కోపెన్ హ్యాగన్,జూన్ 26:** డెన్మార్క్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా మసీదుల నుంచి బహిరంగంగా వినిపించే ఇస్లామిక్ ప్రార్థన పిలుపు అజాన్‌పై నిషేధం విధించే అంశాన్ని పరిశీలిస్తోంది. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కును ఉల్లంఘించకుండా దీనిని ఏ విధంగా అమలు చేయవచ్చనే అంశంపై న్యాయ సమీక్షకు ఆదేశించింది. ఈ విషయాన్ని దేశ ఇమ్మిగ్రేషన్ మంత్రి మోర్టెన్ బోడ్స్కోవ్ వెల్లడించారు. డెన్మార్క్ వీధుల్లో నడుస్తుంటే ఇస్లామాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్నామనే భావన కలగకూడదని ఆయన వ్యాఖ్యానించారు. డెన్మార్క్ పైకప్పుల వెలుపల అజాన్ వినిపించాల్సిన అవసరం లేదని, ఇక్కడ దానికి స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఇస్లాం ప్రభావం పెరుగుతోందని ఈ సందర్భంగా ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## రాహుల్‌గాంధీపై బిజెపి సోషల్‌మీడియా మీమ్స్ ప్రచారం




**న్యూఢిల్లీ,జూన్ 26:** దేశ రాజకీయాల్లో సోషల్ మీడియా వేదికగా మరో డిజిటల్ వార్ మొదలైంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ఒక భారీ మీమ్స్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. రాహుల్ గాంధీ తరచూ వెళ్లే విదేశీ పర్యటనల సమయం, వాటి ఉద్దేశం, అలాగే ఆ ప్రయాణాలకు అయ్యే ఖర్చుల ఫండింగ్‌ను ప్రశ్నిస్తూ బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాను ముంచెత్తుతున్నాయి. ఈనెల 25 నుంచి ఊపందుకున్న ఈ సమన్వయ డిజిటల్ ప్రచారంలో బీజేపీ జాతీయ విభాగంతో పాటు వివిధ రాష్ట్రాల ఐటీ సెల్స్, పార్టీ నాయకులు చురుగ్గా పాల్గొంటున్నారు.

## బంకిపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో ప్రశాంత్‌కిషోర్ పోటీ



**పాట్నా,జూన్ 26:** ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఇటీవల నితిన్ నబిన్ రాజ్యసభకు వెళ్లడంతో బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీస్థానం ఖాళీ అయింది. దీంతో త్వరలోనే ఈ స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. ఈ ఉపఎన్నికలో స్వయంగా రంగంలోకి దిగాలని ప్రశాంత్ కిషోర్ భావిస్తున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీఎన్నికల్లో పోటీ చేయకుండా ప్రచారానికి పరిమితమయ్యారు. దీంతో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే ఉపఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తాజాగా మీడియాకు తెలియజేశారు.

## గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీ పతనం..

**న్యూఢిల్లీ,జూన్ 26:** అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు శుక్రవారం భారీగా తగ్గాయి. హార్మూజ్ జలసంధిలో చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గడంతో బ్రెంట్, డబ్ల్యూటీఐ క్రూడ్ ధరలు దాదాపు రెండు శాతం మేర పడిపోయాయి. ఈ వారం మొత్తంగా రెండు బెంచ్‌మార్క్‌లు సుమారు ఏడు శాతం నష్టాలను నమోదు చేసే దిశగా సాగుతున్నాయి. ప్రారంభ ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర రెండు శాతం తగ్గి 73.75 డాలర్లకు, అమెరికా వెస్ట్‌టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర రెండు శాతం పడిపోయి 70.42 డాలర్లకు చేరింది.

# ఒక్క రాత్రే రష్యాపైకి 660 డ్రోన్లు: ఉక్రెయిన్ భీకర దాడి



**కీవ్, జూన్ 26:** ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. తాజాగా మాస్కో ఆధీనంలో ఉన్న క్రిమియాతోపాటు రష్యా వ్యాప్తంగా 12 ప్రాంతాలపై కీవ్ వందల కొద్దీ డ్రోన్లతో విరుచుకుపడింది. ఒక్క రాత్రే 660 డ్రోన్లను ప్రయోగించింది. వీటన్నింటిని తాము సమర్థవంతంగా అడ్డుకున్నామన రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. రాజధాని మాస్కో సహ అజోవ్, నల్ల సముద్ర తీరంలోని నగరాలు, క్రిమియాను ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకుంది. తమ నగరంవైపు దూసు కొచ్చిన 47 డ్రోన్లను కూల్చివేసినట్లు మాస్కో మేయర్ వెల్లడించారు. అయితే, దీని వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందా? అనే వివరాలను ఆయన బయటపెట్టలేదు. నోవోమోస్కోవ్‌స్కీ ప్రాంతం లోని ఓ కెమికల్ ప్లాంట్, హైడ్రోఎలక్ట్రిక్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్లను ప్రయోగించగా అక్కడ భారీగా మంటలు చెలరేగినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, దీనిపై రష్యా నుంచి అధికారిక ప్రకటన రాలేదు. ఈ దాడుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ యుద్ధాన్ని ముగించేందుకు యేడాది కాలంగా అమెరికా చేపట్టిన శాంతి ప్రయత్నాలు ఎలాంటి పురోగతి సాధించలేదు. ఈ నేపథ్యంలోనే రష్యా సైనిక స్థావరాలు, విద్యుత్ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఉక్రెయిన్ ఇటీవల కాలంలో తమ దాడులను ఉధృతం చేసింది. దీనిపై తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎక్స్ వేదికగా స్పందించారు. 'యుద్ధం ముగించేలా రష్యాపై ఒత్తిడి తెచ్చే లక్ష్యంగా 40 రోజుల పాటు కీలక ఆపరేషన్ చేపట్టనున్నాం' అని వెల్లడించారు. ఈ సమయంలో తమ చర్యలు అత్యంత ఉధృతంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే రష్యాపై కీవ్ డ్రోన్లతో విరుచుకుపడటం గమనార్హం.



## కౌటిల్యుడి అర్థశాస్త్రంలోనే సమానత్వ సిద్ధాంతం: చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ,జూన్26:** ఆధునిక ప్రజాస్వామ్యానికి, చట్టబద్ధ పాలనకు పునాదిగా భావించే మాగ్నా కార్టాకన్నా శతాబ్దాల ముందే భారతదేశంలో సమానత్వ భావన పుట్టిందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కౌటిల్యుడు రచించిన అర్థశాస్త్రంలోనే దీని మూలాలు స్పష్టంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో జరిగిన 14వ సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ న్యాయఫోరమ్‌లో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 1215లో వచ్చిన మాగ్నా కార్టా రాజుతో సహా ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలనే విప్లవాత్మక సూత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసిందని చెబుతారని, కానీ అంతకంటేముందే నాలుగో శతాబ్దంలోనే కౌటిల్యుడి అర్థశాస్త్రం సమానత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిందని తాను వ్యక్తిగతంగా విశ్వసిస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. అర్థశా మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని ప్రధాన సలహాదారుడైన కౌటిల్యుడు సంస్కృతంలో రచించారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ చట్టం సమానంగా అందుబాటులో ఉండటం అనేది కేవలం ఒకప్రక్రియగా మిగిలిపోకూడదని, అది ప్రజలకు వాస్తవ హక్కులను అందించాలని స్పష్టం చేశారు. చట్టపరమైన హామీలను వల్లెవేయడం కాదుభౌగోళిక, ఆర్థిక, సామాజిక అంతరాలను అధిగమించి వాటి ఫలాలను ప్రజలకు అందించడమే అసలైన సవాల్ అని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కూడా పౌరులందరికీ చట్టం ముందు సమానత్వం, గౌరవంగా జీవించే హక్కు వంటి అనేక ప్రాథమిక హక్కులను అందించిందని గుర్తుచేశారు.

# కేతన్ విగ్గు ధరించేవాడు..బట్టతల నాకు నచ్చేదికాదు: సియా



**పూణె,జూన్ 26:** మహారాష్ట్రలోని పూనేకు చెందిన కేతన్ అగర్వాల్ హత్య కేసు విచారణలో అనేక ఆసక్తికర విషయాలు బయటపడుతున్నాయి. కేతన్ హత్యకు దారితీసిన పరిస్థితులపై ప్రధాన నిందితురాలు సియా గోయల్ భిన్నమైన సమాధానాలు ఇస్తోంది. తాజాగా పోలీసుల విచారణలో కొన్ని ఆసక్తికర విషయాల్ని తెలిపింది. కేతన్ అగర్వాల్‌ను పెళ్లి చేసుకోవడం తనకు ఇష్టం లేదని, ఇందుకు అతడు విగ్గు ధరించడమే కారణమని సియా తెలిపింది. కేతన్ చూడటానికి అంతగా బాగుండేవాడు కాదని, బట్టతల ఉందని, పైగా తను విగ్గు వాడటం తనకు నచ్చలేదని చెప్పింది. అతడికి జుట్టు బాగా ఊడిపోవడం వల్ల విగ్గు పెట్టుకున్నాడని, తనకు కాబోయే వాడు ఇలా విగ్గు ధరించడం తనకు అస్సలు ఇష్టం లేదని పోలీసులకు చెప్పింది. ఇదే సమయంలో పెళ్లిని ఆపేందుకు తాను ప్రయత్నిస్తుంటే ఇప్పుడు అంత సమయం లేదని, ఇప్పటికే పెళ్లిని ఆపే విషయంలో సమయం మించిపోయిందని కేతన్ తనతో అన్నట్లు సియా తెలిపింది. పెళ్లికి సంబంధించిన ఏర్పాట్లు చాలా దూరం వెళ్లిపోయాయని, దీంతో పెళ్లి ఆపడం సాధ్యం కాదనేలా అతడు చెప్పినట్లు సియా వివరించింది. మరోవైపు కేతన్ విగ్గు అంశంపై కేతన్ తండ్రి మీడియాతో మాట్లాడాడు. తన కొడుకు విగ్గు వాడటం గురించి వారి కుటుంబానికి ముందే చెప్పామన్నాడు. సియాకు ఏమాత్రం అసంతృప్తి, ఇబ్బంది ఉన్నా ఈ పెళ్లి ఆపాలని తాము కూడా భావించినట్లు చెప్పారు. ఇక, ప్రస్తుతానికి సియాకు ఆమె కుటుంబ సభ్యుల నుంచి పెద్దగా సహకారం లభించడం లేదు. ఆమె అరెస్ట్ అయిన తర్వాత నుంచి సియా కుటుంబ సభ్యులు ఎవరూ ఆమెను కలవలేదు. అయితే, సియా గోయల్ ప్రియుడు చేతన్ చౌదరి కుటుంబ సభ్యులు మాత్రం అతడిని తరచూ కలుస్తున్నారని విచారణ అధికారులు తెలిపారు. సియా తప్పు చేసి ఉంటే ఆమెను ఉరితీసినా తమకు ఏ అభ్యంతరం లేదని ఆమె తండ్రి మీడియాతో చెప్పారు. కేతన్ తండ్రి మాట్లాడుతూ సియా చేసిన నేరం రుజువైతే ఆమెను కూడా అలాగే, కొండపైనుంచి తోసి చంపేయాలని కోరాడు. కేతన్ హత్యపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. పిల్లల్లో ఇలాంటి నేర ప్రవృత్తి సంబంధమైన ఆలోచనలకు దూరంగా పెంచాలని ఆయన సూచించారు.



# రూ.320 కోట్లుపన్నులు చెల్లించిన కింగ్ ఛార్లెస్

**లండన్,జూన్ 26:** బ్రిటన్ రాచకుటుంబ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. రాజుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తానుచెల్లించిన వ్యక్తిగత పన్నుల వివరాలను బహిరంగపరచి కింగ్‌చార్లెస్।।। సరికొత్త చరిత్ర సృష్టించారు. ఒక బ్రిటన్‌రాజు తన సొంత పన్ను వివరాలను ఇలాఅధికారికంగా ప్రకటించడం ఇదే తొలిసారి. బకింగ్‌హామ్ ప్యాలెస్ విడుదల చేసిన వార్షిక ఆర్థికనివేదికల ప్రకారం సెప్టెంబర్ 2022లో రాజుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కింగ్ చార్లెస్‌రూ.320కోట్లకుపైగా (30మిలియన్ పౌండ్లు) వ్యక్తిగత పన్నులు చెల్లించారు. 2024-25ఆర్థిక సంవత్సరంలోనే మూలధన లాభాల పన్నుల కింద రూ.140కోట్లుకట్టారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోనే అత్యధిక పన్ను చెల్లించే టాప్100 మంది వ్యక్తులజాబితాలో బ్రిటన్ రాజు నిలిచారు.

# ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ అరెస్టు

● కర్నూలు, తిరుపతి, హైదరాబాద్‌లో 6 చోట్ల ఎసిబి సోదాలు ● నగదు, బంగారం, వెండి, స్థిరాస్తులు, వాహనాలు స్వాధీనం





**కర్నూలు, జూన్ 26 ప్రభాతవార్త:** పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి విధులు నిర్వహించేందుకు సైతం అడ్డదారులు తొక్కాడమే ఆరోపణలపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ మేరకు తనిఖీలు చేసి పాదానికి మించిన ఆస్తులను గుర్తించి సీజ్ చేశారు చివరగా అరెస్టు చేసి ఏసిబి కోర్టులో హాజరు పరచమన్నారు. తిరుపతి కాలుష్య నియంత్రణ మండలిలో సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బేతి యుగంధర్ ముని ప్రసాద్‌ను శుక్రవారం కర్నూలు ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చట్టబద్ధమైన ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారన్న విశ్వసనీయ సమాచారం మేరకు అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ 13(2), 13(1)(బి) కింద కేసు నమోదు నమో చేశారు ఎఫ్ఐఆర్ నమోదు సమయానికి ఆయన ఆదాయాన్ని కన్నా 130 శాతం అధికంగా ఆస్తులు ఉన్నట్లు రికార్డు చేశారు. కాగా విచారణలో అంతకుమించి ఆస్తులు గుర్తించినట్లు ఎస్పి బీడిఎస్పి సోమన్న తెలిపారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం కర్నూలు, తిరుపతి, హైదరాబాద్‌లలోని మొత్తం ఆరు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఆస్తి పత్రాలతో పాటు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో ఆదిత్యనగర్‌లో జి+3 అంతస్తుల భవనం, శిఖర్ ప్రైడ్‌లో డ్యూప్లెక్స్ విల్లా, క్లౌడ్9 అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్, నాలుగు ఇంటి స్థలాలు, రూ.5.78 లక్షల నగదు, సుమారు 172 గ్రాముల బంగారం, 3.3 కిలోల వెండి, పోస్టల్ పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, బ్యాంకు డిపాజిట్లు, ఎల్ఐసీ బాండ్లు, బీమా పాలసీలు కలిపి సుమారు రూ.49 లక్షల విలువైన పెట్టుబడులు గుర్తించారు. అలాగే రూ.8 లక్షల విలువైన బాలెనో కారు, రూ.1 లక్ష విలువైన హోండా యాక్టివా వాహనాన్ని కూడా గుర్తించారు. సోదాల సందర్భంగా ఎస్‌బీఐ బ్యాంకు లాకర్ తాళం చెవి లభించగా, సంబంధిత లాకర్‌ను జూన్ 29న తనిఖీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మరిన్ని సోదాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి కర్నూలులోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. కర్నూలు ఏసీబీ డీఎస్పీగా సోమన్న చార్జి తీసుకున్నప్పటినుంచి ఏసిపి కేసుల వేగం పెరిగింది. గతంలో చాలా తక్కువగా నమోదయ్యే కర్నూలు పరిధిలో డిఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో అధికారులు అవినీతిపరులను వరుసగా పట్టేస్తుండడం ప్రశంసనీయం.

## తిరుపతి కళాకారులకు పుట్టినిల్లు

### 'శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్' నృత్య పోటీలు ఆరంభం



**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి కళాకారులకు పుట్టినిల్లు అని, అంతరించిపోతున్న మన సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాల వారికి అందించాలనే లక్ష్యంతో వ్యయ ప్రయాసలకోర్చి అనేక సంవత్సరాలుగా విజయవంతంగా నడిపిస్తున్న రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కార్యదర్శి కెఎన్ రాజాల పనితీరు అభినందనీయం. శుక్రవారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో మూడురోజులు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జరిగే "శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ జాతీయ నృత్య పోటీలు ప్రారంభమయ్యాయి. టిటిడి సహకారంతో అనేక సాంస్కృతిక ఆధ్యాత్మిక పౌరాణిక ప్రదర్శనలతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారుల అద్భుత నృత్య ప్రదర్శనలతో నగర ప్రజలను, కళాభిమానులను అలరించారు. వేంకటేశ్వరస్వామి పద్మావతి అమ్మ ఆశీస్సులతో చిన్నారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యఅతిథిగా విచ్చేసిన పి.నవీన్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. టిటిడి ధర్మకర్తల మండలి ఇలాంటి ఆధ్యాత్మిక పౌరాణిక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించాలని నవీన్ విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన చిన్నారులు అద్భుతంగా తమ కళా ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి వ్యవస్థాపక కార్యదర్శి కెఎన్ రాజా, చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, గౌరవ కార్యదర్శి కస్పా పద్మనాభం, సభ్యులు డాక్టర్ సోము ఉమాపతి, పురోహితులు సురేష్ స్వామి, బండారి భాస్కర్ రెడ్డి, ఆర్ఎంఎస్ భాస్కర్, సిద్దేంద్ర శర్మ, ఆమూరు సుబ్రహ్మణ్యం, చంద్రబాబు నాయుడు, కన్నప్ప గారి కేశవులు, విగ్రహాల కళ్యాణి, మునేంద్ర రెడ్డి, ఆముదాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో జస్టిస్ వై.లక్ష్మణరావు



**శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రొటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ ఇఓ బి.వెంకటేశు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఆలయంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు, అభివృద్ధికి సంబంధించి ఇఓ బికె వెంకటేశు వివరించారు.

## సినీ నటి రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం సినీనటి కీర్తి సురేష్ కుటుంబ సమేతంగా రాగా ఆమెకు దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, తెలుగుదేశం నాయకుడు డిల్లిబాబులు స్వాగతం పలికారు. నటి ఆలయంలో నిర్వహించే రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా ఆలయ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్ సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపండితులతో ఏర్పాటు చేసారు. పూజల అనంతరం ఆమెకు స్వామి అమ్మవార్ల అంతరా లయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును ఆలయ ఇఓ బికె వెంకటేశు, ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఎపిఆర్ఓ రవిలు పర్యవేక్షించారు.

## వాసవి ఆలయ ద్వితీయ ద్వాదశ కుంభాభిషేకానికి సన్నాహాలు

**శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని శివయ్య సన్నిధికి సమీపంలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ద్వితీయ ద్వాదశ కుంభాభిషేకానికి ఆలయ యువ కమిటి సన్నాహాలు చేస్తున్నారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ ఇందుకుమార్ శర్మ పర్యవేక్షణలో నాలుగురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను రూపకల్పన చేసారు. కుంభాభిషేకానికి ఆలయాన్ని సర్వాంగ సుందర్బంగా తీర్చిదిద్దుతు న్నారు. ఈ నెల 30 నుంచి వచ్చేనెల 2 వరకు కార్యక్రమాలను నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు జూలుగంటి మురళి వివరించారు. 30న సాయంత్రం గణపతి పూజలతో కార్యక్రమాలు ప్రారంభమౌతాయి. జులై 2న దేవి హోమాలు కళహోమం, దేవి ఖడ్గమాల హోమం, నవగ్రహ హోమాలు,ఉపపాలక జలాధి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించబడుతుందన్నారు. సాయంత్రం ఆడపడచులకు వడిబాల, అలాగే రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు వివరించారు.

## దుర్గమ్మ దర్శనానికి భక్తజనం



**ఇంద్రకీలాద్రి, జూన్ 26 ప్రభాతవార్త:** శుక్రవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. అంతరాలయ దర్శనం నిలిపివేభక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో అందరికీ త్వరితగతిన దర్శనం కల్పించేందుకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు అంతరాలయ దర్శనంతో పాటు వి.ఐ.పి దర్శనాలను పూర్తిగా నిలిపేసి సర్వదర్శనం లైన్ల ద్వారానే భక్తులను అనుమతించారు. భక్తులకు విస్తృత సదుపాయాలుఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో ఉన్న భక్తుల కోసం మొబైల్ టిన్ల ద్వారా చల్లని తాగునీటిని నిరంతరాయంగా పంపిణీ చేశారు. అలాగే ఆలయానికి వచ్చిన భక్తులందరికీ సరిపడా ఉచిత ప్రసాదం, నిత్యాన్నదాన వితరణను విస్తృతంగా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,01,116ల విరాళాన్ని శుక్రవారం విజయవాడకు చెందిన నంబూరు కుటుంబరావు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషశస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## జైలు నుంచి రియాజ్ విడుదల... మళ్లీ అరెస్ట్

**కడప (కార్పొరేషన్), జూన్ 26 ప్రభాతవార్త:** అల్మాస్ పేట ఘటనలో రియాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం కడప కేంద్ర కారాగారం నుంచి రియాజ్ ను బెయిల్ పై విడుదల చేశారు. అయితే విడుదల అయిన మరుక్షణమే టూ టౌన్ పోలీసులు మళ్లీ అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర కారాగారం వద్ద భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. జైలు నుండి బయటకు రాగానే రియాజ్‌ను బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారని రియాజ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

అల్మాస్ పేట ఘటనకు సంబంధం లేకపోయినా గతంలో గంజాయి కేసులో అరెస్ట్ చేశారని రియాజ్ కుటుంబం కుటుంబం ఆరోపించింది. సిసిటివి ఫుటేజ్ ఆధారాలతో రియాజ్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం.

కొడుకుపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, రెండు నెలలుగా జైల్లో ఉంచారన్న రియాజ్ తల్లి వాపోయింది.

## మంత్రి ఇల్లు ముట్టడించిన ఔట్‌సోర్సింగ్ టీచర్లు



**పార్వతీపురం మన్యం జిల్లా(సాలూరు), జూన్ 26 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా మంత్రి సంధ్యారాణి ఇల్లు ముట్టడి చేసిన ఔట్ సోర్సింగ్ టీచర్ రాష్ట్రంలో ఔట్ సోర్స్ టీచింగ్ వ్యవస్థ ఏ విద్యాసంస్థలో లేదని కేవలం ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో మాత్రమే ఈ వ్యవస్థ ఉందని అలాగే 15 సంవత్సరాల నుండి ఇందులో విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని రెగ్యులర్ చేయాలని శుక్రవారం మంత్రి సంధ్యారాణి ఇంటి ముందు బైఠాయించి గురుకుల ఔట్‌సోర్సింగ్ టీచర్స్ పెద్దఎత్తున ధర్నా చేసి నిరసన చేపట్టారు. అలాగే మంత్రి సంధ్యారాణికి వ్యతిరేకంగా మా సమస్యలు పరిష్కరించారని ప్రాణాలైనా విడుస్తాం ఉద్యోగాలను సాధిస్తాం అని నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో టౌన్ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అనిల్ కుమార్ సిబ్బంది రంగంలోకి దిగి టీచర్లను నిలువరించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయినప్పటికీ మా సమస్యలు పరిష్కరించకుంటే మరింత ఆందోళన చేపడుతామని గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయలు తెలియజేశారు.

## పసిమొగ్గపై పైశాచికం

### నాలుగేళ్ల బాలికను నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య
### 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
### పక్కింటి మహిళే స్వాతినే నిందితురాలిగా గుర్తింపు
### న్యాయం కోసం రోడ్డెక్కిన బాధిత కుటుంబం
### కఠినంగా శిక్షించాలని బాధితుల డిమాండ్



**పులివెందుల, జూన్ 26 ప్రభాతవార్త:** పసిమొగ్గలాంటి నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలను పొట్టన పెట్టుకున్న హృదయ విదారక ఘటన పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం లో చోటుచేసుకుంది. లోపట్నూతల గ్రామంలో నాలుగేళ్ల బాలిక నిత్వికను నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య చేసిన ఘటన గ్రామాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటన జరిగిన 24 గంటలు కూడా పూర్తికాకముందే పోలీసులు కేసును ఛేదించి నిందితురాలిని గుర్తించారు.


గ్రామానికి చెందిన సృజన శ్రీ, రామాచారి దంపతుల కుమార్తె నిత్విక (4) గురువారం అనుమానాస్పద స్థితిలో నీళ్ల డ్రమ్‌లో మృతి చెంది కనిపించింది. చిన్నారి మృతిపై తల్లిదండ్రులు, గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

**రాత్రివేళ రోడ్డుపై ధర్నా:** చిన్నారిని హత్య చేసి నీటిలో పడవేశారని ఆరోపిస్తూ గురువారం రాత్రి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు పులివెందుల-పార్నపల్లె రింగ్ రోడ్డుపై ధర్నాకు దిగారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ మురళి నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కేసును త్వరితగతిన ఛేదించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

**పోలీసుల దర్యాప్తులో కీలక ఆధారాలు:** లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా పక్కింట్లో నివసించే స్వాతిపై అనుమానం బలపడిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆమెపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పులివెందులలో నిరసనలు: శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు పులివెందుల రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద, పూలంగల సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. చిన్నారి విషయంలో జరిగిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితురాలికి కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు. కుటుంబాల మధ్య ఉన్న వివాదాలకు చిన్నారిని బలి చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుదిరాలికి పోలీస్ శాఖలోనే ఉన్నతాధికారి బంధువు ఉన్నారని కేసు నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం నిరసన చేశారు డీఎస్పీ మురళి నాయక్ బాధితులను కలిసి మాట్లాడు తూ నిందితురాలు వెనుక ఎవరున్నా చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం, సీసీ కెమెరాల ఆధారాలతో దర్యాప్తు ముందుకు సాగిందని తెలిపారు. పులివెందుల డీఎస్పీ కార్యాలయం లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ మురళి నాయక్ మాట్లాడుతూ చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం కోసం చిన్నారి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. నీటి నమూనాలు, ఇతర ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి నిత్విక మృతితో లోపట్నూతల గ్రామం విషాదంలో మునిగిపోయింది. వేగంగా స్పందించి కేసును ఛేదించిన పోలీసులపై గ్రామస్థులు విశ్వాసం వ్యక్తం చేస్తూ.. నిందితురాలికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడాలని కోరుతున్నారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి



**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రంగా మారిందని, నీట్ పరీక్షల నిర్వహణతో కేంద్ర ప్రభుత్వ అసమర్థత బట్టబయలైందని తక్షణం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు బాలగురవం బాబు, తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు శుక్రవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. నీట్ పరీక్షల నిర్వహణను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి అప్పగించి ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతోనే దేశంలో లక్షలాదిమంది యువత భవిష్యత్తు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేసిందని అన్నారు. వారి జీవితాలను అంధకారంలోకి నెట్టేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ప్రశ్నించే గొంతుకులను ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీపై బిజెపి ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులతో అరికట్టే చర్యలకు పాల్పడుతోంన్నారు. యువతకు, విద్యార్థులకు లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు మాట్లాడుతూ నీట్ పరీక్షల ప్రశ్నా పత్రాలు లీకేజీ భారత విద్యా వ్యవస్థలో లోపాలను బయట పెట్టిందని చెప్పారు. నీట్ పరీక్షల కోసం విద్యార్థుల కుటుంబాలు పెడుతున్న ఖర్చు కేంద్ర ప్రభుత్వం విద్యా బడ్జెట్ తో సమానంగా ఉందని తెలిపారు. కోచింగ్ సెంటర్ల ఫీజులు, స్టడీ మెటీరియల్స్ కోసం ఇప్పటికే లక్షలాది రూపాయలు వెచ్చించిన తల్లిదండ్రులపై పునఃపరీక్షల వల్ల అదనపు ప్రయాణ ఖర్చులు, వసతి ఖర్చుల భారం పడిందని వివరించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రిని తక్షణం బర్తరఫ్ చేయాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఎన్ఎస్‌యుఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, కాంగ్రెసు పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ తలప దామోదర్ రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బల్ల హరిబాబు, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ వెంకటాచలపతి, పంట శ్రీనివాసులు రెడ్డి, ఐరాల లోకేష్ రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్టి విభాగం అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం అంటేనే త్యాగం: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** మొహర్రం పర్వదినం నేడు. ఈ నేపథ్యంలో ముస్లిం సోదరులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మొహర్రం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మొహర్రం అంటేనే త్యాగం అని సిఎం చంద్రబాబు అన్నారు. సత్య మార్గంలో నడవాలనే స్ఫూర్తిని మొహర్రం అందిస్తుందని అన్నారు. సత్యం, న్యాయం కోసం ఇమామ్ హుస్సేన్ పోరాడారని, ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని మొహర్రం సందర్భంగా స్మరించుకుందామని అన్నారు. మొహర్రం అందరికీ శాంతిని తీసుకురావాలి అన్నారు.

### శాంతి, సామరస్యాల ప్రతీకగా మొహర్రం: లోకేశ్

శాంతి, సామరస్యాల ప్రతీకగా మొహర్రం జరగాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. హజ్రత్ హుస్సేన్ త్యాగం స్మరించుకునే సందర్భం మొహర్రం జరుపుకొంటారని అన్నారు. ధర్మ పరిరక్షణకు పాటుపడటమే మొహర్రం ఇచ్చే సందేశం అని అన్నారు. మానవత్వానికి ప్రతీక హజ్రత్ హుసేన్స్ అన్నారు.

## గోవా గవర్నర్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యామంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. అశోక్ గజపతి రాజును విలువల శిఖరం మనసున్న మహారాజు అంటూ లోకేశ్ కొనియాడారు. "ప్రజాస్వామ్యంలో నిలువెత్తు మానవత్వ రాజసం అశోక్ గజపతిరాజు. విద్యాలయాలకు వేల ఎకరాలు దానమిచ్చిన వితరణశీలి, ఆధ్యాత్మిక సేవకు ఆస్తులు ధారపోసిన ధర్మకర్త, రాజకీయాలలో అందరి మన్ననలు అందుకున్న అజాతశత్రువ్వు అని లోకేశ్ తన పోస్టులో ప్రశంసించారు. ప్రజల మనిషిగా వారి హృదయాల్లో స్థానం సంపాదించు కున్నారని పేర్కొన్నారు. అశోక్ గజపతిరాజు ఆయురారోగ్యాలతో, ఆనందంగా వందేళ్లు వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తన శుభాకాంక్షల సందేశంలో తెలిపారు.

## డ్రగ్స్ మాఫియాపై డేగ కన్ను: ఈగిల్ ఐజి

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త:** యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మాఫియాపై నిఘాను తీవ్రతరం చేసి నేరాలను అరికడుతున్నట్లు ఎ.పి. ఈగిల్ ఛీఫ్ ఐజి రవికృష్ణ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రివద్ద రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఈగల్ ఏపీ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, వాకథాన్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈగల్ ఏపీ ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 వేలకుపైగా ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ చైతన్య ద్వారా రాష్ట్రంలో "జీరో గంజాయి సాగు లక్ష్యాన్ని సాధించామని పేర్కొన్నారు. తమ ప్రాంతాల్లో గంజాయి లేదా మాదకద్రవ్యాల కార్యకలాపాలు గుర్తిస్తే ప్రజలు 1972 ఈగల్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. డ్రోన్ నిఘా ద్వారా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో మంచి ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం "ఈగల్ ఏపీ" ద్వారా మాదక ద్రవ్యాల సరఫరా, రవాణా, విక్రయాలపై డేగ కళ్లతో నిఘా ఉంచుతూ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాడిని చేరుకునేందుకు దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, ప్రజల్లో అవగాహన పెంపొం దించేందుకు విస్తృత కార్యక్రమాలు

## కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీతకి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సన్మానం



**అనంతపురం, జూన్ 26 ప్రభాత వార్త బ్యూరో:** కేంద్ర ప్రభుత్వ పురస్కారం అందుకున్న అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రముఖ సిపిఐ నాయకులు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డిని ఢిల్లీలోని ఇంద్రజిత్ గుప్త మార్గ్లో ఉన్న అజయ్ భవన్లో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. 92 ఏళ్ల వయస్సులో కూడా సూర్యనారాయణ రెడ్డి ఎంతో చురుకుగా ఉండటం ఆనందదాయకమని అన్నారు. సిపిఐ పార్టీకి ఎనలేని సేవలు అందించడంతో పాటు సమాజ సేవలో నిరంతరం పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అందించిన పురస్కారం ఆయన జీవితకాల సేవలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కె. రామకృష్ణ, అఖిల భారత స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాశ్, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్, ఢిల్లీ సామాజిక కార్యకర్త గురుదేవ్ తదితరులు పాల్గొని ఎద్దుల సూర్యనారాయణ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## తండ్రి కట్టిన ఇల్లు.. కూల్చడం ఇష్టం లేక జాకీలతో పైకి!

### జంగారెడ్డిగూడెంలో అరుదైన దృశ్యం



**జంగారెడ్డిగూడెం, జూన్ 26 ప్రభాతవార్త:** తండ్రి జ్ఞాపకంగా నిలిచిన ఇంటిని కూల్చివేయడం ఇష్టం లేక, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఓ వ్యక్తి భవనాన్ని ఏకంగా ఐదు అడుగుల మేర పైకి లేపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన ధూబగంట్ల వెంకటేశ్వరరావుకు చెందిన ఇల్లు పరిసరాల్లోకి నీరు చేరుతుండటంతో ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. తన తండ్రి సత్యనారాయణ నిర్మించిన ఈ ఇంటిని పడగొట్టి మళ్లీ నిర్మించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు రూ.2 నుండి 3 కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు తండ్రి కట్టిన ఇల్లు కావడంతో దానిని కూల్చడానికి మనసొప్పని వెంకటేశ్వరరావు.. జాకీల సాయంతో భవనాన్ని పైకి లేపేందుకు గత కొన్ని సంవత్సరాలుగా నమ్మకమైన సంస్థ కోసం అన్వేషించారు. ఈ క్రమంలో విజయవాడకు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనుల కోసం సదరు సంస్థ 40 మంది కార్మికులతో, దాదాపు 600 జాకీలను ఏర్పాటు చేసి భవనాన్ని సురక్షితంగా పైకి లేపే ప్రక్రియను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయి. కూల్చివేత లేకుండా, భారీ ఖర్చు ఆదా అవుతూ ఇల్లు పైకి లేస్తున్న ఈ అద్భుత ప్రక్రియను స్థానికులు ఆసక్తిగా తరలివచ్చి తిలకిస్తున్నారు.



### రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన

# స్పీకర్ అయ్యన్న కుటుంబం

**విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :**

రాజ్యసభ సభ్యుడిగా చింతకాయల విజయ్ ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిన్న వయసులోనే రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన చింతకాయల విజయ్‌కు రాధాకృష్ణన్ అభినందనలు తెలియజేసి, ప్రజా సేవలో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన కుటుంబ సభ్యులతో కలిసి రాజ్యసభ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరస్పర ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఈ భేటీలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేష్ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

### జిల్లావ్యాప్తంగా విజయవంతంగా సాగిన ఓటర్ల జాబితా

# సమగ్ర సవరణ ప్రత్యేక డ్రైవ్

**80.94 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి**

**ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్**



**విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :**

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ-2026 కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిర్వ హించిన ప్రత్యేక డ్రైవ్ విజయవంతంగా సాగింది. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటిం టికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణతో పాటు అందిన ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా కొనసాగించారు. జిల్లా లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 20,23,009 మంది ఓటర్లకు పంపిణీ చేయా ల్సిన ఎన్యూమరేషన్ ఫారాల్లో 16,37,424 ఫారాలు పంపిణీ చేయడం ద్వారా 80.94 శాతం పురోగతి నమోదైంది. అలాగే 75,427 ఫారాలు డిజిటైజ్ అయ్యి 3.73 శాతం పురోగతి నమోదైంది.

ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తూర్పు నియోజకవర్గంలోని లాసన్స్ బే కాలనీలో గల 132వ పోలింగ్ స్టేషన్‌తో పాటు పెదగంట్యాడ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పెదగంట్యాడ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి జరుగుతున్న పనులను సమీక్షించారు. అదేవిధంగా పెందుర్తి నియోజకవర్గం వేపగుంట, గాజువాక మండలం అక్కిరెడ్డిపాలెం, మధురవాడ జోన్ ఆదివివరం జంక్షన్, విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని బుక్కవీధి, ఆనందపురం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు సందర్శించి బీఎల్‌వోలతో సమావేశాలు నిర్వహించారు. ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

**మొదటి స్థానంలో దక్షిణ నియోజకవర్గం...**

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ఎన్యూమరేషన్ ఫారాల

### సుస్థిర అభివృద్ధికి

# సమగ్ర దృక్పథమే మార్గం




**విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్**

- గ్రీన్ లాజిస్టిక్స్, స్వచ్ఛ ఇంధనాలు, శాస్త్రీయ పట్టణ ప్రణాళికపై దృష్టి పెట్టాలి
- సీఐఐ ఆంధ్రప్రదేశ్ సస్టైనబిలిటీ సమ్మిట్--2026లో పిలుపు

**విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి, ప్రజల భాగస్వామ్యంతో కూడిన సమగ్ర దృక్పథాన్ని అవలంబించినప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ పేర్కొన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విశాఖలోని నోవోటెల్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సీఐఐ ఆంధ్రప్రదేశ్ సస్టైనబిలిటీ సమ్మిట్--2026లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సుస్థిరత అంటే కేవలం వాతావరణ మార్పులను ఎదుర్కోవడమే కాదని, ఆహార భద్రత, నేల సారవంతం, నీటి సంరక్షణ, శాస్త్రీయ పట్టణ ప్రణాళిక, బాధ్యతాయుత పారిశ్రామిక



అభివృద్ధి వంటి అంశాలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార కల్తీని అరికట్టేందుకు కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థలు, వ్యవసాయంలో స్థిరమైన విధానాలు, నీటి పునర్వినియోగం, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ వంటి నగరాల్లో శాస్త్రీయ పట్టణ ప్రణాళిక, గాలి నాణ్యత పరిరక్షణ, వ్యర్థాల వేర్వేరు సేకరణ, పారిశ్రామిక కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పోర్టులు, పారిశ్రామిక ప్రాంతాల పరిసరాల్లో కాలుష్యాన్ని తగ్గిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సముద్రతీరం, పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు రాష్ట్రాన్ని దేశంలో ప్రముఖ తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా తీర్చిదిద్దే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని శ్రీభరత్ పేర్కొన్నారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ పోర్టుల అభివృద్ధితో పాటు గ్రీన్ లాజిస్టిక్స్, స్వచ్ఛ సముద్ర ఇంధనాలు, సమీకృత రైల్వే అనుసంధానం రాష్ట్రాభివృద్ధికి కీలకమని చెప్పారు. పరిశ్రమలు పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలపై మరింత పెట్టుబడులు పెట్టాలని, ప్రభుత్వ వ్యవస్థల్లో సమన్వయం పెంపొందించాలని పిలుపునిచ్చారు.

సీఐఐ విశాఖ చైర్మన్ జి. కృష్ణమోహన్ మాట్లాడుతూ పరిశ్రమలు పర్యావరణ, సామాజిక బాధ్యతలను వ్యాపార వ్యూహాల్లో భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి. సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని సముద్ర, లాజిస్టిక్స్ వనరులు సుస్థిర పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని తెలిపారు.

గ్రీన్‌కో గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పరవస్తు రాంబాబు మాట్లాడుతూ పునరుత్పాదక విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, డిజిటల్ టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక వ్యవస్థలే భవిష్యత్తు అభివృద్ధికి (తరువాయి 8వ పేజీలో)

# సిద్ధాంత రాజకీయాలకు చిరునామా పీ.వి. చలపతిరావు

**ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్**

**92వ జయంతి వేడుకలు ఘనంగా...**

**ఆకట్టుకున్న 'వీర సావర్కర్' చారిత్రక నాటకం**

**విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు, దివంగత పీ.వి. చలపతిరావు 92వ జయంతి సందర్భంగా నిర్వహించిన నాలుగో స్మారక ఉపన్యాస కార్యక్రమం శుక్రవారం విశాఖపట్నంలోని సాగరమాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డా. బొమ్మరాజు సారంగిపాణి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మేధావులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీయన్ మాధవ్ మాట్లాడుతూ, "నా తండ్రి పీ.వి. చలపతిరావే నాకు స్ఫూర్తి" అని



పేర్కొన్నారు. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో ఆయనపై అరెస్టు వారెంట్ జారీ అయినప్పటికీ, పార్టీ ఆదేశాల మేరకు 19 నెలల పాటు అజ్ఞాతంలో ఉంటూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడారని గుర్తు చేశారు. వీర సావర్కర్ జాతీయవాద స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని చలపతిరావు ప్రజా జీవితాన్ని కొనసాగించారని తెలిపారు. మాజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, (తరువాయి 8వ పేజీలో)

### కర్బలా వీరుల స్మరణలో..

# భక్తిశ్రద్ధలతో మొహర్రం

**విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త:**

కర్బలా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ మొహర్రం సందర్భంగా విశాఖలోని చెంగలరావుపేట హుసైని మస్జిద్‌లో శుక్రవారం షియా ముస్లింలు భక్తిశ్రద్ధలతో మాతం (రక్తం చిందించడం) నిర్వహించారు. హజ్రత్ ఇమామ్ హుసేన్, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరుల అమరత్వాన్ని స్మరిస్తూ సంప్రదాయబద్ధంగా సంతాపాన్ని వ్యక్తం చేశారు.

అనంతరం చెంగలరావుపేట హుసైని మస్జిద్ నుంచి ప్రారంభమైన జులూస్ (ఊరేగింపు) ఏవీఎన్ కళాశాల ప్రధాన రహదారి, టౌన్ కొత్తరోడ్డు మీదుగా సాగి తిరిగి హుసైని మస్జిద్ వద్ద ముగిసింది. ఊరేగింపులో పెద్ద సంఖ్యలో షియా ముస్లింలు పాల్గొని కర్బలా అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన మౌలానా సయ్యద్ షబీ హైదర్ కాజిమి మాట్లాడుతూ, మొహర్రం అనేది పండుగ కాదని,



సత్యం, న్యాయం, ధర్మం కోసం ప్రాణత్యాగం చేసిన హజ్రత్ ఇమామ్ హుసేన్, ఆయన పరివార సభ్యుల త్యాగాలను స్మరించుకునే సంతాప దినమని పేర్కొన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొహర్రం నెల పదవ తేదీన ఇరాక్‌లోని కర్బలా ప్రాంతంలో అప్పటి పాలకుడు యజీద్ బిన్ మువావియా సేనలు హజ్రత్ ఇమామ్ హుసేన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, 71 మంది అనుచరులను మూడు రోజుల పాటు ఆహారం, తాగునీరు లేకుండా నిర్బంధించి అత్యంత క్రూరంగా హత్య చేశారని (తరువాయి 8వ పేజీలో)

### విశాఖ ట్రాఫిక్‌కు

# బ్రేక్ ఎప్పుడు...?



**రోడ్లపై రద్దీ.. ట్రాఫిక్ నియంత్రణపై పెరుగుతున్న ఆందోళన**

**ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టే చర్యలు ఎప్పుడు?**

**(ప్రభాతవార్త-విశాఖపట్నం)**

వేగంగా విస్తరిస్తున్న విశాఖ నగరంలో ట్రాఫిక్ నియంత్రణ రోజురోజుకూ సవాలుగా మారుతోంది. ప్రధాన కూడళ్లు, వాణిజ్య ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రుల పరిసరాల్లో వాహనాల రద్దీ పెరగడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కార్యాలయ వేళలు, పాఠశాలలు ప్రారంభం, ముగింపు సమయాల్లో ట్రాఫిక్ స్తంభించడం సాధారణంగా మారింది. జగదాంబ జంక్షన్, ద్వారకానగర్, మద్దిలపాలెం, సీతమ్మధార, అక్కయ్యపాలెం, కంచరపాలెం, గాజువాక, మధురవాడ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వాహనాల రద్దీతో ప్రయాణికులు ఎక్కువ సమయం ట్రాఫిక్‌లోనే గడపాల్సి వస్తోంది. కొన్ని చోట్ల రహదారులపై అక్రమ పార్కింగ్, వ్యాపార సంస్థల ఆక్రమణలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలిగిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

నగరంలో అందుబాటులో ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ వంటి సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం కూడా ట్రాఫిక్ సమస్యకు ఒక కారణంగా మారిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రహదారులపై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో అత్యవసర సేవల వాహనాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటోంది. ట్రాఫిక్ నియంత్రణ కోసం జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. డ్రోన్ సర్వేలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ ద్వారా ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్రమ పార్కింగ్, రహదారి ఆక్రమణలపై ఒకేసారి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నిర్వహణను మరింత క్రమబద్ధీకరించడం, రహదారులపై స్పష్టమైన పార్కింగ్ గుర్తులు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, నిబంధనలను కఠినంగా అమలు చేయడం ద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్యను గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని ప్రజలు సూచిస్తున్నారు. స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ట్రాఫిక్ నిర్వహణ కూడా అదే స్థాయిలో ఆధునికంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని నగరవాసులు కోరుతున్నారు.

### మాదకద్రవ్యాలపై

# ముక్తకంఠంతో పోరాటం



**విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వాడకం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా దిశ ఐడీయూ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, క్షయ వ్యాధుల అధికారి, దిశ ఐడీయూ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రోణంకి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈఎన్‌టీ ఆసుపత్రి ఆవరణలోని మాదకద్రవ్యాల వ్యసన విముక్తి కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలమాంబ ఆలయం మీదుగా ప్రభుత్వ మానసిక ఆసుపత్రి వరకు సాగింది. ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి. రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, మాదకద్రవ్యాల వ్యసనం నుంచి బయటపడేందుకు ఓపియాయిడ్ ప్రత్యామ్నాయ చికిత్స కేంద్రాల ద్వారా అందిస్తున్న (తరువాయి 8వ పేజీలో)

### ప్రతి బూత్ కమిటీ

# క్రియాశీలంగా పనిచేయాలి

**ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**



**విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :**

నియోజకవర్గంలోని 361 బూత్ కమిటీలు క్రియాశీలంగా పనిచేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సమాచారాన్ని సకాలంలో అప్ లోడ్ చేయని 280 కమిటీలు నిస్తేజంగా ఉన్నట్టే భావించాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ ఆఫీస్ లో శుక్రవారం పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 81 బూత్ కమిటీలు మాత్రమే చురుకుగా పనిచేస్తున్నాయని పేర్కొంటూ రాబోయే రోజుల్లో ప్రతి బూత్ కమిటీ చైతన్యం కావాలన్నారు. ప్రతి శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ముఖ్య నాయకులతో పార్టీ సమావేశం విధిగా నిర్వహిస్తామని వెల్లడించారు. 12 క్లస్టర్ల నుంచి కన్వీనర్లు, కో కన్వీనర్లు వరుసగా మూడు సమావేశాలకు హాజరుకాని పక్షంలో అనర్హులవుతారని హెచ్చరించారు.

**జాబ్ మేళాతో యువతకు మేలు**

జాబ్ మేళాలతో యువతకు ఎంతో మేలు జరుగుతుందని గంటా పేర్కొన్నారు. ఈనెల 30న పీఎం పాలెం సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే భీమిలి మెగా జాబ్ మేళా - 2026 లో వివిధ రంగాలకు (తరువాయి 8వ పేజీలో)

## సుస్థిర అభివృద్ధికి సమగ్ర దృక్పథమే మార్గం

(7వ పేజీ తరువాయి)

దిశానిర్దేశం చేస్తాయని చెప్పారు. గ్రీన్ పోర్టులు, గ్రీన్ లాజిస్టిక్స్, శక్తి నిల్వ వ్యవస్థలు, పరిశుభ్రమైన ఇంధన వినియోగం ద్వారా కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. సదస్సులో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ డేటా సెంటర్లు, గ్రీన్ లాజిస్టిక్స్, సుస్థిర ఆవిష్కరణలు వంటి అంశాలపై నాలుగు సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, పౌర సమాజం సమిష్టిగా కృషి చేస్తే ఆంధ్రప్రదేశ్‌ను సుస్థిర, హరిత, తక్కువ కార్బన్ ఉద్గారాల రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చని సదస్సులో నిపుణులు అభిప్రాయపడ్డారు.

## సిద్ధాంత రాజకీయాలకు చిరునామా పీ.వి. చలపతిరావు

(7వ పేజీ తరువాయి)

వీర సావర్కర్ వంటి మహనీయుల స్ఫూర్తితోనే పీ.వి. చలపతిరావు ప్రజా జీవితంలో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ వీర సావర్కర్ దేశభక్తి, త్యాగనిరతి, జాతీయవాద భావజాలాన్ని వివరించారు. డా. బొమ్మరాజు సారంగిపాణి మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో చలపతిరావుతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. వక్తలు మాట్లాడుతూ విద్యా, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో పీ.వి. చలపతిరావు అందించిన సేవలను స్మరించుకున్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవ చేసిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా సంస్కార భారతి సమర్పణలో డా. పీవీయన్ కృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించిన "వీర సావర్కర్" చారిత్రక నాటకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాత్రధారుల అభినయం, సంభాషణలు, రంగస్థల ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని హర్షధ్వానాలు అందుకుంది. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సత్యకుమార్ మాస్టారు, సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ కృష్ణ, పరశురాం రాజు, ద్వారంపూడి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సవరణ ప్రత్యేక డ్రైవ్

(7వ పేజీ తరువాయి)

పంపిణీలో విశాఖ దక్షిణ 86.12 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, పెందుర్తి 84.90 శాతం, భీమిలి 81.14 శాతం, గాజువాక 79.74 శాతం, విశాఖ ఉత్తరం 79.60 శాతం, విశాఖ తూర్పు 78.74 శాతం, విశాఖ పడమర 76.19 శాతం పురోగతి సాధించాయి. డిజిటైజేషన్‌లో విశాఖ ఉత్తరం 5.90 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, విశాఖ పడమర 3.85 శాతం, గాజువాక 3.75 శాతం, పెందుర్తి 3.74 శాతం, విశాఖ దక్షిణ 3.22 శాతం, విశాఖ తూర్పు 2.94 శాతం, భీమిలి 2.89 శాతం పురోగతి నమోదు చేశాయి.

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించగా, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియ కూడా సమాంతరంగా కొనసాగుతోంది. ప్రత్యేక డ్రైవ్ ద్వారా మిగిలిన ఫారాల పంపిణీ, డిజిటైజేషన్ పనులను మరింత వేగవంతం చేసి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేసే దిశగా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

## మాదకద్రవ్యాలపై ముక్తకంఠంతో పోరాటం

(7వ పేజీ తరువాయి)

వైద్య సేవలు, చికిత్స విధానాల ప్రాముఖ్యతను వివరించారు. వ్యసనానికి గురైన వారు సంకోచించకుండా చికిత్స పొందాలని సూచించారు. జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, క్షయ వ్యాధుల అధికారి డాక్టర్ రోణంకి రమేష్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం యువత మానసిక, శారీరక, సామాజిక, ఆర్థిక జీవితాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు. వ్యసనం కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవడంతో పాటు సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. ఏఆర్టీ వైద్య అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వాడకం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అవగాహన పెంపొందించడం ద్వారానే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించి, వ్యసన రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు.

## జనతా వారధి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి లిబీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్



విశాఖపట్నం జూన్ 26 ప్రభాత వార్త :

విశాఖపట్నంలో శుక్రవారం నిర్వహించిన "జనతా వారధి" రాష్ట్ర సమన్వయ కమిటీ సమీక్షా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనతా వారధి కార్యక్రమం ద్వారా పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై సమగ్ర సమాచారాన్ని ప్రతి ఇంటికీ చేరవేయాలని సూచించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు.

పార్టీ కార్యక్రమాలను గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా జనతా వారధి కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా, ప్రభావవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించి, పలు కీలక సూచనలు చేశారు.

ప్రజాసేవే లక్ష్యంగా, ప్రజలకు పార్టీకి మధ్య బలమైన వారధిగా జనతా వారధి కార్యక్రమాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

# ప్రతి బూత్ కమిటీ క్రియాశీలంగా పనిచేయాలి

(7వ పేజీ తరువాయి)

చెందిన 70కి పైగా పేరొందిన కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. ఉద్యోగ అవకాశం కల్పిస్తున్న విషయం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ప్రస్తుతానికి నమోదు చేసుకున్న 1,500 యువత సంఖ్య జాబ్ మేళా నాటికి 5 వేలకు పైగా చేరుకుంటుందని చెప్పారు. జాబ్ మేళా విజయవంతం కావడానికి సచివాలయాల్లో పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నామన్నారు.

**ఎస్.ఐ.ఆర్. ను సవాల్ గా తీసుకోవాలి**

ప్రత్యేక సమగ్ర సవరణ2 (ఎస్.ఐ.ఆర్.) ను కార్యకర్తలు సవాల్ గా తీసుకోవాలని.. అర్హత గల ఒక్క ఓటు పోవడానికి వీల్లేదని, అదే సమయంలో బోగస్ ఓట్లు ఉండకూడదని ఎమ్మెల్యే గంటా స్పష్టం చేశారు. తమిళనాడులో ఒక్క ఓటు ఎమ్మెల్యే భవితవ్యం మార్చిన విషయం గుర్తుంచుకోవాలని తెలియజేశారు. దొంగ ఓట్లను కాపాడుకోవడానికి వైసీపీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బూత్ లెవెల్ ఏజెంట్లు (బి.ఎల్.ఎ.) ఇంకా 280 బూత్ లలో క్రియాశీలకం కాలేదన్నారు. రాబోయే ప్రతి ఎన్నికల్లోనూ ప్రత్యేక సమగ్ర సవరణ కీలకం కానుందని, దీనిపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టిని ఉంచాలని సూచించారు.

బి.ఎల్.ఓ.లు వచ్చేసరికి, కూలీ చేసుకునే వారు పనుల్లోకి వెళ్లిపోతున్నారని సాయంత్రం ఇళ్లకు చేరుకునే సమయానికి బి.ఎల్.ఓ.లు విధులు ముగించుకుని వెళ్ళిపోతున్నారని కొందరు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, సరగడ అప్పారావు, కసిరెడ్డి దామోదరరావు, మొల్లి లక్ష్మణరావు, కోరాడ రమణ, కాళ్ల నగేష్ కుమార్, మన్యాల సోంబాబు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా నూకరాజు, లొడగల అప్పారావు, నాగోతి సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, గరే గుర్నాథ్, పంచదార్ల శ్రీనివాస్, మామిడి దుర్గారావు, రామరాజు, లొడగల జానకిరామ్, మజ్జి నందీష్, దండి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ బాబ్జి శ్యామ్ కుమార్

**ఉపాధ్యక్షురాలు, ఉత్తరాంధ్రా ప్రతినిధిగా కెజీహెచ్ అనస్తిషియా ప్రొఫెసర్ డాక్టర్ కోడూరి అపరంజి ఎన్నిక**

**ఏకగ్రీవంగా ఇతర కార్యవర్గం ఎంపిక**





విశాఖపట్నం, జూన్ 26, ప్రభాత వార్త :

గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో లోగురువారం ప్రభుత్వ వైద్యుల సంఘం ( గ్డాప్ ) రాష్ట్ర స్థాయి ఎన్నికలు జరిగినట్టు ఆ సంఘం నూతన అధ్యక్షుడుగా ఏన్నికైన సిద్ధార్థ వైద్య కళాశాల న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఇంజేటి.బాబ్జీ శ్యామ్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా , గుంటూరు వైద్య కళాశాలలో ఇఎన్టీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. స్వరూప్ కాంత్,కోశాది కారి గా మంగళగిరి లో జాతీయ అంధత్వనివారణాధికారి డాక్టర్ బుక్కే సునీల్ కుమార్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. అదేవిదంగా

ఉపాధ్యక్షులుగా ఉత్తరాంధ్ర ప్రతినిధి గా ఆంధ్ర వైద్య కళాశాల లో అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ కోడూరి. అపరంజి, రాయలసీమ ప్రతినిధి గా కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సిరుపాసునీల్ కుమార్ రెడ్డి, సెంట్రల్ ఆంధ్ర ప్రతినిధి గా గుంటూరు వైద్య కళాశాలలో పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ బొడ్డు.దేవ కుమార్, సెకండరీ హెల్త్ ప్రతినిధి గా పామర్రు ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ తోట నీలిమ, ప్రైమరీ హెల్త్ ప్రతినిధి గా పల్నాడు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ . గుడిసె చంద్ర శేఖర్ లు ఏకగ్రీవం గా ఎన్నికయ్యారన్నారు.నాన్ క్లినికల్ కార్యదర్శిగా కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎస్పీఎం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతకుంట వెంకట సుబ్బరాయుడు,

ఉత్తరాంధ్ర ప్రైమరీ హెల్త్ కార్యదర్శిగా డాక్టర్ చిరువోలు శ్రీధర్, సెంట్రల్ ఆంధ్ర మెడికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శిగా గుంటూరు వైద్య కళాశాలలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ అనంతుల అజయ్ , డెంటల్ కార్యదర్శిగా కడప ప్రభుత్వ డెంటల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జనపరెడ్డి శ్రీదేవి, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ . నరసింహాచారి, సెకండరీ హె ల్త్ కార్యదర్శిగా రాజాం ఏరియా ఆసుపత్రి ఫోరెన్సిక్ వైద్యుడు డాక్టర్ మద్దాల.సంజీవ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు

ఎన్నికల అధికారులుగా ప్రభుత్వ వైద్యుల సంఘ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీ.వీ. నారాయణ రావు , పిడుగు రాళ్ళ ప్రభుత్వ వైద్య కళాశాల బయో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ భానుకుమార్ సంయుక్తంగా వ్యవహించారు. ప్రత్యేక పర్యవేక్షకులుగా ఏపీ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ కార్యదర్శి

డాక్టర్ పింజాల శ్రినివాస్, ఎలక్షన్ ప్రక్రియ ను పర్యవేక్షించారని తెలిపారు.

## కర్బలా వీరుల స్మరణలో.. భక్తిశ్రద్ధలతో మొహర్రం

(7వ పేజీ తరువాయి)

వివరించారు. ఆ ఘటనను స్మరించుకుంటూ ప్రతి ఏడాది మొహర్రం, సఫర్ నెలల్లో షియా ముస్లింలు సంతాప దినాలు పాటిస్తారని, సత్యం కోసం ప్రాణత్యాగం చేసిన కర్బలా అమరవీరుల గాథ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన తెలిపారు.

అంజుమన్ హుసైని కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో షియా ముస్లింలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కర్బలా అమరవీరులకు ఘనంగా నివాళులర్పిస్తూ శాంతి, సామరస్యాల కోసం ప్రార్థనలు చేశారు.

## వేడుకగా పోర్టు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవ వేడుకలు



విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :

విశాఖపట్నం ఏరియాలోని శ్రీ శృంగమణి పోర్టు పర్వతంపై వెలసిన వెంకటేశ్వర స్వామి వారి దివ్య తిరుక్కళ్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ నిర్వహిస్తున్నట్లు వైభవంగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఉదయం 4 గంటలకు సుప్రభాతం, ఆరాధన హోమములు బలిహరణ శాత్తుమురై, 11గంటలకు ధ్వజారోహణం మంగళశాసనం తీర్థగోష్ఠి, సాయంత్రం 4కువిష్వక్సేన పూజ పుణ్యాహవచనము,కొట్నాల ఉత్సవం, ఎదురు సన్నాహం, రాత్రి 7గంటలకు శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది.

# భారతి బ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

**సామాజిక సంక్షేమం జర్నలిస్టుల భద్రతే ధ్యేయంగా భారీ కార్యాచరణ**



విశాఖపట్నం, జూన్ 26, ప్రభాత వార్త :

విశాఖపట్నం నగర పరిధిలోని భారతి బ్రాహ్మణ జర్నలిస్టుల సంఘం వార్షిక సాధారణ మహాసభ బుధవారం ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన సింహాచలంలో అత్యంత ఉత్సాహభరితమైన, సౌహార్దపూర్వక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ విస్తృత స్థాయి సమావేశంలో సంఘం బలోపేతానికి, భవిష్యత్తు ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించడంతో పాటు రాబోయే కాలానికి ప్రతినిధులను ఎన్నుకునేందుకు నూతన కార్యవర్గ నియామక ప్రక్రియను చేపట్టారు. సింహాచలం నియోజకవర్గ ప్రతినిధి ప్రత్యేక పర్యవేక్షణలో, స్థానిక సభ్యుల అద్భుతమైన నిర్వహణ ఏర్పాట్లు, సహకారంతో సాగిన ఈ ప్రక్రియలో సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాబోయే రెండేళ్ల సుదీర్ఘ కాలపరిమితిలో బాధ్యతాయుతంగా పనిచేసే ఈ నూతన కమిటీ అధ్యక్షునిగా వంగూరి గణేశ్వరరావు (గణేష్ వంగూరి), ప్రధాన కార్యదర్శిగా విప్పర్తి జగన్ మోహన్ (వి జగన్మోహన్) ఏకగ్రీవంగా ఎంపికై బాధ్యతలు స్వీకరించారు. ఈ నూతన సంయుక్త కార్యవర్గంలోని ఇతర ముఖ్యమైన పదవులకు గాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సి.వి.ఎస్. శాయిరామ్, ఉపాధ్యక్షునిగా పెద్దాడ ప్రసాద్, కోశాధికారిగా నందూరి మురళి కృష్ణమాచార్యులు అత్యధిక ప్రజామోదంతో నియమితులయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీలుగా హెచ్.ఎస్. రామకృష్ణ, వడ్డాది ఉదయకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గరిమెళ్ల శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టగా, కార్యవర్గ సభ్యులుగా రవి, కె. రాజేష్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన ప్రతినిధులకు తోటి జర్నలిస్టు మిత్రులు, పలువురు ప్రముఖులు ఘనంగా అభినందనలు తెలియజేశారు. నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసిన అనంతరం, అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో జర్నలిస్టుల సంక్షేమానికి, సమాజ సేవకు ఉద్దేశించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘమైన సమిష్టి చర్చా కార్యక్రమం జరిగింది. సమాజంలో జర్నలిస్టుల పాత్రను మరింత బలోపేతం చేస్తూ, వారి కుటుంబాలకు అండగా నిలిచేలా త్వరలోనే క్షేత్రస్థాయిలో అమలు చేయబోయే నాలుగు అత్యుత్తమ సేవా కార్యక్రమాలకు ఈ మహాసభలో పచ్చజెండా ఊపారు. ఇందులో భాగంగా రాబోయే వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మికతను చాటేలా జర్నలిస్టు మిత్రులందరికీ మట్టి వినాయక ప్రతిమతో పాటు, ఒక ఉన్నతమైన ఆధ్యాత్మిక పుస్తకం, పూజా పత్రి మరియు ఒక మొక్కను ఉచితంగా పంపిణీ చేయాలని సంకల్పించారు.

దీనితో పాటు బ్రాహ్మణ సామాజికవర్గ వ్యాపారవేత్తలను, స్వయం ఉపాధి పొందుతున్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ వారి ఉత్పత్తులకు సరైన వేదికను కల్పించేందుకు వీలుగా నగరంలో ప్రతిష్టాత్మకంగా 'బ్రాహ్మణ బజార్' పేరుతో భారీ ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయడానికి కమిటీ నిర్ణయించింది. అలాగే నేటి ఆధునిక కాలంలో సమాజంలో ఎదురవుతున్న వివాహ సంబంధాల ఇబ్బందులను తొలగించే ప్రక్రియను సులభతరం చేసేందుకు, ఒక సమగ్రమైన వివాహ పరిచయ వేదికను కూడా నిర్వహించనున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా రాత్రింబవళ్లు సమాజం కోసం శ్రమిస్తూ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తున్న జర్నలిస్టుల కుటుంబాలకు పూర్తి భరోసాను కల్పిస్తూ, వారి కుటుంబ సభ్యులందరికీ వర్తించేలా కార్పొరేట్ స్థాయి హెల్త్ ఇన్సూరెన్స్ (ఆరోగ్య బీమా) సౌకర్యాన్ని కల్పించాలనే అత్యంత మానవీయమైన నిర్ణయాన్ని ఆమోదించారు. ఈ నాలుగు ప్రధాన ఆశయాలను సకాలంలో, అత్యంత ప్రతిష్టాత్మకంగా పూర్తి చేసి అసోసియేషన్ కీర్తిని మరింత ముందుకు తీసుకెళ్తామని నూతన కమిటీ సభ్యులందరూ ఈ సందర్భంగా సగర్వంగా తీర్మానించారు.

## వర్గీకరణ ఫలాలు చివరి వర్గం వరకు చేరేలా కృషి చేయాలి : మంద కృష్ణ మాదిగ

**ఉత్తరాంధ్ర మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సదస్సులో పిలుపు**



విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :

ఉత్తరాంధ్ర జిల్లాల మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈ ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల ఎంఈఎఫ్ సదస్సుకు పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు దుశ్శాలువ కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సదస్సులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మాదిగ ఉద్యోగులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడిన మంద కృష్ణ మాదిగ, వర్గీకరణ ఫలాలు చివరి వర్గానికి చెందిన ప్రతి అర్హుడికీ అందేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామానికీ వెళ్లి విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చి, విద్య ద్వారానే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రిజర్వేషన్ అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో ఆత్మగౌరవంతో జీవిస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా ముందుకు రావాలని ఆయన సూచించారు. మాదిగ సమాజ అభ్యున్నతికి ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని, యువతకు మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు, ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లిపూడి సత్యనారాయణ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలిషా, 36వ వార్డు మాజీ కార్పొరేటర్ మాసిపోగు రాజు, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి తొత్తరమూడి శ్రీనివాసరావు, ఎంఈఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పెట్లి వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవాతి రాజేష్‌బాబు, కోశాధికారి ఖండవల్లి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎంఈఎఫ్ సభ్యులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై వర్గీకరణ అమలు, విద్యార్థుల అభివృద్ధి, సామాజిక హక్కుల పరిరక్షణపై చర్చించారు.

# గచ్చిబౌలి షూటింగ్ రంగస్థలంపై నాసిర్ అలీ సంచలనం

- ఐదు పతకాలతో అప్రతిహత విజయం
- రాష్ట్ర స్థాయిలో విశాఖ యువ క్రీడాకారుడి సత్తా

విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :

హైదరాబాద్ గచ్చిబౌలిలోని సాట్ షూటింగ్ రేంజ్‌లో 2026 జూన్ 20 నుండి 28 వరకు ఘనంగా నిర్వహించిన 26వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల్లో విశాఖపట్నం నగరానికి చెందిన యువ క్రీడాకారుడు నాసిర్ అలీ అద్భుత ప్రతిభ కనబరుస్తూ ఐదు పతకాలతో సంచలన విజయాన్ని నమోదు చేసి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాడు.



ఎయిర్ స్మాల్ బోర్ మరియు షాట్ గన్ ఈవెంట్లలో పాల్గొన్న నాసిర్ అలీ పోటీల ప్రతి దశలోనూ అద్భుతమైన కచ్చితత్వం, దృఢ సంకల్పం, మానసిక స్థైర్యంతో పోటీదారులను మించి పోతూ 2 బంగారు, 2 వెండి, 1 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాడు. అతని ఈ అప్రతిహత ప్రదర్శన షూటింగ్ రంగంలో నూతన ప్రతిభగా నిలిపింది. పోటీలలో ప్రతి షాట్‌లోనూ అతని లక్ష్యసాధన స్పష్టంగా కనిపించగా, సమయపాలన, క్రమశిక్షణ, శారీరక–మానసిక సమతుల్యత అతన్ని విజయపథంలో నిలబెట్టాయి. కోచ్‌ల సూచనలను కచ్చితంగా అమలు చేయడం, నిరంతర సాధనతో తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడం అతని విజయానికి ముఖ్య కారణాలుగా నిలిచాయి.

చిన్న వయస్సులోనే షూటింగ్ క్రీడపై ఆసక్తి పెంచుకున్న నాసిర్ అలీ ప్రతిరోజూ కఠిన సాధన చేస్తూ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాడు. కుటుంబ సభ్యుల నిరంతర ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం అతనిలో విశ్వాసాన్ని పెంపొందించి విజయానికి దారితీశాయి.

నాసిర్ అలీ సాధించిన ఈ విజయాలు కేవలం వ్యక్తిగత గెలుపుకే పరిమితం కాకుండా, విశాఖపట్నం నగరానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకువచ్చాయి. అతని ప్రతిభపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, గురువులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో అతను జాతీయ మరియు అంతర్జాతీయ వేదికలపై భారతదేశాన్ని ప్రాతినిధ్యం వహించాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా నిపుణులు మాట్లాడుతూ, "నాసిర్ అలీలో ఉన్న కచ్చితత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ అతన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లగలవు. సరైన శిక్షణ, సదుపాయాలు లభిస్తే అతను దేశానికి కీర్తి తీసుకురావడం ఖాయం" అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు అతన్ని అభినందిస్తూ, యువత క్రీడల వైపు ముందుకు రావడానికి నాసిర్ అలీ విజయాలు ప్రేరణగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. సమాజం నుంచి, ప్రభుత్వ సంస్థల నుంచి మరింత ప్రోత్సాహం లభిస్తే ఇలాంటి ప్రతిభావంతులైన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని వారు తెలిపారు.

ప్రస్తుతం నాసిర్ అలీ లక్ష్యం జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ, అంతర్జాతీయ షూటింగ్ రంగంలో భారతదేశానికి కీర్తి తీసుకురావడమే. అతని పట్టుదల, కృషి, క్రమశిక్షణ చూస్తే ఈ లక్ష్యం దూరంలో లేదని క్రీడా వర్గాలు విశ్వసిస్తున్నాయి.

నాసిర్ అలీ సాధించిన ఐదు పతకాల ఘన విజయం విశాఖపట్నం నగరానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చింది. అతని విజయపథం మరింత వెలుగొందాలని ప్రజలు, అభిమానులు హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నారు.


## 94 ఏళ్ల వయసులోనూ..

# గ్లాస్ బ్రిడ్జిపై ఉత్సాహంగా అడుగులు..!

- కైలాసగిరి పర్యాటక ఆకర్షణగా గ్లాస్ బ్రిడ్జి..
- మనవడితో కలిసి సందడి చేసిన వృద్ధుడు

విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :

విశాఖ నగరంలోని కైలాసగిరిపై ఇటీవల ప్రారంభించిన గ్లాస్ బ్రిడ్జి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సముద్రతీర అందాలను పారదర్శక గాజు వంతెనపై నుంచి వీక్షించే అవకాశం కల్పిస్తున్న ఈ ప్రత్యేక ఆకర్షణకు రోజురోజుకూ సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. శుక్రవారం 94 ఏళ్ల వయస్సు గల సూర్య నారాయణమూర్తి తన 16 ఏళ్ల మనవడితో కలిసి గ్లాస్ బ్రిడ్జిని సందర్శించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ వయస్సులోనూ ఎలాంటి భయం లేకుండా గ్లాస్ బ్రిడ్జిపై ధైర్యంగా నడుస్తూ అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. వృద్ధుడి ఉత్సాహాన్ని చూసిన ఇతర పర్యాటకులు ఆయనను అభినందించడంతో పాటు ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ ఆసక్తి కనబరిచారు.



ఈ సందర్భంగా సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ, కైలాసగిరిలో గ్లాస్ బ్రిడ్జి ఏర్పాటు చేసిన విషయం తెలుసుకున్న వెంటనే దానిని తప్పకుండా చూడాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. వయసు ఎంతైనా మనసులో ధైర్యం, ఉత్సాహం ఉంటే ఏదైనా సాధ్యమేనని ఆయన పేర్కొన్నారు. తన మనవడితో కలిసి గ్లాస్ బ్రిడ్జిపై నడవడం ఎంతో ఆనందంగా అనిపించిందన్నారు. కైలాసగిరిలో ఏర్పాటు చేసిన గ్లాస్ బ్రిడ్జి విశాఖ పర్యాటక రంగానికి మరో ప్రత్యేక ఆకర్షణగా మారిందని అధికారులు తెలిపారు. కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి చేరుకుని గ్లాస్ బ్రిడ్జిపై నడుస్తూ సముద్రం, నగర సోయగాలను తిలకిస్తూ ఆహ్లాదాన్ని పొందుతున్నారని పేర్కొన్నారు. వృద్ధుల నుంచి చిన్నారుల వరకు అన్ని వయసుల వారు ఈ కొత్త ఆకర్షణను ఆసక్తిగా సందర్శిస్తుండటంతో కైలాసగిరిలో సందడి నెలకొంది.






## గిరి క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఉత్తమ ప్రతిభ కనబరిస్తారు

### అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి



<u>అరకులోయ, జూన్ 26, ప్రభాతవార్త :</u>

గిరి క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం అందిస్తే ఉత్తమ ప్రతిభను కనభరుస్తారని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి పేర్కొన్నారు. శుక్రవారం అరకులో య వాలీబాల్ గ్రౌండ్‌లో రాజ్యసభ సభ్యుడు వై వి సుబ్బారెడ్డి సహకారంతో ఎంపీ లాడ్స్ నిధుల నుండి 30 లక్షల రూపాయలతో క్రీడా స్థలానికి చేపట్టనున్న అదనపు వసతుల కల్పన పనులకు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా క్రీడ మైదానంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ వాలీబాల్ క్రీడా మైదానం అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డికి ఈ సందర్భంగా ఎంపీ ప్రజల అందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన నిధులు మంజూరు తోనే తన మాట నిలబెట్టుకున్నానన్నారు. గిరిజన ప్రాంతంలో యువత లో మంచి క్రీడా నేపథ్యం ఉందని, అయితే ప్రోత్సాహం లేక మరుగున పడుతున్నారని చెప్పారు. గిరి క్రీడాకారులకు సరియైన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దబడతారని చెప్పారు. కాగా అరకులో య వాలీబాల్ క్రీడా మైదానాన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని, శిధిలావస్థలో ఉన్న ప్రహరీ గోడను నిర్మించాలని స్టేజ్ ని అభివృద్ధి పరచాలని, రన్ వే ఏర్పాటు చేయాలని ఇలా అన్ని విధాలుగా క్రీడా మైదానం ను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని చెప్పారు. అలాగే మహిళలకు, పురుషులకు వేరువేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ క్రీడా మైదానాన్ని మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ గా తీర్చి దిద్దితే గిరి క్రీడాకారులందరికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అదేవిధంగా అరకులోయ వాలీబాల్ జిల్లా అసోసియేషన్ సభ్యులకు కూడా యువర్ క్రీడాకారులకు మంచి శిక్షణను అందవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి యువనేత చెట్టి వినయ్, ఎంపీటీసీలు దురియా ఆనంద్ , ఎల్బీ భీమరాజు, వార్డు సభ్యులు ఎల్బీ కిరణ్ కుమార్, డీజే బాలు , చంటి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నాయకులు ప్రతినిధులు, టి డబ్ల్యూ డి ఈ ఈ అభిషేక్, క్రీడా మైదానం కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ , తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### ప్రజాదర్బారులో చైర్మన్ డా. సియ్యారి దొన్నుదొర



<u>అరకు రూరల్, జూన్ 26, ప్రభాత వార్త:</u>

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం గ్రీవెన్స్ తీసుకొచ్చిందని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజక వర్గం ఇంచార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా. సియ్యారి దొన్ను దొర అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ (గ్రీవెన్స్) నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యక్తిగత సమస్యలపై ఎక్కువ వినతులు అందాయి. నూతన్ పెన్షన్ మంజూరు కోరుతూ తమ వినతులను అందజేశారు. చాలా గ్రామాలలో ఇప్పటికీ సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం లేక ఇబ్బందులు పడుతున్నారని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం దొన్ను దొర మీడియాతో మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు తెలుగుదేశం పార్టీ నాయకత్వం అంతా పని చేయాలన్న ఉద్దేశంతో ఈ గ్రీవెన్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి శుక్రవారం ప్రజల సమస్యలు తెలుసుకొని నేరుగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి సోమవారం ప్రభుత్వ యంత్రాంగం, ప్రతి శుక్రవారం ప్రజాప్రతినిధులు గ్రీవెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి వినూత్న ఆలోచన చేశారన్నారు. ప్రజలు సమస్యలతో సతమతమవుకూడదని ఏ సమస్య వచ్చినా మేము ఉన్నామని భరోసాని ఇవ్వడం కోసమే ఈ గ్రీవెన్స్ అన్నారు. ప్రజల వద్దకే పాలన. ప్రజలే దేవుళ్ళుగా అని భావించడమే టీడీపీ భావజాలం ఇదేనని అందుకే గ్రీవెన్స్‌కు ఇంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అరకు లోయ మండల అధ్యక్షులు లోకోయి మహదేవ్, ఏఎంసి చైర్మన్ బోరి బోరి లక్ష్మి, మాజీ ఎంపీటీసీ కుమార్, పాడి చందు, మరియు టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గుగ్గుడుకి విచ్చేయాలని జాయింట్ కలెక్టర్‌కు ఆహ్వానం

<u>అరకురూరల్, జూన్ 26, ప్రభాత వార్త:</u>



అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ను ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చట్టు మోహన్ శుక్రవారం పాడేరు జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన స్వగ్రామమైన గుగ్గుడు గ్రామాన్ని సందర్శించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరకు లోయ మండలం బస్కి పంచాయితీ గుగ్గుడు గ్రామంలో ఉన్న అంగన్వాడి భవన సమస్యను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన చట్టు మోహన్, భవన నిర్మాణం కోసం స్థానిక కుటుంబం స్థలాన్ని ఇచ్చినప్పటికీ వారికి ఇప్పటివరకు న్యాయం జరగలేదని వివరించారు. ఆ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో రహదారి, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, అంగన్వాడి స్థల సమస్యను పరిశీలించి సంబంధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో ఉన్న రహదారి, తాగునీటి సమస్యలను కూడా సంబంధిత అధికారులతో సమీక్షించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## మజ్జివలసలో మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రీవెన్స్‌లో వినతి



<u>అరకు రూరల్, జూన్ 26, ప్రభాతవార్త:</u>

అరకులోయ మండలంలోని మాదల పంచాయతీ పరిధిలోకి వచ్చే మజ్జి వలస గ్రామానికి సిసి రోడ్డు, డ్రైనేజీ సదుపాయాలను కల్పించాలని కోరుతూ. శుక్రవారం అరకు లోయలో ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకులోయ ఇన్చార్జి డాక్టర్. సియ్యారి దొన్నుదొర ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్ లో టిఆర్ జాతీయ మానవ హక్కుల అవినీతి నిరోధక సంఘం వినతి పత్రం ద్వారా కోరింది. ఆ సంఘం చైర్మన్ వంతల ప్రసాదరావు, వైస్ చైర్మన్ పాంగి శివాజీ, మహిళా విభాగం మండల చైర్మన్ వంతల గౌతమి, వైస్ చైర్మన్ తాంగుల సుమిత్ర, కార్యదర్శి శిరగం జయ, గ్రామస్తులు వంతల బుద్ధు ఈ మేరకు గ్రీవెన్స్ లో మజ్జి వలసకు సదుపాయాలను కల్పించాలని వినతిపత్రం ద్వారా విన్నవించారు. అదేవిధంగా అరకులోయ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ సమస్యలన్నీ గ్రీవెన్స్ ముందుకు తీసుకువస్తామని ఈ సందర్భంగా టీఆర్ నేషనల్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ అసోసియేషన్ నాయకులు, ప్రతినిధులు, చైర్మన్ దొన్నుదొరకు తెలియజేశారు.

## అమ్మవారి భక్తులకు అందుబాటులో సురక్షిత తాగునీరు

### మినీ వాటర్ ప్లాంటేషన్ ప్రారంభించిన మోదకొండమ్మ ఆలయ కమిటీ





<u>పాడేరు,జూన్26,ప్రభాతవార్త:</u>

పాడేరు మోదకొండమ్మ వారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు అమ్మవారు ఆలయంలో భక్తులు సంఖ్యపెరుగుతున్న దృష్ట్యా భక్తులకు సురక్షిత తాగునీరు అన్ని వేళలా అందుబాటులో ఉండేలా అలాగే వారానికి మూడు రోజులు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తుండడం భక్తుల దాహం తీర్చుకొరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 500 లీటర్లు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. అమ్మవారి ఆలయంలో నిరంతర చలివేంద్రం ఏర్పాటు చేస్తామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబునాయుడు పేర్కొన్నారు. అమ్మవారి సన్నిధిలో సుమారు ఒక లక్షా 60 వేల రూపాయలు వ్యయంతో మినీ వాటర్ ప్లాంట్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని భవిష్యత్ లో ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ప్రముఖ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు నాయకులు, జిల్లా అధికారులు, గిరిజన సంఘాలు, వ్యాపార సంఘాలు అమ్మవారి భక్తులు సహాయ సహకారాలు అందించాలని ప్రధాన కార్యదర్శి కోటిబాబు నాయుడు కోరారు. కార్యక్రమనలో మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ బంజంగి కాంతమ్మ, ఆలయకమిటీ సభ్యులు చల్ల రామకృష్ణ, బోనంగి వెంకటరమణ ,కిల్లు చంద్రమోహన్ కుమార్, కొణతాల సతీష్, గబలంగి శంకర్రావు, బింగినపల్లి హరిబాబు, కురస లక్ష్మయ్య, గూడెపు సూర్య ప్రకాష్, పలాసి రమణమ్మ, జంపరంగీ సత్తిబాబు, మోద స్వరూప ఆలయ కమిటీ గుమస్తాలు ఏ సత్యనారాయణ రామారావు,కరాటే మాస్టర్ బాకూరి పాండురాజు ,తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు

<u>పాడేరు,జూన్26,ప్రభాతవార్త;</u>



గిరిజన ఆరాధ్య దైవం కోరికలు తీర్చే కల్పవల్లి పాడేరు శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుదుర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. మాజీ జడ్పీ చైర్పర్సన్ వంజంగి కాంతమ్మ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కలసి నడుద్దాం.. కదం తొక్కుదాం..!

### రాజకీయాల కతీతంగా 1/70 చట్టాన్ని కాపాడుకుందాం

### ఆదివాసీ హక్కుల చట్టాల పరిరక్షణ ఐక్యవేదిక ప్రతిన



<u>కొయ్యూరు, జూన్26, ప్రభాతవార్త:</u>

రాజకీయాలకతీతంగా, రాగద్వేషాలకు తావు లేకుండా ఆదివాసీలు అందరు ఏకమై 1/70 చట్టాన్ని కాపాడుకుందామని, గిరిజ నేతరుల దాడిని తిప్పి కొడదామని చింతపల్లి డివిజన్ ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ ఐక్య వేదిక నినదించింది. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ ఐక్య వేదిక ఆద్వర్యంలో మండల కేంద్రంలో గిరిజన భవన్ లో శుక్రవారం నర్సి పాపారావు అధ్యక్షతన సమావేశమై 1/70 భూభదాలయింపు నిషేధ చట్టం సవరణ చేయాలని 1700 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్ట్ లో పిటిషన్ వేసిన నేపథ్యంలో ఈ చట్టం సవరణ చేయకుండా ఏ విధంగా న్యాయపోరాటం, ప్రజాపోరాటం చేయాలో? సమాలోచన చేసారు. 1/70 చట్టం చేసిన తర్వాత అధికారులు సక్రమంగా అమలు చేయలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆదివాసీ హక్కులు, చట్టాలు సక్రమంగా అమలు కాలేదని, బినామీల కారణంగా చట్టం ఆక్రమణకు గురౌవుతుందని, 1/70 చట్ట సవరణ చేయాలని గిరిజనేతరులు ఏకంగా సుప్రీంకోర్టు లో 1700 మంది కేసు వేయడం ఆశ్చర్యానికి గురి చేసిందని, ఇప్పటికే చాలామంది గిరిజనేతరుల దగ్గర ఆదివాసీల భూములున్నాయని, చట్ట సవరణ కానీ జరిగితే ఆదివాసీలం నిరాశ్రయులం అవుతారని,న్యాయ పోరాటం, ప్రజా పోరాటం చేయడానికి ఐక్యవేదిక ఆద్వర్యంలో గ్రామస్థాయిలోకి తీసుకొని వెళ్దామని, ఆదివాసీలందర్ని ఏకం చేయడమే లక్ష్యంగా పని చేద్దామని, త్వరలో గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయం తీసుకొన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కంకిపాటి వీరన్నపడాల్, భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు, విశ్రాంతి డిఎస్పీ కాకూరి బాలరాజు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ విభాగం రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, చంద్రు క్రిష్ణ,బూరుగు వెంకటరావు, శ్యామల వరలక్ష్మి, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవుడు, కార్యదర్శి సాగిన కోటిబాబు,శామ్యూల్ పడాల్,సరుముర్తి సూరిబాబు, ఉల్లి సూరిబాబు, అశోక్ లాల్, అచ్యుత్,పాటి చంద్రశేఖర్, రాజుబాబు, గోకిరి చిన్నారావు, పల్లాల అబ్బాయిరెడ్డి, మొల్ల నాగరాజు, వంజరి శంకురమ్మ, దేపూరి రాజుబాబు, వారా చిననూకరాజులతో పాటు పెద్ద ఎత్తున ఆదివాసీలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం..!

### మారుమూల పలక జీడి వారపుసంతలో గిరిజనులకు మంప ఎస్సై శ్రీనివాస్ అవగాహన

<u>కొయ్యూరు, జూన్ 26, ప్రభాతవార్త :</u>



ప్రస్తుత నేటి ఆధునిక సమాజంలో సైబర్ నేరాలు అధికమవుతున్న వేళ, గిరిజనులు సైబర్ నేరాల పట్ల విధిగా అవగాహన కలిగి ఉండాలని మంప ఎస్సై సీదరి శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం మండలంలోని అతి మారుమూల మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని యు. చీడిపాలెం పంచాయతీ, పలక జీడి వారపు సంతను ఆయన తన సిబ్బందితో కలిసి సందర్శించి, వారపు సంతకు వచ్చిన మారుమూల గ్రామాల గిరిజనులతో మాట్లాడారు. ఈ సందర్భంగా- డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాలు, మహిళల పట్ల జరుగుతున్న నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అలాగే వ్యాపారులతో మాట్లాడుతూ- గిరిజనులకు నకిలీ వస్తువులు విక్రయించరాదని హితవు పలికారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం.!



<u>(నక్కపల్లి ప్రభాతవార్త) :</u>

మండలంలోని మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నక్కపల్లి మండలంలో శనివారం 9,750 మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవం తంగా నిర్వహిం చేందుకు ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలను అందించేందుకు ద్రవ జీవామృతంను పెద్ద ఎత్తున తయారు చేసి మొక్కలకు పిచికారీ చేయడానికి సిద్ధం చేశారు. మొక్కలు నాటే విషయంలో ఘన, జీవామృతంను పశువుల ఎరువు తో కలిపి ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తయారు చేసి మొక్కల నాటే గుంతల్లో వినియోగించేందుకు సిద్ధం చేశారు. ఈ మేరకు మండల అభివృద్ధి అధికారి చలపతిరావు,, వ్యవసాయ ప్రాజెక్టు అధికారి భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు బయో-ఇన్‌పుట్స్ తయారీ విధానాన్ని పరిశీలించి, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేశారు. మొక్కల నాటకం అనంతరం వాటి సంరక్షణ, సేంద్రియ పోషకాల వినియోగం, క్రమం తప్పకుండా ద్రవ జీవామృతం పిచికారీ చేయడం, ఘన జీవామృతం వినియోగించడం ద్వారా మొక్కల మనుగడ శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమానికి అవసరమైన ద్రవ జీవామృతం, ఘన జీవామృతం తదితర బయో-ఇన్‌పుట్స్‌ను నక్కపల్లి మండల ప్రకృతి వ్యవసాయ బీఆర్‌సీల ద్వారా తయారు చేసి అందజేయడం చేశారు. కార్యక్రమాన్ని ఎన్ఎఫ్ మండల ఇన్‌చార్జిలు తాసుబాబు, అప్పారావు పర్యవేక్షిస్తుండగా, ప్రత్యేక పరిశీలకు వెంకట్ , కార్యక్రమ నిర్వహణను సమన్వయం చేస్తూ పర్య వేక్షిస్తున్నా రు. మండలంలో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడం, ప్రకృతి వ్యవ సాయ పద్ధతులను ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడం ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు.

## ఘనంగా శ్రీనివాసుడి ఊరేగింపు



<u>కసింకోట, జూన్ 26, ప్రభాత వార్త;</u>

మండల కేంద్రమైన కసింకోటలో వెంకటేశ్వర ధ్యాన మందిరములోశ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం కసింకోట పురవీధులలో గరుడ సేవా వాహనం అచ్చంతో వైభవంగా భక్తుల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రేజేటి మారుతి, కన్నబాబు, రెడ్డి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### -యువతకు వైద్యాధికారుల పిలుపు




<u>విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :</u>

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వాడకం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా దిశ ఐడీయూ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, క్షయవ్యాధి నియంత్రణ అధికారి డా. రోణంకి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈఎన్‌టీ ఆస్పత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్ నుంచి పోలమాంబ ఆలయం మీదుగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి వరకు మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. కె.వి. రామిరెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన యువత కోలుకోవడంలో ఓఎస్‌టీఈ కేంద్రాల ద్వారా అందించే చికిత్స ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా అధికారి డా. రోణంకి రమేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యసనం వల్ల యువత మానసిక, శారీరక, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని, యువత ఈ దుష్ప్రవర్తనకు దూరంగా ఉండాలని సూచించారు. ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డా. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రతి ఏడాది జూన్ 26ను అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంగా నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా దిశ ఐడీయూ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా ఐసీటీసీ సూపర్వైజర్ వీరభద్రరావు, దిశ లెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ రవి భాస్కర్, ఓఎస్‌టీఈ సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దిశ ఐడీయూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశ్నాపత్రాల లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం

### కాంగ్రెస్ పార్టీ నేతల ఆగ్రహం



<u>విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :</u>

రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలు విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించింది. శుక్రవారం జగదాంబ సెంటర్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మ రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత లేకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. విద్య, ఉపాధి, యువత సంక్షేమం వంటి కీలక అంశాల్లో ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కోటాలో భారత జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ది ఫ్యాక్టరీ కోటా" కార్యక్రమంలో రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా "ఛత్రోన్ కీ గూంజ్" ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షలలో అవకతవకలు, విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడికి వ్యతిరేకంగా ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిగణించి, నీట్ సహా అన్ని పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పటిష్ట భద్రతా చర్యలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. సమావేశంలో గాదం మహేష్, కేవీ సూర్యనారాయణ, కస్తూరి వెంకటరావు, కనకరావు సంతోష్, సబ్బవరపు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి కబ్జాపై ప్రజాసంఘాల ఆందోళన

### -గండి బాబ్జీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




<u>విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :</u>

పెందుర్తి మండలం పెందుర్తి గ్రామంలోని సర్వే నంబర్ 107/11లో ఉన్న 8 ఎకరాల 8 సెంట్ల ప్రభుత్వ భూమిని గండి బాబ్జి అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ ప్రజాసంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ భూమిని వెంటనే ప్రభుత్వ స్వాధీనం చేసుకుని, అక్రమ ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 2023లో సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఫర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) ఇచ్చిన తీర్పులో ఈ భూమి ప్రభుత్వ భూమిగా స్పష్టంగా నిర్ధారించినప్పటికీ, గండి బాబ్జి ఫెన్సింగ్ వేసి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, జీవీఎంసీ అధికారులు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఫిర్యాదులు చేసినప్పటికీ జిల్లా యంత్రాంగం స్పందించడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లా మంత్రి, విశాఖ ఎంపీ జోక్యం చేసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూతో) జిల్లా అధ్యక్షురాలు ఎస్. వెంకటలక్ష్మి మాట్లాడుతూ, గతంలో తప్పుడు పత్రాలతో జరిగిన భూ రిజిస్ట్రేషన్లను 2011లో రద్దు చేశారని, అనంతరం రైత్వారీ పట్టాను కూడా సీసీఎల్ఏ రద్దు చేస్తూ భూమి ప్రభుత్వానిదేనని తీర్పు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల అక్రమ ఆక్రమణలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. మరిడిమాంబ కాలనీలో నివసిస్తున్న సుమారు 40 పేద కుటుంబాలకు పట్టా హక్కులు కల్పించి, వారి నివాసాలకు రక్షణ కల్పించాలని, మిగిలిన ప్రభుత్వ భూమిని ప్రభుత్వ విధానాల ప్రకారం పేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించాలని ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఇందిర, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం కన్వీనర్ ఈసర లక్ష్మి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డి. ఏడుకొండలు, కాలనీ ప్రతినిధులు కటారి నాగేశ్వరరావు, దమ్ము దేవుడమ్మ పాల్గొన్నారు.

## ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు'

### కార్యక్రమానికి ప్రజలు హాజరుకావాలి

<u>విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త :</u>

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడం, ఫిర్యాదులు లేని గ్రామాల ఏర్పాటుతో పాటు పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఒక నెల--ఒక నియోజకవర్గం--నాలుగు సందర్శనలు' కార్యక్రమం సీతమ్మధార మండలంలో శనివారం నిర్వహించనున్నారు. సీతమ్మధార మండల తహశీల్దార్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలో జూన్ 27న ఉదయం 9 గంటల నుంచి వెంకోజీపాలెంలోని సెక్టార్-1, ఉడా కళ్యాణ మండపంలో కార్యక్రమం జరుగుతుంది. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఆధారాలతో పాటు దరఖాస్తులను తీసుకువచ్చి అధికారులకు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ద్వారా ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కశింకోటలో భారీ అవగాహన ర్యాలీ



కసింకోట జూన్ 26, ప్రభాత వార్త

మండల కేంద్రమైన కసింకోటలో అనకాపల్లి సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్‌డీపీఓ) ఎం. శ్రావణి పర్యవేక్షణలో, నషా ముక్త్ భారత్ అభియాన్ (మాదకద్రవ్య రహిత భారతం) కార్యక్రమంలో భాగంగా కశింకోటలో భారీ అవగాహన ర్యాలీ అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, డీపీఎన్ బాలుర పాఠశాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు, 70 మంది గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, యువతపై వాటి ప్రభావం, సమాజానికి కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కశింకోట గ్రామ పెద్దలు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వేగి గోపి, వేగి వెంకటరావు, దాడి నాగరాజు, బొబ్బరి పవన్, చిదిరెడ్డి శ్రీనివాసరావు, దాసరి బాబు, నడిపల్లి సన్యాసిరావు (ఎంపీటీసీ), పవాడ కామరాజు తదితరులు విద్యార్థులతో కలిసి "వద్దు బ్రో... డ్రగ్స్ వద్దు బ్రో...", "డ్రగ్స్‌కు నో... జీవితానికి యెస్...", "మత్తుకు దూరం... ఆరోగ్యానికి చేరువ..." వంటి నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు. అనంతరం నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞలో విద్యార్థులు, ప్రజలు పాల్గొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సీఐ అల్లు స్వామి నాయుడు, ఎస్ఐ కె.లక్ష్మణరావు, ఎస్ఐ సతీష్, పోలీసు సిబ్బంది పాల్గొని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజా సమస్యల వినతలు స్వీకరించిన ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి, జూన్ 26, ప్రభాతవార్త



అనకాపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా వినతి కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ స్థానిక ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తిగత, సామాజిక, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని విన్న కొణతాల రామకృష్ణ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయడం జనసేన పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా సేవాభావంతో పనిచేస్తూ, ప్రతి సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## 27, 28 తేదీల్లో అనకాపల్లి అప్సర అనకాపల్లి ఐకాన్ 2026



అనకాపల్లి జూన్ 26, ప్రభాతవార్త

పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 27, 28 తేదీలలో అనకాపల్లి అప్సర అనకాపల్లి ఐకాన్ అనే మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి కంటెంట్ క్రియేటర్స్ 2026 ప్రోగ్రాం కన్వీనర్ మల్ల వంశీ సుహాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక జగన్నాథ స్వామి కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాంప్రదాయ బద్దంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని 15 నుండి 30 పైబడి వయసు వారు పాల్గొనవచ్చని వారు తెలిపారు. ఈనెల 27న కబడ్డీ, ఆర్మ్ ఫోర్, ఫన్ గేమ్స్ లక్కీ డిపిగేమ్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించబడతాయన్నారు. 27న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 వరకు జరుగు ఈ కార్యక్రమంలో ఫినాలేలో ఎంపికైన వారు 28వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటారన్నారు. ర్యాంప్ వాక్, లక్కీ డిప్ గేమ్ తదితర అంశాలు చోటు చేసుకుంటాయన్నారు. ఆదివారం సాయంత్రం ఉదయం 10 గంటల నుండి 10 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ పోటీలతోపాటు మ్యాజిక్ షో, బాడీ బిల్డింగ్, కూచిపూడి సాంప్రదాయ నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, సినీ సెలబ్రిటీస్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సుమారు 2000 మంది వీక్షకులు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా నిర్వాహకులు కోరారు. బొడ్డేడ ప్రియాంక, గోకాడ ప్రియాంక, పి.జాను, ఎం.క్రాంతి కుమార్, ఎం.వంశీ సాయికుమార్, వై.భార్గవ్ అఖి, చరణ్, దీపు, జగదీష్ పాల్గొన్నారు.

## ఘనంగా దివంగత నేత పి.వి.చలపతిరావు జయంతి వేడుకలు

అనకాపల్లి, జూన్ 26, ప్రభాతవార్త



అనకాపల్లిలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో దివంగత నేత పి.వి. చలపతి రావు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బొడ్డెడ నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు కర్రి రామకృష్ణ, మండల అధ్యక్షుడు తాతారావు, స్వరూప్, భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పి.వి. చలపతిరావు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడని కొనియాడారు. సమాజాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని దివంగత నేతకు ఘన నివాళులర్పించారు.

## కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలి



అచ్యుతాపురం, జూన్ 26, ప్రభాతవార్త

అచ్యుతాపురం: స్థానిక ఎస్ఈజెడ్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఇన్చార్జ్ ఎమ్మెల్యే, జోనల్ ఇన్‌చార్జ్ బెందాళం అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ జడ్పీ చైర్మన్ లాలం భవాని భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెందాళం అశోక్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టాన్ని ఎప్పటికప్పుడు గుర్తిస్తుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చినా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అండగా ఉంటారని తెలిపారు. "సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు" అనే సిద్ధాంతంతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. యువ నాయకులు గొంతిన హరీష్, మండల పార్టీలు ఈశ్వరరావు, లాలం భరత్, పెంటకోట విజయ్, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లె శివన్నారాయణమూర్తి, దైరెడ్డి భీమరెడ్డి శ్రీనివాసరావు, దొక్కా నాగభూషణం, మామిడి శివ అప్పారావు, కొలుకులూరు విజయరామరాజు, ఆదారి మంజు, ఆదారి జానకి, రాజాన నారాయణమ్మ, జనపరెడ్డి నరసింగరావు, వసంతవాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

అచ్యుతాపురం, జూన్ 26, ప్రభాతవార్త



ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంపై సీఐ చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్ అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, ట్రాఫిక్ నిబంధనలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలపై విద్యార్థులకు వివరించారు. అప్రమత్తంగా ఉంటూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం సుమారు 200 మంది విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మారకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం




గొలుగొండ జూన్ 26 ప్రభాతవార్త

మాదకద్రవ్యాల నిర్మూలలే లక్ష్యంగా ప్రతి ఒక్కరు అవగాహనతో మెలగాలని గొలుగొండ శాఖ ఎక్సైజ్ సీఐ మోహన్ రావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురుకుల కళాశాల నందు విద్యార్థుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై వివరించారు. పదార్థాలకు అలవాటుపట్టం వల్ల భవిష్యత్తు శూన్యంగా మారి కుటుంబం రోడ్డున పడుతుందని అన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు నిర్మూలనకు గ్రామాల్లో విస్తృత ప్రచారం జరిగేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఎటువంటి చెడు అలవాటులకు ఆకర్షితులు కాకుండా భవిష్యత్తుపై మక్కువ పెంచుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ శాఖ ఎస్సై రెహమాన్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్తు వద్దు.. భద్రత ముద్దు

### మాదకద్రవ్యాలపై సమిష్టిగా పోరాడుదాం : రూరల్ ఎస్సై ఉపేంద్ర

ఎలమంచిలి జూన్ 26, ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా రూరల్ పరిధిలోని ఫ్యూజన్ బ్రిక్ ఇండస్ట్రీలో శుక్రవారం మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై ఉపేంద్ర కార్మికులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై ఉపేంద్ర మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల మహమ్మారి బారిన పడి ఎవరూ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను ఆయన విపులంగా వివరించారు. కార్మికులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, తమ కుటుంబాలతో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఇదే వేదికపై ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతను తెలియజేశారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం, సురక్షితమైన రోడ్డు ప్రయాణం మనందరి ఉమ్మడి బాధ్యత అని, దీనికోసం ప్రతి పౌరుడూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పరిశ్రమకు చెందిన ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## ధారమఠం జలపాతంలో యువకుడు మృతి



గొలుగొండ, జూన్ 26 ప్రభాతవార్త

దారమటం జలపాతంలో ఒక యువకుడు మృతి చెందినట్లు గొలుగొండ ఎస్ఐ పి రామారావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో దారమఠం దేవాలయానికి తన స్నేహితులతో వచ్చి జలపాతంలో స్నానం చేసేందుకు కొండపైన ఉన్న జలపాతంలో స్నానం చేస్తూ ఊబిలో ఇరుక్కుపోయి మృతి చందారన్నారు. జిమాడుగుల గ్రామానికి చెందిన చుక్కల సాంబశివ గణేష్(22) తన ఇద్దరు స్నేహితులతో కలిసి ధార్మటం వచ్చారని అన్నారు. ఆలయంపై భాగంలో ఉన్న జలపాతాల చివరి వరకు వెళ్లి అక్కడ స్నానం చేస్తుండగా ఈ ఈ ప్రమాదం జరిగిందన్నారు. జలపాతంలో ఇరుక్కుని గణేష్ ప్రమాద స్థలంలోనే మృతి చెందాడన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 112 కు కాల్ చేశారని వెంటనే అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి దారమఠం చేరుకొని ఈతగాళ్ల సహాయంతో గాలించుగా ఊపులో ఇరుక్కు పోయిన మృతదేహం లభ్యం అయింది అన్నారు. కొండపై నుండి కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా హాస్పిటల్, నర్సీపట్నంకు తరలించారు. మృతుని తండ్రి చుక్కల వెంకటరమణ ప్రస్తుతం జి.మాడుగులలో సాక్షి విలేకరుగా పనిచేస్తున్నారని అన్నారు పంచనామా నిర్వహించి విచారిస్తున్నామని ఎస్సై తెలిపారు.

## మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

### పేటలో ఘనంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై ఎక్సైజ్ పోలీసుల అవగాహన సదస్సు

పాయకరావుపేట, జూన్ 26,ప్రభాతవార్త



డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అంతా సమిష్టి కృషి చేయాలని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ కె.మురళి మోహన రావు పిలుపునిచ్చారు. నిషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాసు ఆధ్వర్యంలో గురువారం ఆయన తమ సిబ్బందితో కలిసి పట్టణంలో గల మెయిన్ రోడ్డు,యాత పేట సహా స్థానిక ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహాలలో శుక్రవారం గంజాయి నిర్మూలన, మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలు తదితరులకు అంశాలపై అవగాహన కలిగించారు. ఎక్సైజ్ ఎస్సై మురళీ మోహన్ రావు మాట్లాడుతూ మాదక ద్రవ్యం వినియోగం వల్ల ఆరోగ్య,సామాజిక, ఆర్థికపరంగా అపారమైన నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉన్నదని వివరించారు. ప్రధానంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, స్నేహితుల ఒత్తిడికి లోనుకాకుండా తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబంతో బాటు సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. డ్రగ్స్ వినియోగం సహా అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని అంటూ ఆయన ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం,అక్రమ రవాణా జాడ తెలిస్తే ప్రజలు వెంటనే ఎక్సైజ్ స్టేషన్‌కు సమాచారం అందించినట్లయితే అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ ఎస్సై మురళి మోహన్ రావు డ్రగ్ ఫ్రీ సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్‌లు నాయుడు బాబు, బి.రమణ, జి.అప్పారావు, కానిస్టేబుల్లు డి. నాగశంక్రరావు, ఆర్.జగన్నాద్‌లు పాల్గొన్నారు.

## ఓటర్ వెరిఫికేషన్‌లో అప్రమత్తంగా ఉండాలి

అనకాపల్లి, జూన్ 26, ప్రభాతవార్త



ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరి స్తూ సమగ్రంగా వివరాలు సేకరించాలని 80వ వార్డు వైసిపి ఇన్చార్జి కేఎం నాయుడు బిఎల్ఏల కు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన బిఎల్ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ అప్లికేషన్ వివరాల ప్రక్రియ జాగ్రత్తగా నింపాలని, ఓటర్ అప్లికేషన్ సరిగ్గా నింపని యెడల ఓటు మిస్ అయ్యే అవకాశం ఉందని, అందువలన ఈ అప్లికేషన్ బిఎల్‌వోలతో జాగ్రత్తగా నింపిం చాలని వారికి సూచించారు. చేర్పులపై దృష్టి పెట్టి వాటిని ఈ ఓటర్ జాబితాలో చేర్పించాలని సూచించారు.

## మత్తు రహిత సమాజం కోసం సమిష్టి కృషి చేయాలి

### పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌బాబు -పేటలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులతో భారీ ర్యాలీ

పాయకరావుపేట, జూన్ 26, ప్రభాతవార్త



మత్తు రహిత సమాజం కోసం సమిష్టి కృషి చేయాలని స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు పిలుపునిచ్చారు. నిషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన తమ పోలీస్ సిబ్బందితో కలిసి ఇక్కడి శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల నుంచి వై జంక్షన్ వరకు గల రహదారి పొడవునా డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులతో భారీ ర్యాలీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్యక్రమంలో విద్యార్థులు,యువతతోపాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, సామాజిక కార్యకర్తలు సహా స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి డ్రగ్స్‌కు నో చెప్పండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపండి భవితకు బాటలు వేయండి అన్న నినాదాలతో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. వినోద్ బాబు మాట్లాడుతూ,మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం సహా సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రధానంగా యువత తమ లక్ష్యాలపై దృష్టి సారించి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు అంతా కృషి చేస్తామని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏం.వినోద్‌బాబు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పలువురు పాల్గొన్నారు.




## ఓట్లుపై ప్రజలను చైతన్య పరుస్తున్న కూటమి నాయకులు

అనకాపల్లి జూన్ 26, ప్రభాతవార్త



జీవీఎంసీ 81వ వార్డు బూత్ నెంబర్ 220 భోగలింగేశ్వర స్వామి కోవెల వీధి, కోట వీధి, అగ్గి మర్రి చెట్టు, మల్ల దొడ్డి తదితర ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కార్యక్రమంలో ఓటర్లకు ఓటు ప్రాధాన్యతను, విలువలు, 2002 నుండి ఓట్లు వేస్తున్న ఓటర్లను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సచివాలయ సిబ్బంది బిఎల్ఓ తంగేటి హరికృష్ణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీ భోగ లింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ శ్రీ సర్వకాంబ దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల కారుబాబు కైచర్ల ప్రకాష్ తదితరులు కలిసి ఇంటింటికి ఓట్లు వివరాలతో కుటుంబ సభ్యులకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఫారశీ ఇచ్చి అక్కడికక్కడే పూర్తి చేసి బిఎల్ఓకి అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై ఉన్న ఆసక్తి ఓట్ల మీద లేదని కేంద్ర ఎన్నికల కమిషన్ టీవీ ద్వారా పత్రికల ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పత్రికా ముఖంగా ప్రకటనలు ఇచ్చినప్పటికీ చాలామంది ఓటర్లు అవగాహన రహితంగా ఉన్నారని, ముఖ్యంగా అద్దెలకు ఉన్నవారు వేరే ప్రాంతానికి వెళ్లడం జరిగిందని, వారు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలియని పరిస్థితి బిఎల్వోలు తలలు పట్టుకుంటున్నారని, ఆ ప్రాంత ప్రజలను అడిగినప్పటికీ కూడా సమాచారం అందించలేకపోతున్నారని మాకు తెలియదని సమాధానం రావడంతో చాలామందికి ఓట్లు ఫారాలు అందించలేకపోతున్నారని ఆవేదన సత్యనారాయణ తెలియజేశారు. కొణతాల కారుబాబు మాట్లాడుతూ వలస వెళ్లిన ఓటర్లతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అయినప్పటికీ వారు సమాచారాన్ని సేకరిస్తున్నామని కారుబాబు అన్నారు.

## ఇసుక ట్రాక్టర్లపై తనిఖీలేవీ?

### నిబంధనలు గాల్లోనే.. ఆందోళనలో స్థానికులు



బుచ్చయ్య పేట జూన్ 26 ప్రభాతవార్త

మండల పరిధిలో ఇసుక రవాణా నిర్వహిస్తున్న కొన్ని ట్రాక్టర్లకు సంబంధించి భద్రతా నిబంధనల అమలుపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహ దారులపై తిరుగుతున్న కొన్ని వాహనాలకు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్ వంటి పత్రాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న అంశంపై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.స్థానికుల కథనం ప్రకారం, ఇసుక రవాణాలో వినియోగిస్తున్న కొన్ని ట్రాక్టర్లను తగిన అర్హతలు కలిగిన డ్రైవర్లే నడుపుతున్నారా అనే అంశంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని వారు కోరుతున్నారు.సాధారణ ట్రాఫిక్ ఉల్లంఘనలపై అధికారులు చర్యలు తీసుకుంటున్న తరహాలోనే, భారీ వాహనాల విషయంలో కూడా రహదారి భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు కావాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత రహదారులపై అధికంగా సంచరించే ట్రాక్టర్ల పత్రాలు, డ్రైవర్ల అర్హతలను తనిఖీ చేయడం ద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని చెబు తున్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసర మైతే ప్రత్యేక తనిఖీ డ్రైవ్‌లు నిర్వహించి నిబంధనల అమలును మరింత పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఏయూ రంగస్థల విభాగం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా అంబటి

విశాఖపట్నం, జూన్ 26 ప్రభాతవార్త




ఆంధ్ర విశ్వ కళా పరిషత్ రంగస్థల విభాగం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా అంబటి విజయ రాఘవన్, గౌరవ అధ్యక్షులుగా విభాగం ఆచార్యులు డాక్టర్ భాస్కరరావు మరపట్ల ఎన్నికయ్యారు. పౌర గ్రంథాలయాలు గురువారం సాయంత్రం జరిగిన ఆంధ్ర విశ్వ కళా పరిషత్ రంగస్థలం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల అధికారిగా విభాగం పూర్వ విద్యార్థి బివికె కళాశాల పూర్వ ప్రిన్సిపల్ పి.వెంకట రమణమూర్తి వ్యవహరించారు. పరిశీలకులుగా ప్రముఖ రంగస్థలం కళాకారులు చలసాని కృష్ణ ప్రసాద్ బాధ్యతలు నిర్వహించారు. ప్రముఖ రంగస్థలం నటులు శ్రీరామ్మూర్తి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. గౌరవాధ్యక్షులు డాక్టర్ భాస్కర రావు మరపట్ల, అధ్యక్షులు అంబటి విజయ రాఘవన్, ఉపాధ్యక్షులు సేనాపతి మహేష్, ప్రధాన కార్యదర్శి బి.ఎస్.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి డాక్టర్ డి.దీనబంధు, కోశాధికారి ఎస్‌వివి సత్యమూర్తి, కార్యవర్గ సభ్యులుగా డి.హేమ వెంకటేశ్వరి, ఎం.శివజ్యోతి, డా.అపూర్వ, టి.అనురాధ, నవరస మూర్తి, ఆకిరి సురేష్, చోడిశెట్టి శ్రీనివాసరావు, పీ.గిరిధర్, టి.రమేష్, ఎస్.వెంకట తేజ ఎన్నికయ్యారు. న్యాయ సలహాదారులుగా పూర్వ విద్యార్థులైన న్యాయవాదులు కె.విజయ చంద్ర వర్మ, విజయలక్ష్మి నియమితులయ్యారు. పూర్వ విద్యార్థులైన ప్రముఖ రంగస్థలం కళాకారులు గౌరవ సలహాదారులుగా వ్యవహరిస్తారు. ఎన్నికల ప్రక్రియకు సంధానకర్తగా నాగనబోయిన నాగేశ్వరరావు బాధ్యతలు నిర్వహించారు.

## ప్రాణాలు తీస్తున్న గంభీరం రిజర్వాయర్

### తరచూ జరుగుతున్న విషాదాలు -రక్షణ చర్యలు కరువు -పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి అపార అవకాశాలు

ఆనందపురం, జూన్ 26, ప్రభాతవార్త:



జిల్లాలోని ఆనందపురం మండలం గంభీరం వద్ద ఉన్న రిజర్వాయర్ ప్రకృతి అందాలకు నిలయంగా నిలుస్తున్నప్పటికీ, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. కొండల నడుమ ఆహ్లాదకర వాతావరణంలో విరాజిల్లుతున్న ఈ ప్రాంతానికి ప్రతి రోజు పెద్ద సంఖ్యలో యువత, కుటుంబాలు, ప్రకృతి ప్రేమికులు తరలివస్తున్నారు. పలు చలన చిత్రాలు షూటింగ్‌లు కూడా ఇక్కడి జరిగాయి. కానీ కనీస సౌకర్యాలు లేకపోవడంతో తర్వాత ఎవరూ ఆశక్తి కనబరచలేదు. అయితే రిజర్వాయర్‌లో సరదాగా ఈతకు దిగుతున్న వారిలో పలువురు ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగిస్తోంది. విశాఖ నగరానికి తాగునీరు, పంట పొలాలకు సాగు నీరందించే ఈ రిజర్వాయర్ 70 ఏళ్ళు క్రితం నిర్మించారు. దీని నిర్వాహణను నీటిపారుదల శాఖతో పాటు, జీవిఎంసీ కూడా చూస్తోంది. కాగా మొదట నుంచి ఈ రిజర్వాయర్ నిర్లక్ష్యానికి గురవుతోంది. రిజర్వాయర్ ముందు భాగంలో లోతైన పెద్ద గొయ్యి ఉంది. ఆది అత్యంత ప్రమాదకరంగా మారి ఊబి మాదిరిగా తయారైంది. అక్కడ చేరుకున్న వారికి దాని గురించి అవగాహన లేక నీటిలోకి దిగి అందులోకి దిగి చిక్కుకుని బయటపడలేక మృత్యువాత పడుతున్నారు. అలాగే రిజర్వాయర్ లోతు తెలియని వారు అందులోకి దిగి ఉబిలో చిక్కుకు పోయి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నప్పటికీ, సంబంధిత శాఖలు శాశ్వత భద్రతా చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, ఇనుప కంచెలు, లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లు, సీసీ కెమెరాలు, అత్యవసర సహాయక బృందాలు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం సందర్శకుల ప్రాణాలకు ముప్పుగా మారింది. ముఖ్యంగా జాతీయ రహదారికి సమీపంలో, విశాఖ నగరానికి అత్యంత చేరువలో ఉండటంతో ఇక్కడికి వచ్చే సందర్శకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రకృతి సౌందర్యంతో అలరారుతున్న గంభీరం రిజర్వాయర్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తే విశాఖ జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వ్యూ పాయింట్లు, వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, లైటింగ్, పార్కింగ్, భద్రతా సిబ్బంది, సందర్శకుల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ప్రమాదాలను కూడా నివారించవచ్చని సూచిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, సాగునీటి శాఖ, పర్యాటక శాఖ అధికారులు సమన్వయంతో స్పందించి గంభీరం రిజర్వాయర్ వద్ద శాశ్వత భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి భద్రత కల్పించడంతో పాటు విలువైన ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

## ఎన్ఏడి పరిధిలో పలు ప్రాంతాలలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాధవధార, ప్రభాతవార్త

ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్‌లో ఎన్ఏడి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషనల్ డివిజన్ జోన్-2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బికె నాయుడు శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఎన్ఏడి, శాంతినగర్, ఓల్డ్ కరాస, గణేష్ నగర్ ప్రాంతాలలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కేరాఫ్ అడ్రస్ 'సీసీఎం' : సీపీ శంఖ బ్రత బాగ్చి



విశాఖపట్నం, జూన్ 26: ప్రభాతవార్త

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో క్రూజ్ కలనరీ అకాడమీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ టూరిజం (సీసీఎ) కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి అన్నారు. సంస్థ పదేళ్ల ప్రస్థానం సందర్భంగా అక్కయ్య పాలెం నర్సింహానగర్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన "మీట్, డైన్ అండ్ అన్‌వైండ్" లంచెన్, ఫుడ్ ఫెస్టివల్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన అంతర్జాతీయ, ప్రాంతీయ వంటకాలను పరిశీలించి, వారి సృజనాత్మకతను అభినందించారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు గ్లోబల్ స్థాయిలో అద్భుతమైన డిమాండ్ ఉందని, ఇలాంటి ఈవెంట్స్ వల్ల విద్యార్థుల్లో లీడర్‌షిప్, టీమ్‌వర్క్ నైపుణ్యాలు పెరుగుతాయని సీపీ పేర్కొన్నారు. సీసీఎలో బిహెచ్ఎం, బిబిఏ చదువుతున్న విద్యార్థులందరికీ అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభించడంపై సీపీ హర్షం వ్యక్తం చేశారు. వీరంతా ఇంటర్న్‌షిప్ కోసం మారిషస్ వెళ్తుండటం పట్ల విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం సంస్థ ఎండి టెకీ ప్రభాకర్, మేనేజింగ్ పార్టనర్ అధిబా రూహి,ప్రిన్సిపల్ లోకేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్స రానికి సంబంధించి బిహెచ్ఎం, బిబిఏ, డిహెచ్ఎం, డిసిసిఎం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రకటించారు. జనరల్ మేనేజర్ శ్రీనివాస్, సోషల్ మీడియా నెట్వర్క్ ఇంచార్జ్ నేహా ప్రభ, హెడ్ చెఫ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 28న ప్రతిభకు ప్రోత్సాహం

### "దేశ "విదేశీ కళాకారులకు కళాజీవ పురస్కారాలు -అంతర్జాతీయ కళాకారులతో సాంస్కృతిక పసందు -60 మందికి మీడియా అవార్డులు -150 మంది జర్నలిస్టుల పిల్లలకు ఉపకారవేతనాలు

విశాఖపట్నం, ప్రభాతవార్త



స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, వైజాగ్ మీడియా అవార్డుల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన ఆదివారం జాతీయ, అంతర్జాతీయ కళాకారులు, మీడియా సోదరులను ప్రోత్స హిస్తూ "ప్రతిభకు ప్రోత్సాహం 2026 "పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్ర మం నిర్వాహక కమిటీ చైర్మన్‌లు గంట్ల శ్రీను బాబు, ఆర్.నాగరాజు పట్నాయక్‌లు తెలిపారు.. ఈ మేరకు వైజాగ్ జర్నలిస్టుల ఫోరం (వీజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో) శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ సిరిపురం వి.ఎం.ఆర్. డి.ఏ. చిల్డ్రన్స్ ఎరీనాలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ ..గుజరాత్, బెంగాల్, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన అంతర్జాతీయ కళాకారుల ప్రదర్శనలతో ఈ కార్యక్రమం ప్రారంభమవు తుందన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపుతున్న 60 మంది మీడియా ప్రతినిధులకు, 35 మంది కళాకారులకు కళాజీవ అవార్డులు ప్రధానం చేయడంతో పాటు150 మంది జర్నలిస్టుల పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్స్ అందించనున్నామన్నారు. విశ్వవ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తున్న శ్రేయశ, రాకేష్ ప్రజాపతి (ఆనంద్, గుజరాత్) వేరోనికా కమాని దశనాయక (శ్రీలంక)అలీఫ్ స్క్వాడ్ టీం (బంగ్లాదేశ్) సరిగమప లిటిల్ ఛాంప్స్ ఫైనలిస్ట్ మహాన్స్ సాయి రెడ్డి( హైదరాబాద్ )లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్ జానకి రెడ్డి (విశాఖ) ఆర్. హెచ్.టీనా, జి.డింపుల్, బి.పూజిత (విశాఖపట్నం)ల బృందం కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్త, అంతర్జాతీయ వాకర్స్ క్లబ్ సారధి అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు దేశ,విదేశాల్లో అందుకున్న డాక్టర్ కమల్ బెయిడ్‌కు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు 2026ను ప్రధానం చేయనున్నామని తెలిపారు.అదే విధంగా సాంకేతిక సౌకర్యాలు లేని సమయంలో కూడా "నగరదర్శిని" పేరిట సుమారురెండున్నర దశాబ్దాల క్రితం విశాఖ వాసులకు చక్కని క్వాలిటీతో వార్తా విశేషాలను అందించిన సిటీ కేబుల్ న్యూస్ ప్రజెంటర్ సినీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కుర్రా విజయ్ కుమార్‌కు ఎలక్ట్రానిక్ మీడియా లెజెండ్ పురస్కారాన్ని అందించనున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రజాపిత బ్రహ్మకుమారి బికె రామేశ్వరి.. వేరొనిక కమాని దస్సనాయక (శ్రీ లంక) శ్రేయషా, రాకేష్ ప్రజాపతి (గుజరాత్ )లు పాల్గున్నారు. ఈ సందర్బంగా ప్రతిభకు ప్రోత్సాహం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## ప్రతి శుక్రవారం పీజీఆర్ఎస్ : గంటా




విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త

ప్రతి శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మిథిలాపురి లే అవుట్‌లో బస్టాప్ స్థలం సహా ఓపెన్ స్పేస్ వీఎంఆర్డీఏ వేలం పాటలో అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ లేఅవుట్ ప్రజలు ఎమ్మెల్యేను కలిశారు. నగరంపాలెం నుంచి మల్లయ్యపాలెం వరకు ప్రతిపాదించిన 80 అడుగుల రోడ్డు విస్తీర్ణాన్ని 60 అడుగులకు తగ్గించారని, ఇక్కడ నలుగురికి పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ లు ఇవ్వాలని బాధితులు కోరారు. వాంబే కాలనీలో కొన్ని టీడీఆర్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తాత ఆస్తిలో తోబుట్టువులు తన వాటా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని పెదగదిలికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. 1వ వార్డులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆ వార్డులో సమస్యల గురించి విన్నవించిన స్థానికులకు గంటా తెలియజేశారు. సింహాచలం బీఆర్టీఎస్ రోడ్డు విస్తరణలో తమ స్థలాన్ని తీసుకున్న జీవీఎంసీ దాన్ని రోడ్డుగా చెబుతూ టీడీఆర్ నిరాకరిస్తోందని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని సింహాచలానికి చెందిన లోగిశ అనిల్ కుమార్ వినతి పత్రం అందజేశారు. తగరపువలస అంబేద్కర్ విగ్రహం చుట్టూ కడుతున్న బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని భీమిలికి చెందిన దండి వెంకటేష్ కోరారు. ఆర్టీసీ బస్సులు తగరపువలస నుంచి హైవేకి వెళ్లే అవకాశం పరిశీలించాలని ఆ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలోని పొట్నూరు మంచినీటి ట్యాంకు బాగు చేయాలని ఆ గ్రామానికి చెందిన రాము కోరారు.

## రోడ్డు ప్రమాదంలో జంగం జోషికి గాయాలు

ఆనందపురం, జూన్ 26, ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. నగరంలో గురువారం రాత్రి జరిగిన డాక్టర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న అయన అక్కడ నుంచి ఆటోలో ఆనందపురం వస్తుండగా, ఆయన ప్రయాణిస్తున్న ఆటో ఆనందపురం సమీపంలో ముందుగా నిలిచి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జోషి కుడి చేతికి తీవ్ర గాయం కాగా, ఎడమ భుజానికి కూడా గాయమైంది. ఆయన ప్రస్తుతం నగరంలోని ఏఎన్‌హెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జు నుజ్జు అయింది. కేసుని ఆనందపురం పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

## మత్తుపై బుచ్చెయ్యపేట ఖాకీల సమరభేరి

### వడ్డాది జంక్షన్‌లో విద్యార్థుల రణగర్జన

బుచ్చయ్య పేట, జూన్ 26, ప్రభాతవార్త




మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వడ్డాది జంక్షన్‌లో అవగాహన వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొని మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ సందర్భంగా పోలీసులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కొనసాగించాలని విద్యార్థులు, యువతకు సూచించారు. మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. అదేవిధంగా మహిళల భద్రత, మహిళలపై జరిగే నేరాల నివారణపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను నమ్మరాదని సూచించారు.ఏదైనా అనుమానాస్పద సంఘటనలు గానీ, సైబర్ మోసాలకు గురైన సందర్భాల్లో గానీ వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై పోరాటానికి సిద్ధం..

### జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కీలక తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న. వివి వామనరావు

విశాఖపట్నం, జూన్ 26, ప్రభాతవార్త

ఉద్యోగుల పెండింగ్ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రస్థాయి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం యూనియన్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు వి.వి. వామన రావు అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, సరెండర్ లీవ్ నగదు, హెల్త్ కార్డ్ బెనిఫిట్స్, పీఆర్సీ అమలు, ఐఆర్ ప్రకటన వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యంపై సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా కార్యాచరణ ప్రకటించాలని, వారు చేపట్టే ఉద్యమాలకు జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తీర్మానించింది. జీవీఎంసీలో మంజూరైన పోస్టుల్లో ప్రస్తుతం కేవలం 40 శాతం మంది ఉద్యోగులు మాత్రమే పనిచేస్తుండగా, మిగిలిన 60 శాతం ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కమిషనర్‌ను కోరింది. అలాగే మూడు సంవత్సరాలకు పైగా ఒకే స్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేసింది. యూనియన్ కార్యవర్గాన్ని రద్దు చేసి, పూర్తి స్థాయి కమిటీ ఎన్నికయ్యే వరకు తాత్కాలిక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. స్టీరింగ్ కమిటీ కన్వీనర్‌గా వి.వి. వామనరావు, జాయింట్ కన్వీనర్‌గా లంక భాస్కరరావును, స్టీరింగ్ కమిటీ సభ్యులుగా గొండు సీతారాం, గుమ్మడి నరసింగరావు, కాళ్ల శివ స్వామి నాయుడు, ఎన్ వి రమణ, వై సన్నిబాబు, కె. సురేష్, ఎ వెంకట్రావు, జి.వెంకునాయుడు నియామకం చేశారు. ఈ సమావేశంలో అక్కరబోయిన అప్పలరాజు, టి. శ్రీనుబాబు, కారి యల్లయ్య, బుద్దల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## గాజువాక సోషల్ మీడియా కన్వీనర్‌గా బొత్సా దిలీప్‌కుమార్

గాజువాక,జూన్ 26,ప్రభాతవార్త



గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా బొత్సా దిలీప్‌కుమార్ నియమితులయ్యారు. విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా, బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. సోషల్ మీడియా వేదికగా పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానన్నారు. తనకు ఈ పదవి దక్కేందుకు సహకరించిన సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు రాకేష్, గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావుకు కృతజ్ఞతలు తెలిపారు. తూర్పు, దక్షిణ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, నాయకులు బొత్సా సురేష్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## చలపతిరావు ఆశయ సాధనకు కృషి చేయాలి



గాజువాక,జూన్ 26,ప్రభాతవార్త

బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దివంగత పి.వి. చలపతిరావు ఆశయాలు, సేవా స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శనీయమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. చలపతిరావు 92వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని సాగరమాల ఆడిటోరియంలో 4వ స్మారకోపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. చలపతిరావు దేశభక్తి, నిస్వార్థ ప్రజాసేవ, విలువలతో కూడిన రాజకీయ జీవితం గడిపారని కొనియాడారు. ఇదే వేదికపై స్వాతంత్ర్య వీర సావర్కర్ జీవిత చరిత్రను విపులంగా వివరించారు. దేశభక్తి, సుపరిపాలన, ప్రజాసేవ అనే సిద్ధాంతాలతో ప్రజలకు మరింత సేవ చేయడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, గాజువాక అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ బొచ్చా దిలీప్‌కుమార్, అనకాపల్లి జిల్లా కార్యదర్శి రామానాయుడు, నాయకులు పి.నాగేశ్వరరావు, మద్ది కృష్ణారెడ్డి, వియ్యపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నరకంగా మారిన 'ఇందిరా కాలనీ' రహదారి

### అత్యవసర వాహనాలకూ తప్పని ఇబ్బందులు -పట్టించుకోని జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు

గాజువాక,జూన్ 26,ప్రభాతవార్త



జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని ఇందిరా కాలనీ నూకాలమ్మ ఆలయం సమీప రహదారి రోజురోజుకూ ఇరుకుగా మారుతోంది. రోడ్డుపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడం, ఆక్రమణలు పెరిగిపోవడంతో స్థానికులు తీవ్ర నరకాన్ని అనుభవిస్తున్నారు. రహదారికి ఇరువైపులా దుకాణదారులు రాళ్లు వేసి ఆక్రమించుకోవడం, ద్విచక్ర వాహనాలను నిలపడంతో కార్లు, ఇతర పెద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. చివరకు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు సైతం వెళ్లడానికి వీల్లేనంతగా రోడ్డు అస్తవ్యస్తంగా తయారైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టి, రోడ్డుపై పార్కింగ్ లైన్లు గుర్తించాలని.. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా వాహనాలు నిలిపేవారిపై కఠిన చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండండి

### ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలి -చదరం తులసిరామ్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచన



గాజువాక,జూన్ 26,ప్రభాతవార్త


గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉంటూ, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. జీవీఎంసీ 86వ వార్డు పరిధిలోని పలు రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గ నాయకుడు చదరం తులసిరామ్ మర్యాదపూర్వకం గా కలిసి పల్లాకు వినతిపత్రం సమర్పించారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమ స్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలన్నారు. ఎటువంటి వర్గ రాజకీయాలకు తావివ్వకుండా, యథావిధిగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలని హితవు పలికారు.

### మీ అడుగుజాడల్లోనే....

దీనిపై చదరం తులసిరామ్ స్పందిస్తూ.. గత 16 ఏళ్లుగా నియోజకవర్గంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల చెంతనే ఉంటున్నానని తెలిపారు. భవిష్యత్తులోనూ ఎటువంటి గ్రూపు తగాదాలకు పోకుండా, కేవలం ప్రజాసేవే పరమావధిగా పల్లా శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తానని హామీ ఇచ్చారు. వార్డులోని ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## దుర్గాభవాని అమ్మవారికి బంగారు శతమానాల సమర్పణ

ఆనందపురం, జూన్ 26, ప్రభాతవార్త:



ఆనందపురం ఎస్సీ, బీసీ కాలనీలో వేంచేసిన శ్రీ దుర్గాభవాని అమ్మవారి ఆలయంలో గురువారం భక్తి, శ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బంటుబిల్లి కల్లాలు గ్రామానికి చెందిన భక్తులు చందక అప్పలరాజు- రమణమ్మ దంపతులు అమ్మవారిపై ఉన్న అపార భక్తితో పావు తులం బంగారు శతమానాలను ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దాతృదంపతులు అమ్మవారి ఆశీస్సులు పొందారు. వారి దాతృత్వాన్ని కొనియాడుతూ ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొట్యాడ లక్ష్మణమూర్తి, ఆలయ అర్చకులు నాగరాజు, లెంక నరసింగరావు కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రజలకు ఓటు విలువను తెలియజేసిన జనసేన



(నక్కపల్లి/ అడ్డురోడ్డు,ప్రభాతవార్త)

మండలంలోని కాగిత గ్రామపంచాయతీ పరిధిలో ఓటు విలువ ప్రాధాన్యతని ప్రజలకు వివరించి చురుగ్గా గడువులోగా పూర్తి చేయాలని బిఎల్ఓలని కోరారు. నక్కపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగా సుధాకర్ రావు, ఉపాధ్యక్షులు రత్నాజీ, ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్, కార్యదర్శి దేవవరపు ఉమామహేశ్వరరావు, యర్రంశెట్టి సుభాష్, గుమ్మెళ్ళ వెంకటేష్, గుండిబిల్లి గంగేష్, పోతంశెట్టి వర ప్రసాద్, దేవవరపు వీరబాబు, కట్టా సతీష్ దేవవరపు రాజా, చిట్టిమూరి ధోనీలు పాల్గొన్నారు.

## సముద్రతీరంలో చేపలు చనిపోయిన సంఘటన రిపోర్ట్ బహిర్గతం చేయాలి .. సిపిఎం



నక్కపల్లి, ప్రభాతవార్త

మండలం లోని, రాజయ్య పేట పంచాయతీ, శివారు బోయపాడు సముద్రతీరంలో జూన్ ఇరవై తేదీ న టన్నులు కొలది చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకు వచ్చిన విషయంలో సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు చనిపోయిన చేపలు, సముద్ర జలాలు పరీక్షలకు పంపించిన నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ ఈ సంఘటన జరిగి వారం రోజులు అవుతున్నా నేటికి పరీక్షలు నిర్వహించిన రిపోర్టు అధికారులు ఎందుకు బహిర్గతం చేయలేదు, ఎవరును కాపాడటం కోసం ఈ రిపోర్టు బహిర్గతం చేయలేదు, ఎవరును మోసం చేయడానికి అధికారులు రిపోర్టు బహిర్గతం చేయకుండా ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే బహిర్గతం చేయాలని అప్పలరాజు డిమాండ్ చేశారు. గతంలో కూడా ఈ విధంగా చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకు వచ్చినప్పుడు సముద్ర జలాల్లో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉందని, వాతావరణంలో వచ్చిన మార్పులు వలన చేపలు చనిపోయాయని సంబంధించిన అధికారులు నివేదిక (రిపోర్టు)లు ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు కూడా వాస్తవాలు దాచిపెట్టి రసాయన కంపెనీ యాజమాన్యంను కాపాడటానికి అధికారులు ఈవిధమైన నిర్లక్ష్యం, ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రసాయనిక కంపెనీ ల వలనే ఇంత అనార్థం జరిగి చేపలు చనిపోయి మత్స్యకారులు ఉపాధి కోల్పోతుంటే, విదేశాల్లో, కాకినాడ జిల్లాలో ప్రజలు వ్యతిరేకించిన బల్క్ డ్రగ్స్ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు చేసి ఈప్రాంతంలో చేపలు చనిపోయి మత్స్యకారులు వృత్తికి, ఉపాధికి నష్టం కలిగించే విధంగా చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో మత్స్యకారులు ఉపాధి, మత్స్యకారుల మనుగడకు నష్టం కలిగించే విధంగా విధంగా ప్రభుత్వం పూనుకోవడం న్యాయం కాదని తెలిపారు. వెంటనే ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటును వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి ఎం.మహేష్ బాబు, మత్స్యకారుల సంఘం నాయకులు జీ.సోమేశ్వరావు, సిహెచ్ సోమేష్, బి.నూకరాజు, కె.దేముడు, సి.హెచ్.వీరబాబు, బి.అప్పలరాజు, కె.కాశీరావు, పి.రమణ, కె.కాశీ,సి.హెచ్.రాజు, పి.లోవరాజు, జీ.కాశీరావు, కె.నూకరాజు తదితరులు ఉన్నారు.

## బీచ్ తీరంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆరిలోవ, జూన్26, ప్రభాతవార్త



సాగర్ నగర్ బీచ్ లో బ్లైండ్ స్కూల్ ఎదురుగా ఒక గుర్తు తెలియని మృత దేహం లభ్యమైనట్లు ఆరిలోవ ఎస్సై వై.కృష్ణ తెలిపారు. మృతిని వయసు సుమారు 30 నుండి 35 సంవత్సరాలు ఉండవచ్చునని ఆచూకీ తెలిసినవారు 9490617918 నంబర్లో సంప్రదించాలని కోరారు. గుర్తు తెలియని మృత దేహంగా కేసు నమోదు చేసి సిఐ ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించామన్నారు.

## వైభవంగా విజయ దుర్గాదేవి వార్షికోత్సవ వేడుకలు

ఆరిలోవ, జూన్26,ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు దీన దయాళపురం ప్రజల ఆరాధ్య దైవం శ్రీ విజయ దుర్గాదేవి 15వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మీకు జాము నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి పల్లకి సేవ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామ అధ్యక్షులు యల్లమల్లి సురేష్, కార్యదర్శి ఖాదర్ బాషా, కోశాధికారి అనిల్ కుమార్, గౌరవ అధ్యక్షులు కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా అన్నిరకాల ఏర్పాట్లు చేశారు.

## నక్కపల్లిలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ



(నక్కపల్లి, ప్రభాతవార్త)

జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా, నర్సీపట్నం సబ్ డివిజన్ పోలీసు అధికారి (ఎస్‌డీపీఓ) పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నక్కపల్లి సిఐ జె.మురళి ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం నక్కపల్లిలో మాదకద్రవ్యాల నిర్మూలనపై భారీ డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ జె.మురళి, ఎస్ఐ కె.సన్నిబాబుల సారాధ్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, అంబేద్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ జాతీయ రహ దారిపైతో పాటు పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజలకు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయం, వినియోగం వంటి కార్యకలాపాలు చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలని వివరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన ఏవైనా అక్రమ కార్యకలాపాలు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలు ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండి, విద్య, క్రీడలు సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన విద్యార్థులు ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. "మాదకద్రవ్య రహిత సమాజం – మనందరి బాధ్యత", "డ్రగ్స్‌కు నో చెప్పండి", అనే నినాదాలతో భారీ అవగాహన ర్యాలీ ముందుగా సాగింది. ఈ సందర్భంగా నక్కపల్లి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ మాదకద్రవ్యాలకు సంబంధించిన ఏవైనా అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉషారాణి, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

बैंक ऑफ़ इंडिया Bank of India BOI ★ నర్సీపట్నం బ్రాంచ్ MJ78+ R36, రామారావుపేట, నర్సీపట్నం-531 116

**బంగారు రుణ గ్రహీతకు రుణాన్ని తిరిగి చెల్లించవలసిందిగా నోటీసు**

To, శ్రీమతి రుతాల వరహాలు, భర్త: చిన్నారావు, 32-131/1, కొత్తవీధి, నర్సీపట్నం, అనకాపల్లి జిల్లా-53116

డియర్ సర్/మేడమ్

విషయం: మా వద్ద మీకున్న బంగారు రుణ ఖాతా నం. 560577610022423 – మంజూరైన మొత్తం: రూ. 63,000/- ప్రస్తుత బకాయి మొత్తం: రూ. 81,115.22 + ఇప్పటి వరకు అయిన వడ్డీ (రూపాయలు ఎనభై ఒక్క వేల నూట పదిహేను మరియు ఇరవై రెండు పైసలు).

ది. 10-04-2023తేదీన, 17.80 గ్రాముల (గ్రాస్ వెయిట్) బంగారు ఆభరణాలు తాకట్టుగా ఉంచడం ద్వారా మా శాఖ మీకు రూ. 63,000/- (అక్షరాలా అరవై మూడు వేల రూపాయలు మాత్రమే) రుణాన్ని మంజూరు చేసింది. పైన పేర్కొన్న రుణం మరియు వడ్డీకి సంబంధించి, రూ. 81,115.22 మరియు ఇప్పటి వరకు అయిన వడ్డీని మీరు బ్యాంకుకు చెల్లించాల్సి ఉంది. కావున, 13-07-2026 నాటికి లేదా అంతకంటే ముందుగా మీరు ఈ బకాయిలను చెల్లించాలని కోరడమైనది; ఒకవేళ చెల్లించడంలో విఫలమైతే, బ్యాంకు తన బకాయిలను వసూలు చేసుకోవడానికి తాకట్టులో ఉంచిన ఆ బంగారు ఆభరణాలు లేదా అందులో తగినంత భాగాన్ని విక్రయిస్తుంది. ఆ అమ్మకం లేదా అమ్మకపు ప్రయత్నానికి సంబంధించిన ఖర్చులను మినహాయించిన తర్వాత మిగిలిన మొత్తాన్ని బ్యాంకు తన బకాయిల పూర్తి పరిష్కారం కోసం వినియోగిస్తుంది; ఒకవేళ ఏదైనా లోటు (తక్కువ మొత్తం) ఏర్పడితే, ఆ మొత్తాన్ని బ్యాంకు మీ నుండి వసూలు చేస్తుంది. 13-07-2026న లేదా ఈ ప్రయోజనం కోసం నిర్ణయించబడిన ఇతర తేదీన, మీకు ఎటువంటి తదుపరి నోటీసు ఇవ్వకుండానే బ్యాంకు ఆ బంగారు ఆభరణాలు/నాణేల అమ్మకాన్ని నిర్వహించవచ్చు.

ప్రదేశం: నర్సీపట్నం, తేది : 25-06-2026 సం/-బ్యాంక్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా

27-6Pg7exHMNWJQE.qxd:27-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:53 AM Page 1



## తెప్పపై విహరించిన సుందరరాజ స్వామి



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మ వార్షిక తెప్పోత్సవాల్లో శుక్రవారం సాయంత్రం పద్మ సరోవరంలో సుందరరాజ స్వామి తెప్పపై మూడు చుట్లు విహరించి భక్తులకు దివ్య దర్శనం ప్రసాదించారు. మధ్యాహ్నం స్వామివారికి పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం జరిపారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి, తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం సుందరరాజ స్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఎవిఎస్ఒ రాధాకృష్ణ, సూపరింటెండెంట్‌లు సురేష్, రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్ చలపతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తామని..
## రూ.2,16 లక్షలు నగదు మోసం

**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి 2,16 లక్షలు రూపాయలు మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తిరుపతికి చెందిన కె. వెంకన్న (51) కు సురేష్ రాజ్ అనే వ్యక్తి తనను బెంగళూరులోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్నానని పరిచయం చేసుకున్నాడు. బీటెక్ పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు ఇప్పించగలనని చెప్పి ఫిర్యాదుదారుడితో పరిచయం పెంచుకున్నాడు. తన కుమారుడు బీటెక్ పూర్తి చేశాడని ఫిర్యాదుదారుడు చెప్పగా, మమత శ్రీనివాస్ అనే ఒక మొబైల్ నంబర్ ఇచ్చాడు. ఆమెకు ఫోన్ చేయగా ఆ మహిళ తాను యాక్సెంచర్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నానని చెప్పి, ఫిర్యాదుదారుడి కుమారుడి రెజ్యూమ్‌ను పంపించాలని కోరింది. రెజ్యూమ్ పరిశీలించిన అనంతరం ఉద్యోగ ప్రక్రియలో భాగంగా వివిధ పేర్లతో వరుసగా అప్లికేషన్ ఫీజు, ప్రాసెస్ ఫీజు, ఆఫర్ లెటర్ ఫీజు, బ్యాంక్ అకౌంట్ ఫీజు, క్లయింట్ ఆఫర్ లెటర్ ఫీజు, మెడికల్ ఫీజు, ఆఫర్ లెటర్ రీజనరేషన్ ఫీజు తదితర పేర్లతో డబ్బులు చెల్లించాలని కోరారు. దీంతో వెంకన్న కుమారుడు నిందితురాలు మమత శ్రీనివాస్‌కు మొత్తం పది దఫాలుగా రూ.2,16,250లు బదిలీ చేశాడు. భారీగా డబ్బు మొత్తం అందుకున్న తర్వాత మమత శ్రీనివాస్ ఫోన్‌కు స్పందించడం లేదు. సురేష్ రాజ్‌ను సంప్రదించినప్పటికీ అతడు కూడా కాలయాపన చేస్తూ తప్పించుకోవడం ప్రారంభించాడు. దీంతో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఇద్దరూ కలిసి మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదుదారుడు గ్రహించాడు. అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సిఆర్‌పిఎఫ్ బలగాలు జప్తు చేసిన మావోయిస్టుల డంప్

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల డంప్ స్వాధీనం

### 24 లక్షల నగదుసహా ఆయుధాలు, పేలుడు పదార్థాలు లభ్యం

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్ నక్సలైట్ల ఏరివేతకు కేంద్రం చేబట్టిన ఆపరేషన్ కగార్ ముగిసినప్పటికీ మావోయిస్టుల కోస ం అటవీ ప్రాంతంలో వారు దాచివుంచిన డంప్‌లు, మందు పాతరలు, పేలుడు పదార్థాల కోసం కేంద్ర బలగాల వేట కొనసాగుతూనే వుంది. ఈ క్రమంలో ఛత్తీస్‌ఘడ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లా టెకా అటవీ ప్రాంతంలో నక్సలైట్ల కదలికలపై సమాచారం అందుకున్న సిఆర్‌పిఎఫ్ బలగా లు గురువారం ఉదయం నుంచి ముమ్మరంగా కూంబింగ్ చేబట్టారు. సిఆర్‌పిఎఫ్ పోలీసులకు తోడుగా జిల్లా సాయుధ పోలీసులు కూడా కూం బింగ్‌లో పాల్గొన్నారు. అయితే పోలీసుల రాకను గమనించి నక్సలైట్లు వెళ్లిపోగా పోలీసు జాగిలాలు ఒకచోట అదేపనిగా అరుస్తూ వుండడంతో అనుమానం వచ్చి పోలీసులు సోదాచేయగా మావోయిస్టుల డంప్ కనిపించింది. ఇందులో 24 లక్షల రూపాయల నగదుతోపాటు తుపాకులు, మందుగుండు సామాగ్రి లభ్యమయ్యింది. వీటిని సిఆర్‌పిఎఫ్ బలగాలు తమ స్థావరానికి తరలించారు. దీనిపై కేంద్ర హోంశాఖతోపాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీ సులకు సమాచారం అందించారు.

## సింగపూర్ కేంద్రంగా సైబర్ నేరాలు

### మ్యూల్ ఖాతాలు నిర్వహిస్తున్న నలుగురి అరెస్టు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** సింగపూర్ కేంద్రంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠాకు తెలంగాణలో మ్యూల్ ఖాతాలు అందిస్తూ సహకరిస్తున్న నలుగురిని సిటీ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి కేవలం ఒక సెల్‌ఫోన్ మాత్ర మే పట్టుబడింది. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి అరవింద్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్‌కు చె ందిన ఓ వ్యక్తిని గత ఫిబ్రవరి నెలలో మ్యాట్రిమోనియల్ టీం పేరిట సైబర్ నేరగాళ్లు యువతి తరహాలో మాట్లాడి బురిడి కొట్టించి ఇన్వెస్ట్‌మెం ట్ పేరిట కోటి 46 లక్షల రూపాయలను కాజేశారు. తాము సూచించిన కంపెనీల్లో పెట్టుబడులు పెడితే దండిగా లాభాలు వస్తాయని నమ్మించి న వీరు ఆ తరువాత బాధితుడి ఫోన్‌కు స్పందించడం మానేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. కాగా ఈ కేసులో సింగపూర్ కేంద్రంగా బడా సైబర్ క్రైం జరుగుతున్నట్లు తేలింది. అక్కడి ముఠాకు తెలంగాణలో పలు ప్రాంతాలలో మ్యూల్ ఖాతాలు అందిస్తున్న నలుగురు వున్నట్లు తేలింది. బాధితుడి నుంచి కాజేసిన రూ.కోటీ 46 లక్షలు ఇండియన్ ఓవర్‌సీస్ సహా పలు బ్యాంకుల నుంచి అనేక ఖాతాలకు మళ్లించినట్లు తేలడంతో మ్యూల్ ఖాతాలు కలిగిన వారిపై ఆరాతీయగా సిద్దిపేట్‌కు చెందిన చొక్కాల సంపత్(29), సికింద్రాబాద్‌కు చెందిన హెచ్చు నరేష్ (37), ఎండ్ల సురేష్ (43), వడ్కల మహేష్(33) గోల్‌మాల్ రట్టయ్యింది. ఈ నలుగురు సింగపూర్ నేరగాళ్లకు కమీషన్ తీసుకుని మ్యూల్ ఖాతాలను అందించినట్లు తేలింది. ఇందులో రూ.46.65 లక్షలు హైదరాబాద్‌లోని పలు బ్యాంకుల నుంచి లావాదేవీలు జరిగినట్లు తేలింది. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు నుంచి 35 లక్షల రూపాయలు బదిలీ అయినట్లు తేలింది. ఈ కేసులో చొక్కాల సంపత్ కీలక నిందితుడుగా తేలింది. ఇతను 30 శాతం కమీషన్‌పై నేరం చేయగా హెచ్చు నరేష్ 15 శాతంపై, ఎండ్ల సురేష్ పది శాతం, మహేష్ 10 శాతంపై ఖాతాలు అందించినట్లు తేలింది. కమీషన్ ద్వారా అం దిన డబ్బులను నిందితులు తమ అవసరాలకు వాడుకున్నారు. వీరి వద్ద నేరం చేసేందుకు వాడిన సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. ఈ కేసులో సింగపూర్‌లో వుండే ప్రధాన నేరగాళ్లతో పాటు భారత్‌లో వారికి సహకరించిన ఇతర నేరస్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# సింగపూర్‌లో క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం

**• ప్రతిభ చూపితేనే హైస్కూలులో మంచిసీటు • సీనియర్ టీచర్లు జూనియర్లకు గైడ్ చేస్తారు • మంత్రి లోకేష్ ఎదుట ఆసక్తికరమైన అంశాలను వెల్లడించిన టీచర్లు • టీచర్ల గౌరవాన్ని పెంచారంటూ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయులు**



**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** సింగపూర్‌లో అత్యంత విజ్ఞానవంతమైన, కఠినమైన క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం అమలులో ఉండటం వల్ల అక్కడ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారని సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన ఉత్తమ ఉపాధ్యాయులు మంత్రి లోకేష్‌కు తెలియజేశారు. సింగపూర్ టూర్‌కు వెళ్లిన ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి లోకేష్ నిర్వహించిన సమావేశంలో పలు ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు. అక్కడ ఉపాధ్యాయులు వారానికోసారి నిర్వహించుకునే సమావేశంలో సబ్జెక్ట్ వైజ్ డిస్కషన్, వారి మధ్య కోఆర్డినేషన్ బాగున్నాయని చెప్పారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుదలకే రాష్ట్రంలో మనం విలువల విద్యపై చాగంటి కోటేశ్వరరావు రూపొందించిన పాఠ్యాంశాలను ప్రవేశపెట్టామని చెప్పారు. తాను విద్యనభ్యసించిన స్టాన్‌ఫోర్డ్‌లో ఫైనల్ ఎగ్జామ్స్‌లో ఇన్విజిలేటర్లు ఉండరు, ఆనర్ కోడ్ ఉంటుంది, స్వీయ క్రమశిక్షణ వల్ల ఎవరూ అక్కడ కాపీయింగ్ వంటివి చేయరని అన్నారు. తల్లికి చెప్పలేని పని చేయొద్దన్న చాగంటి మాటలు తన మనసును హత్తుకున్నాయని చెప్పారు. భీమిలికి చెందిన హెచ్‌ఎం తిరుమల శ్రీదేవి మాట్లాడుతూ వెల్‌నెస్ అంబాసిడర్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ నియామకం వల్ల అక్కడ కెపాసిటీ బిల్డింగ్ బాగుంది, సీనియర్ టీచర్లు జూనియర్లకు గైడ్ చేస్తున్నారు, స్కూలు స్థాయిలో వెల్ బీయింగ్ కమ్యూనిటీస్, నెలకోసారి నిర్వహించే కాంప్లెక్ట్ మీటింగ్, స్ట్రెస్ మేనేజ్ మెంట్ వర్క్ షాపుల నిర్వహణ, టీచర్ ఎచీవ్‌మెంట్ సెలబ్రేషన్స్ వంటివి ఉపాధ్యాయులకు ప్రోత్సహకారంగా ఉన్నాయని చెప్పారు.

**ప్రతిభ చూపితేనే హైస్కూలులో మంచిసీటు:** ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ జాన్సన్ దేవరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రైమరీ స్కూల్ లెర్నింగ్ ఎగ్జామినేషన్‌లో మంచి మార్కులు సాధిస్తేనే విద్యార్థులకు 6వతరగతిలో దగ్గరగా ఉన్న స్కూలులో సీటు లభిస్తుందని చెప్పారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో అమలుచేస్తే బాగుంటుందన్నారు. దీనివల్ల అప్పర్ ప్రైమరీతోపాటు లోయర్ సెకండరీలో నాణ్యతా ప్రమాణాలు బాగుంటాయని అన్నారు. 7వ తరగతిలో కామన్ పరీక్షలు నిర్వహించే విధానాన్ని రాష్ట్రంలో 2007లో తొలగించారని చెప్పారు. దీనిపై మంత్రి లోకేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి తట్టుకోగలరా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని, దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందని తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన హెడ్ మాస్టర్ మోటా పార్వతి మాట్లాడుతూ సింగపూర్‌లో ఫ్యూచర్ ఫోకస్ ఎడ్యుకేషన్ అమలులో ఉందని, విద్యార్థులు స్కూలు నుంచే బయటకు వెళ్లే సమయానికి ఏదో ఒక స్కిల్‌తో వెళ్తున్నారని, దీనివల్ల చదువు పూర్తయ్యాక ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే పరిస్థితి అక్కడ లేదన్నారు. గుంటూరుకు చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ గుమ్మడి షీలా మాధురి మాట్లాడుతూ సింగపూర్‌లో విద్యతోపాటు క్రీడలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. తాను 2000 సంవత్సరంలో డిఎస్సీ స్పోర్ట్స్ కోటాలో టీచర్‌గా ఎంపికయ్యానని, ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3శాతం స్పోర్ట్స్ కోటా క్రీడలకు ప్రోత్సాహకరంగా ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మమ్మల్ని సింగపూర్ పంపి ప్రభుత్వ ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచారంటూ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ శాప్, ఏపీఏల ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించి, వైబ్రంట్ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. సింగపూర్ ప్రజల్లో కసి ఉండటం వల్లే ఒక మత్స్యకార గ్రామం ప్రపంచ ప్రఖ్యాతదేశంగా అభివృద్ధి చెందింది, మనలో కూడా అటువంటి కసి రావాలని అన్నారు.

**టీచర్లు పరిశ్రమల్లో కూడా 3నెలలు పనిచేయొచ్చు:** అనంతపురం జిల్లా పామిడికి చెందిన ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడుతూ సింగపూర్‌లో టీచర్ ట్రైనింగ్, గ్రేడింగ్ ఆఫ్ టీచర్స్ విధానాలు బాగున్నాయి, ప్రతిఏటా వందగంటల ఆన్ లైన్ శిక్షణను కంపల్సరీ చేయడం వల్ల ఏఐ వంటి అధునాతన కోర్సుల్లో టీచర్లు అప్ గ్రేడ్ కావడానికి అవకాశమేర్పడుతుందని అన్నారు. టీచర్లు మూడు నెలలపాటు తమకు ఆసక్తి ఉన్న పరిశ్రమలో పనిచేసే అవకాశం కూడా అక్కడ ఉందని తెలిపారు. శ్రీకాళహస్తి మండలానికి చెందిన స్కూల్ అసిస్టెంట్ ఎన్.సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ అక్కడ ప్రైమరీ సెకండరీ విద్యార్థులకు నిర్వహించే స్లిప్ టెస్ట్, మిడ్ ఇయర్ ఎసెస్ మెంట్ బాగుందన్నారు. మనవద్ద క్రియేటివిటీ, క్రిటికల్ థింకింగ్ అప్ గ్రేడ్ చేయాల్సి ఉందని తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ బండి శ్రీనివాసులు మాట్లాడుతూ అక్కడ ఫర్ ద టీచర్, బై ద టీచర్ విధానంతోపాటు అకాడమీ ఆఫ్ సింగపూర్ వారు నిర్వహించే సింపోజియం నిర్వహణ, మెంటరింగ్ విధానాల వల్ల టీచర్లు ఒత్తిడిలేకుండా బోధన చేయగలుగుతున్నారని తెలిపారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ సింగపూర్ వెళ్లిన టీచర్లు అద్భుతమైన సలహాలు ఇచ్చారు, మనవద్ద విద్యార్థి కేంద్రంగా సంస్కరణలు అమలుచేయాల్సి ఉంటుంది, అందువల్ల జాగ్రత్తగా అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన ఉపాధ్యాయుల ఇచ్చిన సూచనలను అమలు చేసేందుకు ఒక ప్రత్యేక మెకానిజం ఏర్పాటుచేసి, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని అన్నారు. సింగపూర్ ప్రస్తుతస్థితికి రావడానికి ఐదారు దశాబ్దాలు పట్టిందని తెలిపారు. ఇందుకు ఉపాధ్యాయుల్లో కమిట్ మెంట్, పట్టుదల కావాలి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన లీప్ యాప్‌ను కేవలం 2శాతం తల్లిదండ్రులు మాత్రమే డౌన్ లోడ్ చేసుకున్నారు, విద్యార్థులు కూడా తమ బిడ్డల భవిష్యత్తుపై బాధ్యత, శ్రద్ధ తీసుకుంటేనే వ్యవస్థలో మార్పు తేవడం సాధ్యమవుతుందని చెప్పారు.

## గ్రామీణులకు నాణ్యమైన వైద్యసేవలు అందించటంలో
# పిహెచ్‌సిల పాత్ర కీలకం

**• మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు • ఆత్కూరులో పిహెచ్‌సి భవనం ప్రారంభం**



ప్రాథమిక ఆరోగ్యకేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు

**ఉంగుటూరు(కృష్ణా), జూన్ 26 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందించటంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పాత్ర కీలకమని మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో ప్రభుత్వ, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్ సిఎస్‌ఆర్ నిధులు రూ.1.54కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను శుక్రవారం వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసూతిసేవలు, శిశుసంరక్షణ, రోగనిరోధక టీకాలు, అత్యవసర వైద్యసేవలు, ప్రాథమిక చికిత్స, అవసరమైన ల్యాబొరేటరీలు, ఆధునిక వైద్యపరికరాలు, మందులు వంటి సౌకర్యాలు అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైతే ఉన్నత వైద్యశాలలకు పంపించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, కూలీలకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించటం ఆరోగ్యకేంద్రాల బాధ్యతగా ఆయన పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. పూర్వకాలంలో ప్రజలు కాయకష్టం చేస్తూ ఆర్యోగకరమైన జీవితం గడిపేవారని, ప్రకృతిని ఆరాధిస్తూ చెట్లు, చెరువులు, నీటి వనరులను పరిరక్షించేవారని గుర్తుచేసారు. దేశంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్ధవంతమైన పాలన అందిస్తున్నారని కితాబిచ్చారు. ప్రజలకు ఉచిత పథకాలు ఇచ్చే బదులు గ్రామాల్లో రహదారులు నిర్మించి, అందరికి ఉచిత వైద్యం, విద్యను అందించటంతోపాటు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాలని ప్రభుత్వాలకు సూచించారు. ఆ ంధ్ర విశ్వవిద్యాలయంలో 800 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్న మంత్రి నారా లోకేష్‌ను ఈసందర్భంగా వెంకయ్యనాయుడు అభినందించారు. ఈకార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ ప్రతినిధి ద్వివేది, డియంఅండ్‌హెచ్ఒ డాక్టర్ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

**విద్యసమాజ వికాసానికి దోహదపడాలి:** విద్య ఉద్యోగానికే పరిమితం కాకుండా సమాజ వికాసానికి దోహదపడే విధంగా ఉండాలని, భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించే బాధ్యతను ప్రతివిద్యార్ధి తీసుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు సూచించారు. ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వృత్తివిద్యాకోర్సుల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్ధులతో వెంకయ్యనాయుడు శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విద్యతోపాటు, నైతిక, మానవీయ విలువలు పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో ఉంటూ దేశభక్తిని కలిగి ఉండాలని కోరారు. విద్యార్థులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**• ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి ముందస్తు భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలి: మంత్రి రవికుమార్**



**బల్లికురవ, జూన్ 26 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లాలో ఇటీవల వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై జిల్లా ఇన్‌ఛార్జి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. జిల్లాలో తరచుగా ప్రమాదా లు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని యాక్సిడెంట్ స్పాట్స్‌గా గుర్తిస్తూ అవసరమైన ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టా లని సూచించారు. రహదారులపై ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైనేజీలు ఏర్పాటు చేసి, వాహనదారులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యం గా రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన మంత్రి, భారీ వాహనాలు సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో రోడ్డుపై నిలిచిపోయిన సందర్భాల్లో, వెనుక నుంచి వచ్చే వాహనాలకు ముందు గానే హెచ్చరిక అందేలా వెంటనే భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీకి దిశానిర్దేశం చేశారు. అవస రమైతే ట్రాఫిక్ సిబ్బంది, క్రేన్లు, అత్యవసర సహాయక బృందాలను వెంటనే రంగంలోకి దించాలని పేర్కొన్నారు. మాచర్ల నగరవనం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబాలకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య చికిత్సపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న మంత్రి, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

ప్రజల ప్రాణ భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న మంత్రి, రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదాల సంఖ్య తగ్గించే దిశగా శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.




అనంతపురంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

# అనంతలో ఉద్రిక్తత

**• తాడిపత్రికి వెళ్లకుండా వైసిపి నేతలను అడ్డుకున్న పోలీసులు • రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేసిన వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి**

**అనంతపురం, జూన్ 26 ప్రభాతవార్త బ్యూరో:** టిడిపి నేతల దౌర్జన్యాలను నిరసిస్తూ తాడిపత్రిలో చేపట్టిన నిరసన దీక్షకు వెళ్లేందుకు ప్రయత్నించిన వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని పోలీసులు అడ్డుకోవడం అనంతపురం నగరంలో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల తీరును నిరసిస్తూ వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి ఇతర నేతలతో కలిసి రోడ్డుపై బైటాయించి పోలీసుల తీరును ఎండగట్టారు. వైసిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డితోపాటు పెద్ద ఎత్తున పార్టీ నేతలు శ్రేణులు సమావేశం అయ్యారు. అక్కడి నుంచి తాడిపత్రికి వెళ్లేందుకు సిద్ధం కాగా కార్యాలయం గేటు ఎదుట పోలీసులు బారికేట్లు పెట్టి వారిని నిలువరించేప్రయత్నం చేశారు. పోలీసు ఆంక్షలు, బారికేట్లను తొలగించుకుని బయటికి వచ్చిన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రత్యేక వాహనంలో కోర్టు రోడ్డులోని అనంత వెంకటరామిరెడ్డి నివాసానికి తరలించారు. అయితే పోలీసుల తీరును నిరసిస్తూ కోర్టు రోడ్డు ప్రధాన రహదారిపై జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ర్త్రాసంలో తాడిపత్రి నియోజకవర్గం లేదా, తాడిపత్రికి వెళ్లేందుకు ఇన్ని ఆంక్షలు ఎందుకంటూ పోలీసుల తీరును ప్రశ్నించారు. 43 ఏళ్ల నా రాజకీయ జీవితంలో పోలీసులు ఇంతగా దిగజారిన తీరును తొలిసారిగా చూస్తున్నానని మండి పడ్డారు. తాడిపత్రిలో మట్కా, గంజాయి విచ్చల విడిగా జరుగుతోందని వాటిని అడ్డుకోవడంలో పోలీసులు విఫలం అయ్యారని విమర్శించారు. తాడిపత్రిలో జెసి అనుచరులు పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలు చేస్తున్నారని మండి పడ్డారు. సీఎం చంద్రబాబు అండతోనే తాడిపత్రిలో అసాంఘీక శక్తులు రెచ్చిపోతున్నాయని విమర్శించారు. తాడిపత్రిలో అసాంఘీక కార్యకలాపాలను అడ్డుకట్ట వేసే ధైర్యం చంద్రబాబుకు లేదా అని ఆయన ప్రశ్నించారు. తాడిపత్రిలో వైసిపి నాయకులపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరుగుతున్నా పోలీసులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. మరోవైపు జెసి ప్రభాకర్‌రెడ్డి మా ఇళ్ల వద్దకు వస్తామని బెదిరిస్తున్న మాటలు ఎస్పీకి వినపడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అప్రజాస్వామిక విధానాలు, టిడిపి దాడులపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంగా మారుస్తామని మా పోరాటం ఇక ఆగదని ఆయన హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇంటి చుట్టూ ముళ్లకంచ చుట్టూ ఇళ్ల కంచె వేసి పోలీసులు అడ్డుకుంటున్నారని, తాడిపత్రిలో ప్రత్యేక ప్రతిపత్తి, ప్రత్యేక రాజ్యాంగం ఉందా అని ప్రశ్నించారు. తాడిపత్రిలో ప్రజాస్వామిక విధానాలపై పోరాడుతున్నామని కట్టడి చేయాల్సింది దాడులు చేస్తున్నవారిపై కాకుండా మాపై పోలీసులు కట్టడి చేస్తున్నారని విమర్శించారు. తాడిపత్రిలో ప్రజాస్వామ్య పరిరక్షణకు వైసిపి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని అక్కడి నుంచి తన నివాసానికి తరలించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్‌ఆర్‌సిపి ముఖ్య నేతలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

## లండన్‌లో తెలంగాణ విద్యార్థి అనుమానాస్పద మృతి



**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** లండన్‌లో కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్రీనాథ్‌రెడ్డి (25) లండన్‌లో రెండు రోజుల క్రితం అనుమానస్పదంగా మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం తెలంగాణకు చెందిన ఆ యువకుడు ప్రాణాలు కోల్పోయాడంతో తలమడ్ల గ్రామంలో విషాదం నెలకొంది. శ్రీనాథ్ గతేడాదే లండన్‌లో చదువుకోవడానికి వెళ్లినట్లు బంధువులు తెలిపారు. శ్రీనాథ్ తలితండ్రులు మధుసూదన్ రెడ్డి, మంజుల కుమారుడి మరణవార్త తెలియడంతో హృద విదారకంగా విలపించారు. శ్రీనాథ్ రెడ్డి లండన్ లోని లీసెస్టర్ యూని వర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతు న్నాడు .రెండు రోజుల క్రితం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన శ్రీనాథ్ రాత్రి అక్కడే నిద్రించాడు. తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నట్లు స్నేహితులు అక్కడే ఉన్న శ్రీనాథ్ బంధువులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తమ కుమారుడు ఇక తిరిగిరాడని శాశ్వతంగా ఈ భూమిపై నుంచి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. శ్రీనాథ్ మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని మంజుల మధుసూదన్‌రెడ్డి దంపతులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపం చేశారు.

## మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన

**ఇచ్ఛాపురం, జూన్ 26, ప్రభాతవార్త:**



ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.కృష్ణారావు, సిబ్బంది మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ప్రజలలో అవగాహన కల్పిస్తూ మానవహారం చేపట్టారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రిన్సిపాల్ పి.శిరీష వారితో కలిసి మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, నష్టాలు వివరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని, చెడు వ్యసనాలకు లోనై జీవితం నాశనం చేసుకోవద్దని, మీరు, మీ కుటుంబ సభ్యులు సమాజంలో గౌరవం కోల్పోతారని తెలిపారు. మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, ఎటువంటి సమాచారం తెలిసినా టోల్‌ఫ్రీ 1972 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.మంజుభార్గవి, బి.సాయిలక్ష్మి, ఎక్సైజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుండాలి

**రాజాం, జూన్ 26, ప్రభాతవార్త :**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం , అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జీఎంఆరఐటీ డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం ఎనఎసఎస్ సెల్, ఈగిల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం డోలపేట ప్రాంతంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జీఎంఆర్ఐటీ ప్రాంగణం నుంచి ప్రారంభమై డోలపేట చెక్‌పోస్ట్ జంక్షన్ వరకు కొనసాగింది. అక్కడ ఎనఎసఎస్ వాలంటీర్లు మానవహారం ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 'మాదక ద్రవ్యాలకు నో చెప్పండి', 'ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకుందాం', 'యువతే దేశ భవిష్యత్తు' వంటి నినాదాలతో నిర్వహించిన ర్యాలీ స్థానిక ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా చైతన్య పరుస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా. జి.శశికుమార్, ఫిజికల్ డైరెక్టర్ డా. బి.హెచ్.అరుణ్ కుమార్, ఎనఎసఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. కె.వి.ఎస్.ప్రసాద్, ఎనఎసఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. వి.ఢిల్లేశ్వరరావు, డా. పి.రవికుమార్, కె.సంతోషి, ఈగిల్ క్లబ్ సభ్యులు, ఎనఎసఎస్ వాలంటీర్స్, తదితరులు పాల్గొన్నారు.

## సత్యానికి, త్యాగానికి ప్రతీక మొహర్రం

### మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత



**ఆముదాలవలస, జూన్ 26 (ప్రభాతవార్త) :**

సత్యానికి, త్యాగానికి ప్రతీక మొహర్రం అని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. పట్టణంలో మసీదులో మొహర్రం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, మజిలీస్ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. సత్యం, న్యాయం, ధర్మ పరిరక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన కర్బాల అమరవీరుల ఆదర్శం యుగాయుగాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు మత పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వాసం, త్యాగం, సహనం, న్యాయం, అల్లాహో విధేయతకు ఈ మాసం ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీవీకే రాజు, న్యాయవాది తమ్మినేని అన్నంనాయుడు, నాగళ్ళ మురళీధర్, పాతిన రమణమూర్తి, జీడి ప్రసాద్, శిల్లా గురునాథ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## పలాస - కాశీబుగ్గలో సర్‌పై సమీక్షా సమావేశం

**పలాస, జూన్ 26, ప్రభాతవార్త:**



పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సర్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని బూత్ లెవెల్ ఏజెంట్లను సమావేశానికి ఆహ్వానించి, ఇప్పటివరకు సర్ కార్యక్రమం ప్రజల్లోకి ఎంతవరకు వెళ్లిందో, ఎంతమేరకు అప్లికేషన్లు వచ్చాయో నాయకులు సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లా పార్లమెంటరీ వైస్ ప్రెసిడెంట్, క్లస్టర్-1 కన్వీనర్ గాలి కృష్ణారావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్, యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు. సమావేశంలో సర్ కార్యక్రమాన్ని మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి బూత్ స్థాయిలో సమన్వయంతో పని చేయాలని నేతలు సూచించారు. చిన్న సమన్వయ లోపాలు ఉన్నా వాటిని పెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలని, పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో సర్ దరఖాస్తుల సేకరణను వేగవంతం చేయడంతో పాటు, ప్రతి ఏజెంట్ తన పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సమావేశంలో సూచించారు.

## ముమ్మురంగా ఉపాధి హామీ పనులు

**వంగర, జూన్ 26 ప్రభాతవార్త**

మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలకు అవసరం మేరకు ఉపాధి హామీ సిబ్బంది పనులు కల్పించడంతో పలు గ్రామాల్లో కూలీలకు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పనులు సక్రమంగా జరపడంతో ఉపాధి కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశాల్లో సిబ్బంది పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కనిపిస్తున్నారు. మరి కొంతకాలం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పిస్తూ మరింతగా వేగవంతం చేస్తే, కూలీలకు ఈ ఏడాది కొంతమేర ఉపాధి దొరికినట్లేనని చెబుతున్నారు. దీనిపై మండల, జిల్లా స్థాయి అధికారులతో పాటు, ప్రభుత్వం కూడా మరికొంత కాలం ఉపాధి కూలీలకు పనులు జరిగేలా చూడాలని పలు గ్రామాల్లో ప్రజలు, కూలీలు కోరుతున్నారు.

## సరిహద్దు చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేసిన ఐజీ



**ఇచ్ఛాపురం, జూన్ 26, ప్రభాతవార్త:**

విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి శుక్రవారం ఇచ్ఛాపురం పరిధిలోని పురుషోత్తపురం అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్‌లో అమలవుతున్న తనిఖీ విధానాలు, భద్రతా ఏర్పాట్లు, వాహనాల తనిఖీలను పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడిన ఐజీ, అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణా, నిషేధిత వస్తువుల తరలింపు, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని, ప్రతి వాహనాన్ని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సీఐ చిన్నంనాయుడు, టౌన్ ఎస్సై ముకుంద రావు, కవిటి ఎస్ఐ రవివర్మ పాల్గొన్నారు.

## వరి ఎదలో పి.ఎం.డి.ఎస్ విధానంతో చక్కని ఫలితాలు

### జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ

**సంతబొమ్మాళి, జూన్ 26, ప్రభాతవార్త:**



వరి ఎదలు వేసేటప్పుడు ప్రకృతి వ్యవసాయ విధానాల్లో అగ్రగామి అయిన పి.ఎం.డి.ఎస్ విధానంలో విత్తడం ద్వారా చక్కని ఫలితాలు సాధించవచ్చునని ఏ.పి.సి. ఎన్.ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ తెలిపారు. జొన్నలపాడులో శుక్రవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో రైతులనుద్దేశించి మాట్లాడారు. వ్యవసాయంలో రసాయన ఎరువులు, సస్యరక్షణ మందులు విచక్షణారహితంగా వాడడం వినియోగదారునికి ఆరోగ్యపరంగా పలు దుష్పరిణామాలకు కారణం అవుతుందన్నారు. లాభసాటి మరియు ఆరోగ్యవంతమైన ఆహారోత్పత్తికి ప్రకృతి వ్యవసాయంలోని పి.ఎం.డి.ఎస్ వంటి శాస్త్రీయమైన పద్ధతులు పాటించాలన్నారు. సంతబొమ్మాళి మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు, ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్లు ఉష, షణ్ముఖరావు, డివిజనల్ ట్రైనర్ శోభన్ బాబు, వి ఏ ఏ గణేష్, ప్రకృతి వ్యవసాయ విధానం ప్రతినిధులు వేణమ్మ, ఈశ్వరమ్మ, నీలవేణి, హేమలత, విజయ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**కోటబొమ్మాళి, జూన్ 26, ప్రభాతవార్త:**

కుజ్జిపేట గ్రామానికి వెళ్లే మార్గంలోని దాలిచెరువు వద్ద శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని ఎస్సై వి.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఉపాధిహామీ కూలీలు చెరువు పనులు వెళ్లే సరికి చెరువు గట్టుపై పడి ఉన్న మృతదేహాన్ని చూసి సంబంధిత ఫీల్డ్ అసిస్టెంటుకు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులకు తెలిపారని ఎస్ఐ తెలిపారు. మృతుడు 40 నుంచి 45 సంవత్సరాలు వయసు కలిగి ఉంటాడని, మెడకు ఒక టవల్ చుట్టి ఉందని, ముఖంపై చెవులు వెంబడి రక్తం మరకలు ఉన్నాయన్నారు. ఈ మేరకు మృతదేహన్ని స్థానిక ప్రభుత్వ అసుప్రతికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## శిమ్మ సోమేశ్‌ను పరామర్శించిన కెళ్ళి గోవింద్

**సంతబొమ్మాళి, జూన్ 26, ప్రభాతవార్త:**



సంతబొమ్మాళి ఎంపీటీసీ 2 ప్రతినిధి శిమ్మ సోమేశ్‌ను వైయస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కెళ్ళి జగన్నాయకులు (గోవింద్) శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం బారిన పడిన సోమేశ్ ఆసుపత్రి నుండి ఇంటికి రావడంతో వైసీపీ నాయకులతో కలసి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉన్నదని ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. అయనతో సంతబొమ్మాళి ఎంపీపీ ప్రతినిధి మేరుగు అప్పారావు, పిఎసియస్ మాజీ డైరెక్టర్ మార్పు నాగభూషణరావు, ఎంపీటీసీ అట్టాడ అప్పలనాయుడు, మండల ఆర్ టి ఐ అధ్యక్షులు ముద్దపు ఆనందరావు, వైసిపి నాయకులు కళింగపట్నం నాగరాజు, చమళ్ళ వెంకటరమణ, రెయ్యి అనందరావు, తదితరులు ఉన్నారు.

## కార్యకర్తల మనోభీష్టం మేరకే పార్టీ నిర్ణయాలు

### సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి

**కవిటి, జూన్ 26 ప్రభాతవార్త**



కార్యకర్తల మనోభీష్టం మేరకే పార్టీ నిర్ణయాలు ఇకపై ఉంటాయని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాడి సాంప్రసాద్ రెడ్డి ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నెలవంక పంచాయతీ కేంద్రంలో మాజీ ఎంపీటీసీ మండ తమ్మయ్య అధ్యక్షతన వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్ సమగ్ర ఓటర్ల జాబితా సవరణ గూర్చి సమీక్షించి వాటి ఆవశ్యకతను తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు ఇకపై న్యాయం జరుగుతుందని సమన్వయకర్త శ్యాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. నెలవంక మాజీ సర్పంచ్ ఏ ఏ బి అధ్యక్షులు డివో కృష్ణారెడ్డి మాట్లాడుతూ నెలవంక గ్రామపంచాయతీలో గత 40 ఏళ్లగా కార్యకర్తలను కాపాడుకుంటూ తెలుగుదేశం పార్టీని ఎదుర్కొంటు న్నామని టీడీపీ వారే కాక మన పార్టీ నాయకత్వం ద్వారా కూడా అనేక సమస్యలను ఎదుర్కొన్నామని తెలిపారు. శ్యాంప్రసాద్ రెడ్డి నాయకత్వంలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైయస్సార్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి ఉపాధ్యక్షులు పిఎసిఎస్ అధ్యక్షులు నత్తు నరేంద్ర యాదవ్‌తో పాటు పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఐతం రజతోత్సవ వేడుకల్లో 'ఆహ్లాద్-2కె 26' ప్రారంభం!



**టెక్కలి, జూన్ 26, ప్రభాతవార్త:**

టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాల రజతోత్సవ (సిల్వర్ జూబ్లీ) వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆల్ ఇంటర్ కాలేజ్ సాంస్కృతిక, సాహిత్య, సాంకేతిక, క్రీడా ఉత్సవం 'ఆహ్లాద్-2కె26' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు. కార్యక్రమాన్ని కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్. నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు, ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, ఐతం పూర్వ విద్యార్థి (అల్యూమ్ని) కళ్యాణ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఎల్.ఎల్. నాయుడు మాట్లాడుతూ, రజతోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆహ్లాద్--2కె 26 విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికగా నిలుస్తుందని అన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించి సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆహ్లాద్-2కె 26 కోఆర్డినేటర్ డా. డి.యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని, పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విభాగాధిపతులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎచ్చెర్లకు 'మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులం' మంజూరుపై హర్షం



**రణస్థలం, జూన్ 26, ప్రభాతవార్త:**

ఎచ్చెర్లలో ప్రతిష్టాత్మక 'మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల' మంజూరు కావడం పట్ల రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం రణస్థలం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది జిల్లాలకు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలను ఆమోదించడం శుభపరిణామమన్నారు. అందులో భాగంగా, వెనుకబడిన ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలోని ఎచ్చెర్ల మండలానికి ఈ పాఠశాలను కేటాయించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఎచ్చెర్ల ప్రాంత విద్యాభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదుటి ఈశ్వరరావులకు ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి, బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందనడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన కొనియాడారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్



**ఆముదాలవలస, జూన్ 26, (ప్రభాతవార్త):**

ప్రజా సమస్యల కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళీధర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపు మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకొని వెళ్తామని అన్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే రవికుమార్ ఉంటారని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని అన్నారు. ప్రజాపాలన దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కూన ఆంజనేయులు, నాగళ్ళ మురళీధర్, తమ్మినేని శ్రీనివాసరావు, పీవీకే రాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అపహరణకు గురైన చరవాణిను అప్పగించిన పోలీసులు

**రాజాం, జూన్ 26, ప్రభాతవార్త:**



రాజాం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల శెట్టి సురేష్, ధీరజ్ కుమార్, పేర్ల పవన్ కుమార్, కలిగి ఝాన్సీ, ఎర్ర శంకరరావు, బల్ల మహేష్ వివిధ గ్రామాలకు చెందినవారు గతంలో పోగొట్టుకున్న 6 మొబైల్ ఫోన్ల గురించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వాటిని సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి రాజాం పట్టణ సిఐ కె.అశోక్ కుమార్ పోగొట్టుకున్న చరవాణిలను యజమానులకి అప్పగించడం జరిగింది. ఎవరైనా తమ చరవాణి పోగొట్టుకున్నచో వారి చరవాణి బిల్లు, ఇన్వాయిస్, ఆధార్ కార్డు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

## పాత బస్టాండ్ ఆవరణలో అపారిశుద్ధ్యం



**రాజాం, జూన్ 26, ప్రభాతవార్త:**

రాజాం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పాత బస్టాండ్ ఆవరణలో అలాగే నవదుర్గ ఆలయం దగ్గరలో మోకాళ్ళ లోతు మురికి నీళ్లు చేరి పారిశుద్ధ్యం లోపించి నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అలాగే మురికి నీరు చేరి, చుట్టుప్రక్కల ప్రాంతమంతా దుర్గంధంతో, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆ ప్రాంతం చుట్టూ అన్ని రకాల కాయగూరలు రైతుల పంటల క్రయ విక్రయాలు ఆ మురుకి వాడలోనే జరుగుతున్నాయి. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి దుర్వాసన వెదజల్లే ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేసి, అదేవిధంగా మురికి నీరు నిల్వ ఉండకుండా చేసి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# శ్రీకాకుళం వార్త

## గిరిజనుల ఆర్థిక స్వావలంభనకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

### -రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, జూన్ 26 ప్రభాతవార్త:**



గిరిజనుల ఆర్థిక స్వావలంభనను పెంపొందించి, వారి జీవనోపాధిని మరింత బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.శుక్రవారం కోటబొమ్మాళిలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గానికి చెందిన గిరిజన మత్స్యకారులకు ఐస్‌బాక్సులతో కూడిన 23 రెండు చక్రాల మోపెడ్ వాహనాలను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కేంద్ర సహాయ ఉప పథకంను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. గిరిజన మత్స్యకారులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 16 సబ్‌ప్లాన్ మండలాల్లో భాగంగా జిల్లాలో మొత్తం 69 మంది గిరిజన మత్స్యకారులకు ఐస్‌బాక్సులతో కూడిన మోపెడ్ వాహనాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక కేంద్ర సహాయ ఉప పథకం కింద ఒక్కో యూనిట్ విలువ రూ.1,14,100 కాగా, అందులో 75 శాతం సబ్సిడీగా రూ.85,575 ప్రభుత్వం భరిస్తోందన్నారు. లబ్ధిదారులు కేవలం 25 శాతం, అంటే రూ.28,525 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. టెక్కలి నియోజకవర్గానికి మొత్తం 23 యూనిట్లు మంజూరు కాగా, నందిగాం మండలానికి 13, సంతబొమ్మాళి మండలానికి 3, టెక్కలి మండలానికి 7 యూనిట్లను పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. కోటబొమ్మాళి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆరఎఫ్) కింద టెక్కలి నియోజకవర్గానికి చెందిన 48 మంది లబ్ధిదారులకు రూ.38,71,000 విలువైన నగదు చెక్కులను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, మత్స్యశాఖ ఉపసంచాలకులు టి.సుమలత, సహాయ సంచాలకులు డి.గోపీకృష్ణ, టెక్కలి మత్స్య అభివృద్ధి అధికారి ధర్మరాజ్ పాత్రో, స్వర్ణగ్రామం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఏడాది మార్చి నాటికి భూసమస్యలు పరిష్కారం

### -మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, జూన్ 26 ప్రభాతవార్త:**



భూయజమానుల సమగ్ర భూ సమస్యలు వచ్చే ఏడాది మార్చి నాటికి శాశ్వత పరిష్కారం చూపాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు అన్నారు. టెక్కలి నియోజకవర్గంలో కోటబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయంలో దంత, కస్తూరిపాడు పంచాయతీ రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను శుక్రవారం మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామాల్లో దశల వారీగా సమగ్ర రీ సర్వే నిర్వహించి రైతుల ప్రధాన సమస్య అయిన భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి ఫోటో ముద్రించి పాసుపుస్తకాలు జారీచేసి వ్యవస్థలను భ్రష్టు పట్టించారని, వాటి స్థానంలో వారసత్వంగా సంక్రమించిన భూమిని యజమానులకు అధికారిక రాజముద్ర ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రీ-సర్వేలోని లోపాలను సరిదిద్ది, భూ యజమానులకు పూర్తి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. గత ప్రభుత్వం రీ సర్వే నిర్వహించి వివాదాలు లేని స్థలాలను కూడా అసంబద్ధ రీ-సర్వేతో వివాదాస్పదం చేశారని, అటువంటి సమస్యలన్నింటినీ పరిష్కరించి రైతులకు క్లీన్ టైటిల్స్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎమ్.కృష్ణ మూర్తి, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, పి ఎ సి ఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బోయిన సత్య శ్రీనివాస్, టీడీపీ సీనియర్ కార్యకర్తలు చల్ల సింహాచలం, సిమ్మ వెంకట రావు, తాసిల్దార్ ప్రసాద్, దంత, కస్తూరిపాడు వి ఆర్ ఓ లు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## అర్ధరాత్రి రెవిన్యూ అధికారుల ఇళ్లు కూల్చివేత నిర్ణయం

### వీరభద్రపురంలో ఉద్రిక్తత వాతావరణం

### నిర్మాణంలో ఉన్న ఇల్లు కూల్చివేత ప్రయత్నించిన రెవెన్యూ శాఖ

### ఇళ్లు కొంత భాగం కొట్టడంతో తహసీల్దార్‌ను ముక్తకంఠంతో నిలదీసిన గ్రామస్థులు



**పలాస, జూన్ 26, ప్రభాతవార్త:**

మండలంలోని వీరభద్రపురం గ్రామంలో రెవెన్యూ శాఖ అధికారులు నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిని కూల్చివేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన విమలకుమారి నిర్మించుకుంటున్న ఇంటిని రెవెన్యూ సిబ్బంది కూల్చివేయగా, దీనిపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల కథనం ప్రకారం గతంలో బమ్మిడి కృష్ణారావు పసుపు-కుంకుమ పథకం కింద తన చెల్లెలైన విమలకుమారికి ఈ స్థలాన్ని ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ స్థలంలో ఆమె ఇల్లు నిర్మించుకుంటుండగా, రెవెన్యూ అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసు లేదా లిఖితపూర్వక సమాచారం ఇవ్వకుండా కూల్చివేత చర్యలకు దిగారని ఆరోపించారు. అధికారులు రాత్రి వేళల్లో కూల్చివేత చేపట్టడాన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. రాత్రిపూట కూల్చివేతలు చేయడం ఏమిటి? కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఎలా ఇల్లు కూల్చేస్తారు?"అంటూ తహశీల్దార్ బి.శ్రీదేవిని గ్రామస్తులు నిలదీశారు. దీంతో గ్రామమంతా ఏకతాటిపైకి వచ్చి అధికారుల చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.శ్రీదేవి స్పందిస్తూ విఆర్వో ద్వారా నోటిమాటగా సమాచారం అందించామని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే,అధికారిక నోటీసులు లేకుండా కేవలం మౌఖిక సమాచారం ఆధారంగా కూల్చివేత చేపట్టడం సరికాదని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఘటన సమాచారం అందుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తమ నిరసనను తెలియజేశారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని,రెవెన్యూ శాఖ చర్యలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ ఘటన ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, రెవెన్యూ శాఖ చర్యలపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి తహసిల్దార్ సిబ్బందిని బయటకు పంపించి గ్రామస్తులకు సర్ది చెప్పారు.

**PASSPORT LOST**

I, KARI ASHOK. S/o Kari Murali, aged about 32 years, R/o D.No.9-13-10, Dammala Veedhi, Srikakulam mandal, Srikakulam district, Pin-532001, Andhra Pradesh, my passport bearing No.Y7707974, dt.03-10-2023 and the date of expiry is 02-10-2033 and CDC I further submit that on 20-06-2026, while I am travelling from My House to OBS Junction, in the meantime, my PASSPORT and CDC (CDC NO 108032) issue Date 20/09/2021, Expired Date 19/09/2031, was lost by me and the same could not be traced in spite of my best efforts and I was given complaint at 1 Town police station SHO, they are also searching,If any one find please inform to me the following address.

KARI ASHOK, S/o KARI MURALI
Dammala Veedhi, Srikakulam district
Ph: 9949419100

27-6Pg9th cheli 1.qxd:27-6Pg9th cheli 1.qxd 1/1/02 6:59 AM Page 1



# పూల ఆర్గంజా లెహంగాలు

ఫ్యాషన్ ఫ్యాషన్





రంగు రంగుల పూల డిజైన్లతో, తక్కువ బరువుతో ఉండే ఆర్గంజా లెహంగాలు భలే లుక్ ఇస్తాయి. అందుకే ఆ తరం, ఈ తరం అనే తేడా లేకుండా కాలేజీ అమ్మాయిల నుంచి నడివయసు వాళ్లవరకూ వీటిని వేసుకుని మురిసిపోతున్నారు. ఎంబ్రాయిడరీ, క్రిస్టల్, మిర్రర్, క్రష్డ్, శాటిన్.. అంటూ రకరకాల లెహంగాలు అతివల మనసు దోచేస్తున్నాయిప్పుడు. అల్లంత దూరాన ఉన్నా కూడా.. ఆకాశంలో తారల్లా మెరిసిపోతున్నారు. ఒకప్పుడు పెళ్లిళ్లు, వేడుకలంటేబ్రైట్, బోల్డ్ రంగులే. కానీ, ప్రస్తుతం మ్యూటెడ్, పేస్టల్ షేడ్స్ ఇష్టపడే వారి సంఖ్య పెరుగుతోంది. అందుకే ఈ పూల ఆర్గాంజా లెహంగా ఒక్కటన్నా ఉండాల్సిందే అనుకుంటున్నారంతా. ఇక ఫ్యాషన్ ప్రియుల సంగతి చెప్పనక్కర్లేదు. వాళ్ల వార్డ్‌రోబ్‌లో అయితే, ఆర్గెంజా లెహంగా తప్పక ఉండాల్సిందే. అందుకే హాల్దీ, మెహందీ, సంగీత్‌లకు మోడ్రన్‌గా కనిపించాలనుకుంటే ఫ్లోరల్ డిజైన్‌లను ఎంచుకుంటున్నారు ముద్దుగుమ్మలు. ఏ రిసెప్షనో, స్నేహితురాలి పెళ్లికో అయితే, కొంచెం గ్రాండ్‌గా బ్లౌజ్‌కూ, స్కర్ట్ బోర్డర్‌కూ జరీ, సీక్విన్స్ ఎంబ్రాయిడరీ లాంటివి చేయించి.. సందర్భమేదైనా ఫ్యాషనబుల్‌గా, హుందాగా ఉండడంతో పాటు సౌకర్యంగానూ ఉంటాయివి.





వీటి మీదకు మరీ హెవీ జ్యూయెలరీ అవసరం కూడా ఉండదు. కాబట్టి, మెడలో ఓ చిన్న చోకర్ వేసుకుని జుట్టు వదిలేస్తే చాలు. సింపుల్ లుక్‌లో మెరిసిపోతారంతే.

# కట్టె కాలే దాకా.. ఇక్కడే ఉంటా !!

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి 'గరీయసీ' అన్న శ్రీరామచంద్రుడి వాక్యాలను పుణికిపుచ్చుకున్నట్లుంది ఓ వృద్ధురాలు తన మాతృభూమిలోనే కాలం చెయ్యాలని ఆశపడ్తోంది. మమ్మూటికీ, అది పుట్టిన గడ్డ మీద మమకారమే. అందుకే తనకట్టె ఇక్కడే కాలాలని కోరుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో మధ్యలో మరో దేశ పౌరసత్వం పొందినా భారత్‌కి తిరిగొచ్చాక తాజాగా బాపట్ల కలెక్టర్ ముందు భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, దేశ చట్టాలకు కట్టుబడి ఉంటానని ప్రమాణం చేశారు. అమెరికా పౌరసత్వం కలిగిన ఓ భారతీయ వృద్ధురాలు ఇప్పుడు తన పౌరసత్వాన్ని వదులుకోవాలని నిర్ణయించుకోవడం స్వాగతించదగినది. ఇన్నాళ్ల తన జీవితకాలంలో జీవితపు లోతుపాతాలు, జీవనగమనంలో ఎగుడు దిగుడులను చవిచూసిన పాతగుంటూరు వాసి 94 ఏళ్ల



కొండ్రగుంట మహాలక్ష్మమ్మ తన జన్మభూమిని మరువలేక తనకు భారతీయ పౌరసత్వంలోనే తుదిశ్వాస విడవాలని ఆకాంక్షిస్తున్నారు. 2000 సంవత్సరంలో ఆమె అమెరికా పౌరసత్వం పొందారు. దాదాపు 18 ఏళ్ల పాటు తన సంతతి బాగోగులు చూసుకుంటూ అక్కడే ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితమే భారతదేశానికి వచ్చినా ఇప్పుడామె తనకు భారత పౌరసత్వమే ముద్దంటూ బాపట్ల కలెక్టర్‌ని కలిసి తనకు భారతీయ పౌరసత్వం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా, చినగంజాం మండలం చింతగుంపాల గ్రామానికి చెందిన, శ్రీమతి లక్ష్మమ్మ బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళిని కలిసి తన మనోగతాన్ని వివరించారు. ఆమె కుమారుడు వర్జీనియాలో స్థిరపడడంతో అక్కడికెళ్లాల్సి వచ్చింది.

# కాఫీ

వేగవంతమైన మన దైనందిన జీవితంలో కాఫీ అవసరం చాలా ఉందనే చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా 400 బిలియన్ కప్పుల కాఫీని రోజువారీ అవసరాల నిమిత్తమై వినియోగిస్తున్నారని అంచనా. కాఫీ అనేది శక్తినిచ్చే, ఉత్తేజాన్నిచ్చే, ఆరోగ్యానికి మద్దతు నిచ్చే ప్రయోజనకరమైన పానీయం. స్కూల్స్ ఆఫ్ ది వైజ్‌గా ప్రపంచంలో మొట్టమొదటి మాయాపానీయంగా కాఫీ షాపు ప్రారంభమైనది. మక్కాలో వీటని కవేకేన్స్ అంటారు. ఇది అరబిక్ పదం నుండి వచ్చింది. ఇది వైన్‌లాగా చేదుగా, నల్లగా ఉండడంతో దీన్ని వైన్ ఆఫ్ రబీ అని అంటారు. కాఫీ చెట్లు 3-9 మీటర్ల ఎత్తువరకు జూలై, ఆగస్టు నెలలో పెరిగే పచ్చదనాన్ని కల్గిన చిన్నాచెట్టు. ఇది దాదాపు 100 సంవత్సరాలు జీవిస్తాయి. 7-20 సంవత్సరాల మధ్య అధిక ఉత్పాదక శక్తిని కల్గి ఉంటాయి. తెల్లని పూలు, ఆకు పచ్చని పండ్లని కలిగి ఉండే కాఫీ మొక్కని కాఫీ చెర్రీస్ అంటారు.



సంత్సరానికి ఒక కాఫీ చెట్టు నుండి 2000-4000 కాఫీ బీన్స్ (10 పౌండ్లు) వస్తాయి. వీటిని మాగిన ఎర్రటికాఫీ చెర్రీస్ నుండి వేరుచేసి ఎండబెట్టి, వేడి చేసి, పొడిగొట్టి కాఫీ పౌడర్‌గా ఉపయోగిస్తారు. ఎర్రటి పండిన కాఫీ చెర్రీస్‌లో రెండు బీన్స్(కాఫీ గింజలు) ఉంటాయి. ఒక బీన్ అరుదుగా ఉంటే పీ బెర్రీ (స్పానిష్‌లో కారాకోల్/ నత్త) అంటారు. ఇవి తియ్యగా, రుచిగా ఉంటాయి.

**రకాలు :** వీటిలో 25-100 రకాల కాఫీ మొక్కలున్నాయి. వీటిలో ముఖ్యమైనవి 5 జాతులు అవి.

**కాఫీయా అరబికా :** ఇది 70% ఎత్తైన కొండ ప్రాంతాల్లో, వర్షపాతం అధికంగా ఉన్న ప్రాంతాల్లో పెరుగుతుంది. ఇవి ఎక్కువగా లాటిన్ అమెరికా, దక్షిణ ఈశాన్య ఉంటుంది. ఇది సర్వసాధార ణంగా పెరిగే మొక్క. **కాఫీయా రొబస్టా :** ఇది 30% దిగువ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాల్లో పెరుగుతుంది. ఇది అమెరికా, జపాన్, యూరోప్, బ్రెజిల్‌లో నుండి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడమైనది. సేంద్రీయ పద్ధతుల్లో గిరిజనుల చేత అరకులోయలో పండించిన కాఫీకి 'అరకు కాఫీ' అంటారు. వీటిలో కెఫిన్ కంటెంట్ 200చం ఉంటుంది.

**కాఫీయా లిబరికా :** దీన్నే లిబేరియన్ కాఫీ అంటారు. ఇది లెబేరియా, పశ్చిమ ఆఫ్రికా, ఇండోనేషియా, మలేషియా, ఫిలిఫ్ఫైన్స్ ఆసియాలో అరబికా, రోబస్టా కన్నా 20 మీటర్ల ఎత్తులో పెరిగే కాఫీ మొక్క. ఇది ఖరీదైనదే కాకుండా కెఫిన్ హాటెంట్ చాలా తక్కువగా 1.23 గ్రా/100 గ్రా ఉంటుంది.

**కాషీయా కానెఫోరా:** ఇది మధ్య, పశ్చిమ సహారా ఆఫ్రికాలో, టాంజానియా, బోర్నియో, జమైకా, అంగోలా, కోస్టారికా, బోర్నియోలో ఎక్కువగా పెరిగే సంకర జాతి మొక్క అని చెప్పబచ్చు. దీనిలో తక్కువ చక్కెర, 2.7% కెఫిన్ కల్గి ఉంటుంది.

**కాఫీయా ఎక్సెలా:** ఇది అరుదుగా 1903లో పశ్చిమ ఆఫ్రికాలోని సబ్‌ట్రోపికల్ ఏరియాలో ఉత్తర ఆసియాలో పెరిగే మొక్క. భారతదేశంలో నీడలో పండే ఆత్యుత్తమ భారతీయ కాఫీగా ప్రపంచ ఉత్పత్తిలో 4.5%గా, కాఫీ ఉత్పత్తిలో 7వ అతి పెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. మనదేశంలో కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆస్సాం మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువగా పండిస్తారు. కాఫీలో ఉండే కెఫిన్ ఆల్కలాయిడ్ సైకోఆక్టివ్ డ్రగ్ అని చెప్పవచ్చు. ఒక కప్పు కాఫీలో 6 కేలరీలుండి రక్త ప్రవాహంలో 30-45 నిమిషాల్లో చేరు తాయి. కాలేయం ద్వారా జీవక్రియ చేయబడి మూత్రంద్వారా విసర్జింపబడు తుంది. 4-6 గంటల్లో దీని ప్రభావం పోతుంది. ఇది సెరిబ్రల్ వాస్కు లార్ సిస్టమ్, దీని ప్రభావం పోతుంది. ఇది సెరిబ్రల్ వాస్కులార్ సిస్టమ్, రక్తపోటు, శ్వాసకోశ పనితీరు, గ్యాస్ట్రిక్, పెద్ద ప్రేగుకార్య కలాపాలు, కిడ్నీల పనితీరు, వ్యాయామంపై ఆధారపడి ఉంటాయి.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# కర్మ ఫలం

కౌండిన్య మహర్షి ఓసారి వైకుంఠానికి వెళ్లాడు. మార్గమధ్యంలో తాను చూపిన కొన్ని విచిత్ర దృశ్యాల గురించి శ్రీమహావిష్ణువు వద్ద ప్రస్తావించాడు. 'స్వామీ! ఒక మామిడిచెట్టు విరగ కాసింది. సమృద్ధిగా ఆకులు, ఫలాలున్నా దాని మీద ఒక్క పక్షీ లేదు. కొంత దూరం వచ్చాక ఓ ఆవు కనిపించింది. పచ్చని పొలంలో తిరుగాడుతూ కూడా.. అది గడ్డిని తినలేకపోతోంది. ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే గంతులేస్తున్న ఏనుగు, నేలపై దొర్లుతున్న గాడిద కనిపించాయి. వీటి అంతరార్థమేంటో బోధపడలేదు! మీరైనా చెప్పండి అన్నాడు. అప్పుడు ఆ వైకుంఠధాముడు మందహాసంతో మునివర్యా తమరు చూసిన మామిడి చెట్టు గత జన్మలో వేదవిద్వాంసుడు. అతడు పాండిత్యాన్ని తనవరకూ పరిమితం చేసుకున్నాడు. తన జ్ఞానాన్ని ఎవరితోనూ పంచుకోలేదు. అందుకే ఈ జన్మలో పక్షులువాలని చెట్టుగా మిగిలాడు. ఆ ఆవు పూర్వ జన్మలో బీడుభూమి ఎవరికీ ఉప యోగపడని కారణంగా, ఈ జన్మలో ఆకుపచ్చనిగడ్డి కళ్లెదురుగా ఉన్నా తినలేని దైన్యస్థితి లో ఉంది. ఏనుగు, గాడిదలు గతించిన జన్మలో విశృంఖల జీవనాన్ని గడిపిన ఉద్వేగ స్వభావులు. వారి తుంటరి తనం, దుడుకు ప్రవర్తనల వల్ల ఈ జన్మలో ఇలా గంతులేస్తూ, రంకెలేస్తూ బతికాల్సి వచ్చింది. పరులకు ఉప యోగపడని జీవమైనా, జడ పదార్థమైనా కర్మఫలాల్ని అనుభవించాల్సిందే అని వివరించాడు.

# వంకాయ పచ్చడి



**చింతపండు, ఆరేడు ఎండు మిరప కాయలు,** చెంచా ఆవాలు, రెండు చెంచాల మినపప్పులను వేయించాలి. వంకాయలను ఒవయ్యి మీద అటూ ఇటూ తిప్పుతూ కాలానచలి. చల్లార నిచ్చి.. పొట్టు తీసేసి, లోపలి గుజ్జును మెత్తగా మెదపాలి. అందులో కాస్త బెల్లం పొడి కలపాలి. మేయించిన ఆవాలు, మినపప్పు, ఎండు మిరప కాయలకు చింతపండు, ఉప్పు జోడించి నూరి.. వంకాయ గుజ్జులో కలపాలి. ఇది మిక్సీ పట్టువచ్చు. కానీ రోట్లో చేస్తేనే మరింత రుచి. తర్వాత పోపు దినుసులు, కరివేపాకు, ఇంటువలతో తాలింపు వేయాలి. అంతే ఘుమఘుమలాడే కమనమలి వంకాయ పచ్చడి సిద్ధం. రుచినీ, ఆరోగ్యాన్నీ అందించే ఈ పచ్చడి ఎప్పుడైనా చేసుకోవచ్చు. అయితే భోగి, రథ సప్తమి, ఏకాదశి, షష్ఠి వంటి తిథుల్లో కొందరు తరిగిన కూరగాయలు తినరు. అటువంటి సందర్భాల్లో చేసుకోవడానికి ఇది సులవైన వంటకం.

తెర

# 'తత్వం' ట్రైలర్ విడుదల



కొత్త కథలు, వినూత్నమైన కథలకు తెలుగు ప్రేక్ష కుల్లో మంచి ఆదరణ ఉం టుంది. సినిమా చూస్తున్నంత సేపు వాళ్లని ఎంగేజ్ చేయ గలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుం టుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశా లతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఎగ్జిక్యూటివ్ నిర్మాత భరత్ మాట్లాడుతూ ట్రైలర్ అందరికి నచ్చింది. ఈ సినిమాలో అన్ని ఎలిమెంట్స్ కుదిరాయి. అందరూ ఈ సినిమా కోసం ఎంతో సపోర్ట్ చేశారు. అర్జున్ కోలా ఈ రోజు కోసం ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నాడు. నిర్మాత వంశీ సీమకుర్తి మాట్లాడుతూ ట్రైలర్ అందరికి నచ్చింది. సినిమా కూడా చాలా బాగుంటుంది. దర్శకుడు అనుకున్నది అనుకున్నట్లుగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. మరో నిర్మాత శ్వేత పసుపులేటి మాట్లాడుతూ తత్వం టైటిల్‌కు తగ్గట్టుగా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఓ కొత్త సినిమాను చూశామన్నఅనుభూతికి లోనవ్తుతారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ ఈ మూవీ టైటిల్, కాన్సెప్ట్‌ను మన చుట్టు జరుగుతున్న ఇన్‌సిడెంట్స్ ఆధారంగా తయారుచేసుకున్నాను. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ ఇది. దినేష్ తేజ్ వినగానే వెంటనే ఓకే చేశాడు. హీరో దినేష్ తేజ్ మాట్లాడుతూ నేను కలిసి పనిచేయాలనుకున్న టెక్నిషియన్స్‌తో ఈ సినిమాలో వర్క్ చేశాను. ఈసినిమాతో చాలా మంది కొత్తవాళ్లు పరిచయం అవుతున్నారు. అందరం చాలా కష్టపడ్డాం. అది సినిమా చూసిన తరువాత అందరికి తెలుస్తుంది..

# 'రాజా ది రాజా' లవ్ సాంగ్ ఊహాలే సాంగ్ రిలీజ్



యూత్ ఫుల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన 'రాజా ది రాజా' చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తు న్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ సెకండ్ సింగిల్ ఊహాలే రిలీజ్ చేశారు. మార్క్ కె రాబిన్ ఈ సాంగ్ ని బ్యూటీఫుల్ లవ్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. కృష్ణకాంత్ (కేకే) రాసిన హృదయాన్నితాకే సాహిత్యం మరింత అందాన్ని తీసుకొచ్చింది. కార్తీక్, శ్వేతా మోహన్ తమ ప్లజెంట్ వోకల్స్‌తో పాటలోని ప్రేమ భావాలను ఎంతో ఆహ్లాద కరంగా ఆవిష్కరించారు. ఈ సాంగ్‌లో విజువల్స్ చాలా లావిష్‌గా వున్నాయి. రుత్విక్, విశాఖ ధిమాన్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి రవికిరణ్ బోయిడపు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ కుమార్ పసుపులేటి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రంలో సాయికుమార్, డాక్టర్ నరేష్ విజయకృష్ణ, అవసరాల శ్రీనివాస్, విష్ణు ఓయి, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, బద్రం, మైమ్ మధు, ఆనంద్ తదితరు లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రాజా ది రాజా జూలై 17న విడుదల కానుంది.

# 'రావు బహదూర్'కు మహేష్ బాబు ప్రశంసలు



సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్'ను, సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ తమ GMB ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై, A+S మూవీస్ , శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సమర్పిస్తున్నారు. వెంకటేష్ మహా రచన, ఎడిటింగ్, దర్శకత్వం వహిం చిన ఈ సినిమా గ్లింప్స్, టీజర్, పాటలు ఇప్పటికే సినిమా పై మంచి బజ్ క్రియేట్ చేశాయిఈ కథను మొదటి సారి విన్నప్పటి నుండే మహేష్ బాబు 'రావు బహదూర్' పట్ల ఎంతో ఆసక్తిని, ఎమోషనల్ ఎటాచ్మెంట్‌ని పెంచుకున్నారు. కేవలం సమర్పకుడిగానే కాకుండా, సినిమా ఆలోచన దశ నుండి పూర్తయ్యే వరకు దాని క్రియేటివ్ ప్రయాణాన్ని ఆయన దగ్గరుండి పర్యవేక్షి ంచారు. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచు కుంటూ, మహేష్ బాబు ఈ సినిమాను, రూపొం దించిన విధానాన్ని ప్రశంసించారు. (ట్విట్టర్)లో మహేష్ బాబు ఒక స్పెషల్ పోస్ట్ పెట్టారు "రావు బహదూర్... ఇది కేవలం ప్రేక్షకులను కట్టిపడేసే సినిమా మాత్రమే కాదు, వారి మనసులో లోతుగా ముద్ర వేసుకునే చిత్రం! విభిన్నంగా, అందంగా, ఇంటెన్స్ డ్రామాతో కూడిన సినిమా ఇది. దర్శకుడు వెంకటేష్ మహా ఒక అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించారు. వచ్చే వారం జూలై 3న విడుదల కానున్న ఈ చిత్రానికి మహేష్ బాబు మాటలు మరింత ఉత్సాహాన్ని, బలాన్ని చేకూరుస్తున్నాయి.



# 'ఇట్స్ లైఫ్ బ్రో' ఫస్ట్ లుక్ విడుదల

కేఎం (కృష్ణమోహన్), పూజా సుందర్‌శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ఇట్స్ లైఫ్ బ్రో'. కేఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సోమశేఖర్ రెడ్డి దర్శ కత్వంలో కృష్ణ మోహన్ సల్లగుండ్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎమోష నల్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రామిసింగ్ హీరో నితిన్ విడుదల చేశారు. దర్శ కుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ వైవిధ్య మైన కథ, కథనాలతో ఎమోషనల్ లవ్‌స్టోరీగా రూపొందుతున్న ఈ చిత్రం అందరి హృదయాలకు హత్తుకునే విధంగా ఉంటుంది. కృష్ణ మోహన్, పూజా సుందర్ శెట్టి, రాజీవ్ కనకాల, చమ్మక్ చంద్ర, అంబటి శ్రీనివాస్, దేవి ప్రసాద్, కిరీటి, త్రిశూల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే: ఇ.రాజయ్య. డీఓపీ: చైతన్య, సంగీతం: సాహిత్య సాగర్, ఎడిటర్: సత్య గిద్దుటూరి

# ఖుష్బూ కూతురి పెళ్లిలో ఖుషీ.. ఖుషీగా !

## టాలీవుడ్.. బాలీవుడ్ సీనియర్లంతా అక్కడే !

ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆమె పెద్ద కుమార్తె అవంతిక వివాహం గోవాలో అత్యంత వైభవంగా జరిగింది. చెన్నైకి చెందిన వ్యాపార వేత్త శ్రవణ్ శ్రీనివాసన్‌తో అవంతిక వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. గోవాలోని ఒక విలాస వంతమైన రిసార్ట్‌లో జరిగిన ఈ వేడుకకు పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వివాహ వేడుకలో టాలీవుడ్ సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ముగ్గురు కథానాయకులు తమ సతీమణులు సురేఖ, అమల, నీరజలతో కలిసి హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన ఈ తారలంతా నూతన దంపతులతో ఫొటోలు దిగి సందడి చేశారు. వీరితో పాటు బాలీవుడ్ నటులు అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, నటి త్రిష కూడా ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. దీంతో 80, 90ల నాటి తారలంతా ఒకే చోట చేరిన అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఖుష్బూకు టాలీవుడ్‌లోని ఈ ముగ్గురు అగ్ర హీరోలతో



మంచి అనుబంధం ఉంది. 'కలియుగ పాండవులు' చిత్రంతో వెంకటేశ్, ఖుష్బూ ఇద్దరూ దాదాపు ఒకే సమ యంలో కెరీర్ ప్రారంభిం చారు. ఆ తర్వాత నాగార్జునతో 'కెప్టెన్ నాగార్జున' చిత్రంలో ఆమె హీరో యిన్‌గా నటిం చారు. ఇక, చిరంజీవి నటించిన 'స్టాలిన్' సినిమాలో ఖుష్బూ ఆయనకు సోదరిగా కీలక పాత్ర పోషించారు. వృత్తి పరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా వీరందరి మధ్య స్నేహబంధం కొనసాగుతోంది. వెండి తెరపై ఒకరితో ఒకరు పోటీ పడినా, నిజ జీవితంలో మంచి స్నేహితులుగా మెలిగే చిరు, నాగ్, వెంకీ.. తమ స్నేహితురాలి కుమార్తె వివాహంలో ఇలా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# 'తెల్ల కాగితం' మెలోడీ గీతం విడుదల



'తెల్ల కాగితం' నుంచి మెలోడీ గీతం విడుదల.. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' అంటూ యంగ్ అండ్ టాలెంట్ నటుడు హర్ష్ రోషన్ వరుస విజయాలతో దూసుకుపోతోన్నారు. హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా 'తెల్ల కాగితం' అనే చిత్రంతో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మాణంలో రమేష్ బండ్రెడ్డి ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్‌లు, ఇతర కంటెంట్ సినిమా మీద అంచనాల్ని పెంచేసింది. "చిలకా'అంటూ సాగే ఈ పాటకు పూర్ణాచారి సాహిత్యం, అనురాగ్ కులకర్ణి గాత్రం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక విజయ్ బుల్గానిన్ బాణీ అయితే ఎంతో వినసొంపుగా ఉంది. ఈ చిత్రానికి ప్రతిభావంతుడైన రచయిత నందు సవిరిగన కథను అందించారు. 'సమజవరగమన' మరియు 'నారి నారి నడుమ మురారి' వంటి విజయవంతమైన చిత్రాలకు సహరచయితగా పనిచేసి ఆయన మంచి గుర్తింపు పొందారు.



# 'మా ఇంటి బంగారం' రెస్పాన్స్‌తో హ్యాపీ: సమంత

ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా"మా ఇంటి బంగారం. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ సినిమా జూన్ 19న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజై బ్లాక్ బస్టర్ అయ్యింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ థాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. సమంత మాట్లాడుతూ మా ఇంటి బంగారం సినిమాకు వస్తోన్న రెస్పాన్స్ చూసిన తర్వాత చాలా సంతోషంగా అనిపించింది. నాకు సింక్ కాలేదు. దీన్నే ప్రతి ఆర్టిస్ట్ కోరుకుంటారు. ప్రతి సినిమాతో బెటర్ కావాలి. పెర్ఫామెన్స్ బెటర్ కావాలని డ్రీమ్‌లాగా భావి స్తారు. ఈవిషయంలో నేను చాలా లక్కీగా భావిస్తాను. థియేటర్స్‌లో సినిమాను చూస్తుంటే సర్‌ప్రైజింగ్‌గా ఉంది. డైరెక్టర్ నందినీ రెడ్డి మాట్లాడుతూ రాజ్ కథను డిజైన్ చేసినప్పుడే అన్నీ వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఎలిమెంట్స్ ఉండాలనే ఆలోచనతో చేశారు. సమంత సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా పెట్టుకుని డిజైన్ చేశారు. సమంత ఎప్పటికీ స్పెషల్.. రాజ్‌గారు యాడ్ కావటం ఇంకా బలమైంది. ఓ బేబి సినిమా తర్వాత సమంత తో నేను చేసిన సినిమా. ఆమెలో కొత్త డైమన్షన్‌ను ఇందులో చూస్తారు. నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ మేం హిందీలో ఫ్యామిలీ మ్యాన్, స్త్రీ వంటి సబ్జెక్ట్స్‌ను ప్రేక్షకులకు అందించాం. అయితే మా ఇంటి బంగారం సినిమాకు వచ్చినంత రెస్పాన్స్ ఎక్కడా రాలేదు. మా వాళ్లంతా ఇప్పుడు నిద్ర లేచి.. ఎంత బాగా తీశావురా! అన్నారు. .

27vzm15:27vzm15.qxd 26-06-2026 23:34 Page 1



## చట్టబద్ధత పశువులు రవాణా ... రక్షణ కల్పించండి

విజయనగరం, జూన్ 26, ప్రభాతవార్త:




రాష్ట్రంలో చట్టబద్ధమైన పశువులు రవాణా వాహనదారులు పాడి రైతులు పశువులు కొనుగోలు అమ్మకం దారులు పశుసంతల నిర్వాహకుల తరుపున లీయగల్ లైవ్ స్టాక్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరఫున అధికారులకు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నాం. రైతులు రవాణా దారులు పశువు వ్యాపారులను. కొంతమంది అధికారులు దళారులు ఒక్కటే పశువులవ్యాపారుల వద్ద అక్రమ వసూళ్లు పాల్పడుతూ వ్యాపారులకు రైతులకు తీవ్ర అన్యాయాన్ని గురి చేస్తున్నారు. శ్రీకాకుళం విజయనగరం పార్వతీపురం తదితర జిల్లాల నుండి ప్రతిరోజు పశువులు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చట్టబద్ధంగా రవాణా చేయబడుతున్నాయి. ఈ రవాణా కోసం మేము ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన లైవ్ స్టాక్ వాహనాలు వినియోగిస్తున్నాం. మా వాహనాలు ట్రాన్స్పోర్ట్ ఆఫ్ యానిమల్రూల్ 1978 సెంట్రల్ మోటార్ వెహికల్ యాక్ట్ 1989 మార్గదర్శకాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రూపొందించబడ్డాయి వాహనాల్లో వెంటిలేషన్ డ్రైనేజ్ వ్యవస్థ తాగునీటి సౌకర్యం జంతువుల సంక్షేమానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించబడింది జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు ద్వారా జారీ చేయబడిన డివిజన్ రూల్స్ 96 వెటర్నరీ హెల్త్ సర్టిఫికేట్లు సంబంధించిన అధికారుల యొక్క అనుమతులు రవాణా శాఖ ధ్రువీకరణ పత్రం రాష్ట్రస్థాయి అధికారులు అనుమతులతోనే మేము పశువులను రవాణా నిర్వహిస్తున్నాము కేవలం చట్టబద్ధంగా అనుమతించబడిన ఎద్దులు గేదెలను మాత్రమే రవాణా చేస్తున్నాం. అయిన మా వాహనాలను కొంతమంది వ్యక్తులు అడ్డుకుంటున్నారు అలాగే అక్రమ వసూళ్లు కూడా చేస్తున్నారు. హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో ఈ అక్రమ వసూళ్లు చేసేవారు పశువుల రవాణాలను ఆపి డబ్బులు కట్టించుకునేవారు కానీ మేము ప్రభుత్వం నుండి పూర్తి అనుమతులు పొంది రవాణా చేస్తున్నప్పుడు ఎవరికి డబ్బు కట్టమని చెప్పి చెప్పడంతో వారు మా వాహనాల్లో అక్కడ ఆపి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారు అక్కడ ఉన్న జిల్లా సంబంధిత అధికారులు ఈ విషయాన్ని తీసుకొని వెళ్లి వారి కి ఫిర్యాదు చేశాం వారు అక్కడినుంచి మకాం మార్చి విజయనగరం జిల్లా నుండి మానాపురం టోల్గేట్ దగ్గరకి కేంద్రంగా మకాం మార్చారు. డబ్బులు కట్టకపోతే ఈ జిల్లాలో ఇబ్బందులకు గురిచేస్తామని కొంతమంది అధికారులతో కలిసి వారిని ప్రలోభాలకు గురిచేసి మాపై తప్పుడు కేసులు పెడుతున్నారు. లీగల్ గా రవాణా చేసే వాహనాన్ని కాకుండా రైతులను కూడా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు . ఈ విషయంపై ప్రభుత్వము అధికారులు స్పందిస్తే గాని మాకు రైతులకు న్యాయం జరగదు. ఈ విషయంపై అధికారులు చొరవ తీసుకోవాలి . మా వద్ద ఉన్న లీగల్ ట్రాన్స్పోర్ట్ పత్రాలన్నీ అధికారుల వద్ద చూపిస్తాం దానిలో ఏవైనా లోపాలుంటే వారి సరిచేసి మాకు అక్రమ ట్రాన్స్పోర్ట్ వసూల్ దారుల నుంచి న్యాయం చేయాలని కోరుతున్నారు ఈ కార్యక్రమంలో లీగల్ లైవ్ స్టాక్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మలిశెట్టి భరత్ రాఘవ పప్పు నవీన్ గింజల గణేష్ నానాజీ రొంగల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంపై ..

## అసత్య ప్రచారాలు మానుకోవాలి : చిన్న శ్రీను

విజయనగరం, జూన్ 26, ప్రభాతవార్త:



విజయనగరం రింగ్ రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరులసమావేశంలోవిజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, విజయనగరం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిర్మించబడిన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం 33 సంవత్సరాల లీజు ప్రాతిపదికన కేటాయించిందని స్పష్టం చేశారు. 2022 జూన్ 6న ప్రభుత్వం అధికారికంగా స్థలాన్ని కేటాయించగా, అనంతరం సంబంధిత శాఖల అనుమతులతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అన్ని నిర్మాణ అనుమతులు పొందిన తర్వాతే పార్టీ కార్యాలయ భవన నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేశామని తెలిపారు.ప్రస్తుతం పార్టీ కార్యాలయం ఉన్న స్థలం ప్రైవేట్ వ్యక్తులకు చెందినదంటూ కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆయన పేర్కొన్నారు. చట్టబద్ధమైన అన్ని అనుమతులతో నిర్మించిన భవనంపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు.భవనం నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయని వారు, ఇప్పుడు ఆకస్మికంగా వివాదాన్ని సృష్టించే ప్రయత్నం చేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలే ఉన్నాయని విమర్శించారు.అలాగే మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఈ స్థలం ప్రైవేటు వ్యక్తులకు చెందినదని ఫిర్యాదు చేశారంటూ వస్తున్న ప్రచారం కూడా ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నమేనని అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారాలు చేయడం బాధ్యతాయుతమైన రాజకీయాలకు తగదని పేర్కొన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే నిర్మించబడిందని, దీనిపై అసత్య ప్రచారాలు మానుకుని వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని చిన్న శ్రీను కోరారు.సమావేశంలో టిడిపి కార్యాలయం ఇప్పుడు ఉన్న అధికారులతో అనుమతుల పొందే ఇదే ప్రాతిపదికన నిర్మాణం చేపడతారు అన్నారు. ఏ పార్టీ అయిన ప్రభుత్వం అనుమతులు లేకుండా భవనాలు నిర్మించదు అన్నారు.వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడు బాబు , జిల్లా ప్రధాన కార్యదర్శి రవి , జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ జిల్లా అధికార ప్రతినిధి కనకల రఘు రామ్ పాల్గొన్నారు.

## బొబ్బిలి అన్న క్యాంటీన్‌లో ఎమ్మెల్యే బేబీనాయన పుట్టినరోజు వేడుకలు

బొబ్బిలి, జూన్ 26 ప్రభాతవార్త:



బొబ్బిలి మండల టీడీపీ అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కటింగ్. కంచేడువలస గ్రామానికి చెందిన డా॥ తాడ్డి సత్యనారాయణ పేదలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు.బొబ్బిలి శాసనసభ్యులు ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన)పుట్టినరోజు మొన్న బొబ్బిలి కోటలో ఘనంగా నిర్వహించారు.. కొందరు అభిమానులు వారి పుట్టినరోజు వేడుకలు ఇంకా జరుపుతూనే ఉన్నారు.. బొబ్బిలి "అన్న క్యాంటీన్" లో బొబ్బిలి మండలం టీడీపీ అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణలిబేబీ నాయన అభిమానుల మధ్య కేక్ కటింగ్ చేసి అన్న క్యాంటీన్ సిబ్బందికి, ప్రజలకు కేక్ పంచిపెట్టారు.. అలానే, మక్కువ మండలం, కంచేడువలస గ్రామానికి చెందిన డా॥ తాడ్డి సత్యనారాయణ"అన్న క్యాంటీన్" లో మధ్యాహ్న భోజనానికి డబ్బులు కట్టి, ప్రజలకు ఉచితంగా భోజనం పెట్టారు.. వారి కుటుంబసభ్యులంతా పాల్గొని, దగ్గరుండి ప్రజలకు భోజనం వడ్డించారు.

## పాచలవలసలో కోదండ రామాలయ ప్రతిష్ట మహోత్సవం

దత్తిరాజేరు, జూన్ 26, ప్రభాతవార్త :

మండలంలోని పాచ లవలస గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ కోదండ రామాలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఈనెల 29 30 జులై 1 తేదీలు అనగా సోమ మంగళ బుధవారాల్లో ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆలయ కమిటీ సభ్యులు సుమల గోవింద్ పాలూరి అప్పారావు గుసిడి జగన్నాథం గుసిడి వేణుగోపాల్ నాయడు తెలిపారు అర్చకులు రవి గురు స్వామి సమక్షంలో మంత్రచ్ఛన్నతో ప్రతిష్ట పూజా కార్యక్రమాలు చేపడుతారన్నారు సోమవారం ఉదయం 7 గంటలు నుండి రామాలయం ప్రతిష్ట పూజలు ప్రారంభం అవుతాయన్నారు ఆ రోజు ఉదయం 7 గంటలకు గణపతి పూజ మొదలుకొని రాత్రి వరకు అన్ని పూజా కార్యక్రమాలు జరిపిస్తారన్నారు మంగళవారం.ఉదయం.7 గంటల నుండి స్వామివారికి సుప్రభాతం ఆవాహిత సర్వదేవత మండపరాధన పూజలు జరిపి మధ్యాహ్నం 3 గంటల నుండి విగ్రహాల తిరువీధి అనంతరం జలాధివాసం క్షీరాధివాసం ధాన్యాధివాసం వంటి పూజా కార్యక్రమాలు జరిపించి స్వామివారికి.మంగళ హారతి ఇవ్వడం జరుగుతుందన్నారు బుధవారం స్వామివారికి విగ్రహ పూర్ణ కలశ ప్రతిష్టాపన పూర్ణ ఆహుతి కలశ హోమం గోముఖ దర్శనం అమ్మవారికి కుంకుమార్చన తర్వాత సీతా రాముని కళ్యాణం జరుపబడుతుందన్నారు తదుపరి గ్రామంలోభక్తులుకు అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు రామాలయ ప్రతిష్ట కార్యక్రమం మూడు రోజులు అంగరంగ వైభవంగా జరుగుతుంది కావున గ్రామంలో భక్తులందరూ పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందుతారన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

గరివిడి, జూన్ 26, ప్రభాత వార్త:



ఈ నెల 28 న నిర్వహించే పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని గరివిడి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కోరారు. మండలం లోని కోనూరు పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ పి.విష్ణు బాలాజీ,బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అనీల్, గరివిడి పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి లు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏ ఎన్ ఎం, ఎం ఎల్ హెచ్ పి, ఆశ వర్కర్లు, సూపర్ వైజర్ లు, వైద్య సిబ్బంది తో పల్స్ పోలియో కార్యక్రమం పై ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కి 28 పల్స్ పోలియో విజయవంతం పై దిశా నిర్దేశం చేశారు. ఇంటి ఇంటికి వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బంది పాటుపడాలన్నారు.

## మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై కళాజాత

గరుగుబిల్లి, జూన్ 26, ప్రభాత వార్త:



మత్తు పదార్థాల నిర్మూలనకు, మత్తు పదార్థాలు వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై మండల పరిధిలోని ఎర్రన్నగుడి జంక్షన్లో బుధవారం మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈమేరకు మండల పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ షేక్ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల నిర్మూల నలో భాగస్వామి కావాలని, అలాగే మీ చుట్టుపక్కలగాని, ఎవరైనా మత్తు పదర్థాలు రవాణా, అమ్మకం, విని యోగం గురించి ఎటు వంటి సమా చారం వున్నా పోలీస్ స్టేషన్ లేదా టోల్ ఫ్రీ 1972 కు గాని, 112కు సమాచారం అందించా లని అధికారులు ఎస్ ఐ షేక్ ఫక్రుద్దీన్ కోరారు. ఈకార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అన్నెం బాల్జీరావు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతన్నా.. మీకోసం కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

గరుగుబిల్లి, జూన్ 26, ప్రభాతవార్త:



మండల పరిధిలోని రావుపల్లి గ్రామం లో రైతన్నా... మీకోసం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను పార్వతీ పురం మన్యం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి టి. భవానిశంకర్ తో పాటు, గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), మండల వ్యవసాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జోత్స్న తదితరులు ఆవిష్కరించారు. అనంతరం వాతావ రణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పండించాల్సిన పంటల గురించి వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేశారు. రసాయన ఎరువులు వినియోగం తగ్గించి సేంద్రియ వ్యవ సాయ పద్ధతులతో పంటలు పండించా లని రైతులకు సూచించారు. ఈఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల వర్ష పాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు మేరకు రైతులు పంటలు పండించాల్సి ఉందని వెల్లడించారు. ప్రభుత్వం వ్యవ సాయాన్ని లాభసాటిగా మార్చేందుకు మరియు రైతులకు అవగాహన కల్పించేందుకు 'రైతన్నా.. మీకోసం' అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని.. ఈమేరకు ఈకార్యక్రమం ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు నేరుగా రైతుల ఇళ్లకు వెళ్లి వారికి పలు అంశాలపై అవగాహన కల్పిం చడం జరుగుతుందని తెలియజేశారు. ఎల్ నినో ప్రభావం వలన వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ కాలంలో పండే పంటలు ఎంచుకోవాలని అదే విధంగా తీసు కోవలసిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ముఖ్యంగా ఎల్. నినో పరిస్థితుల్లో నీటి నిర్వహణ సరి అయిన పంట ఎంపిక తక్కువ కాలం పంటలు తీసుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేశారు.

## శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాల జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్

సాలూరు, జూన్ 26, ప్రభాతవార్త :



సాలూరు పట్టణ శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం ఎంతో ప్రతిష్టాత్మకంగా దివీస్ ఫార్మా కంపెనీ వారు నిర్వహించిన జాబ్ మేళా విజయవంతం అయింది.అలాగే ఈ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌కు 120 మందికి పైగా అభ్యర్థులు హాజరుకాగా వారిలో 101 మందిని ఎంపిక అయ్యారు.దీంతో స్థానిక యువత ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం అవ్వడంతో కళాశాల చైర్మన్ కొల్లి స్వాములు,ప్రిన్సిపల్ జి.భాస్కరరావు,ఎంపికైన అభ్యర్థులను ఇంకా దివీస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులను కూడా అభినందించారు.

## గవర్నర్ అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపిన రవిశేఖర్ దంపతులు

నెల్లిమర్ల, జూన్ 26, ప్రభాతవార్త:



గోవా రాష్ట్ర గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు కు టిడిపి సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి సువాడ వనజాక్షి దంపతులు శు క్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అశోక్ బంగ్లా లో ఉన్న అశోక్ గజపతిరాజు ను రఘు శేఖర్ వనజాక్షి దంపతులతో పాటు పార్టీ నెల్లిమర్ల మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్ తదితరులు అశోక్ గజపతి రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకుల గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, దంతులూరి అజయ్ బాబు, పోతల రాజప్పన్న, నల్లం శ్రీనివాసరావు, కింతాడ కళావతి, పంచాది సూరినాయుడు , తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రహదారికి ఎట్టకేలకు మోక్షం

పాచిపెంట, జూన్ 26, ప్రభాతవార్త :



మండల కేంద్రమైన పాచిపెంట ముక్క ద్వారంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెళ్లే రహదారి కి ఎట్టకేలకు క్వారీ బుగ్గి తో నింపడంతో రోగులకు రాకపోకలకు మోక్షం కలిగింది. టిడిపి సీనియర్ నేత మరియు ఏఎంసీ డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు, చొరవ తీసుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెళ్లేరహదారి కంపు కొడుతుంది అన్న విషయం పలువురు ఆయనకు చెప్పడంతో ఆయన సొంత డబ్బులు ముందుగా పెట్టుబడి పెట్టి ఈ రహదారి గుండా రోగులు రాకపోకలకు సౌలభ్యం కల్పించారు. నిల్వ అయినమురికి నీరును తొలగించి రహదారిలో క్వారీ బుగ్గి బ్లేడ్ ట్రాక్టర్ తో నింపి వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర రహదారికి దిగివ ఉండడం ప్రధాన రహదారి ఎత్తుగా ఉండటం వల్ల ప్రధాన రహదారి నుండి వచ్చిన నీరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రహదారికి చేరి నిలిచిపోవడంతో వర్షాకాలంలో రోగులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. ఏఎంసి డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న రాచవీధి ప్రజలు రోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో రోజులుగా రహదారి సమస్యతో బాధపడుతున్న రాచవీధి ప్రజలు నిత్యం అనారోగ్యంతో బాధపడుతూ మండలంలో గల వివిధ గ్రామాల నుండి వచ్చిన రోగులుకు ఎట్టకేలకు పీహెచ్సి రాకపోకలు సూగమనం అయ్యిందని పలువురు తెలిపారు.

## మొక్కలు నాటండి .. పర్యావరణాన్ని కాపాడండి

బొండపల్లి , జూన్ 26, ప్రభాతవార్త :



మొక్కలు నాటడం ద్వారా ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడాలని బొండపల్లి ఎస్సై యు. మహేష్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రం గావించడంతోపాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## తేలిక నేలల్లో వరి, పత్తి సాగుచేయవద్దు

రామభద్రపురం, జూన్ 26, ప్రభాత వార్త :




ఎలినినో ప్రభావం వల్ల వర్షపాతం హెచ్చుతగ్గులు కావడం వల్ల ఈ ఏడాది తేలిక నేలల్లో వరి, పత్తి సాగుచేయవద్దని వ్యవసాయశాఖ ఏడీ మంచికంటి మధుసూదన రావు తెలిపారు. మండల పరిధిలోని జన్నివలస గ్రామంలో గురువారం ఆత్మా సౌజన్యంతో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తగిన యాజమాన్య పద్దతులు తీసుకొని పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు వి నియోగించుకోవాలని కోరారు. సేంద్రీయ పంటల సాగుపైనే రైతులు అవగాహన పెంపొందించుకోవా లన్నారు. రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారి పి.నిర్మలా మాట్లాడుతూ నానో ఎర ఎవులు, జీవన ఎరువులను ప్రోత్సహించాలని సూచించారు. మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు చేసి పంటలు సాగుచేయాలన్నారు. రైతు పథకాలపై పూర్తి అవగాహన పెంపొందించ ఎకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమరా శివ, వ్యవసాయ సిబ్బంది పి. వెంకటరమణ, పి.సతీష్, యు. స్వాతి, రైతులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
25
వార్త

## పెద్దగెడ్డ కాలువ డి. సిల్టింగ్ పనులు ప్రారంభం

పాచిపెంట, జూన్ 26, ప్రభాత వార్త :



గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చొరవతో పాచిపెంట పెద్దగెడ్డ జలాశయ కాలువలో డి.శిల్టింగ్ పనులను నీటి సంఘం చైర్మన్ ప్రతినిధి గుంగ్రోతు గంగరాజు, టీడీపీ నాయకులు శుక్రవారం కొబ్బరికాయ కొట్టి డి సిల్టింగ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మతల బలరాం, స్థానిక ఎంపీటీసీ పల్లేడ ఉమామహేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు మాట్లాడుతూ.. 10 కిలోమీటర్ల వరుకు పూడికలు తొలగిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుండి రైతు సంక్షేమ ధ్యేయంగా సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి పని చేస్తున్నారని ఈ సందర్భంగా స్పష్టం చేసారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాకోటి పాపారావు, ఆకులు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు విలువ గొప్పది : జిల్లా వైసీపీ ప్రచార అధ్యక్షుడు వలిరెడ్డి

చీపురుపల్లి, జూన్ 26, ప్రభాతవార్త :



రాజ్యంగం లో ఓటు విలువ చాలా గొప్పది అని, ఆ విలువను రక్షించుకునే బాధ్యత ప్రతి సామాన్యుల పైన ఉన్నదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార అధ్యక్షులు వల్లి రెడ్డి శ్రీనివాస నాయుడు పిలుపునిచ్చారు. సర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని 146, పోలింగ్ బూత్ పరిధిలో ప్రోగ్రాం ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ వెరిఫికేషన్ ప్రక్రియలో బి ఎల్ ఓ లతో బి ఎల్ ఎ లు కోర్దినేషన్ చేసుకోవాలి అని ఆయన అన్నారు. ప్రతి ఓటు విలువైనది అని అర్హత వున్న ఏ ఒక్కరి ఓటు కూడా తొలగించకుండా చూడాలి అని అన్నారు, ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిభందనలు ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఓటర్లు కూడా ప్రతి బూత్ లో మీ ఇంటికి వచ్చిన అధికారులకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఓట్లు ఉన్నాయో లేదో తప్పనిసరిగా తెలుసుకోవాలని కోరారు, కార్యక్రమంలో జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బి ఎల్ ఓ గోవిందా, బిఎల్ఎ రాజు,వైస్సార్ పార్టీ నాయకులు కర్రోతు ప్రసాద్, రేవల్ల సత్తి బాబు, రౌతు పైడిరాజు, గవిడి కల్కి జీవన్, రామగురువులు,ధన్నాన సత్యం,కోట్ల రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం : డి.ఎస్.పి

చీపురుపల్లి, జూన్ 26, ప్రభాతవార్త:



డ్రగ్స్ రహిత నిర్మూలనతో నూతన సమాజం కీర్తి సాధించాలని చీపురుపల్లి డి.ఎస్.పి.ఎస్ రాఘవులు యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు చీపురుపల్లి పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల మరియు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు విద్యార్థినీ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. చీపురుపల్లి పోలీసు అధికారి (ఎస్‌డీపీఓ) శ్రీ ఎస్. రాఘవులు ఆధ్వర్యంలో చీపురుపల్లి త్రీ రోడ్స్ జంక్షన్ వద్ద మాదక ద్రవ్యాలు, గంజాయి తదితర మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవీఆర్ వినియోగంతో యువత కుటుంబాలు సైతం రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా యువత ఉన్నత భవిష్యత్తును ఎంపిక చేసుకొనుటకు క్రీడలు, పాటలు పట్ల దృష్టి సారించాలని యువత ఎన్నుకునే మార్గం సమాజంతో పాటు కుటుంబ సభ్యులకు కూడా పేరు తెచ్చే విధంగా ఉండాలని సూచించారు.. మత్తు పదార్థాలు వినియోగించిన, అమ్మకాలు చేసిన ,నిలువచేసిన, చట్ట పరిధిలో నేరస్తులుగా పరిగణించబడతారని దీని కారణంగా యువత వారి భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని వివరించారు. విద్య ఉపాధి క్రీడలు వంటి మంచి అంశాల పట్ల యువత దృష్టి సారించాలని కోరారు. పరిసర ప్రాంతాలలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించి మాదకద్రవ్యాలను అమ్మ చూపిన , నిలువచేసిన, అటువంటి వారి పైన పోలీసులకు సమాచారం అందజేసి సహకరించాలని కోరారు. సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

## మత్తుపదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలి

### భోగాపురం రూరల్ సిఐ రామకృష్ణ


నెల్లిమర్ల, జూన్ 26, ప్రభాతవార్త



మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలు వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని భోగాపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. రామకృష్ణ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మిమ్స్ మెడికల్ కళాశాలలో శుక్రవారం నెల్లిమర్ల ఎస్సై జి. గోపాలరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రధాన గేటు ఎదురుగా విజయనగరం పాలకొండ ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు మాదకద్రవ్యాలు వినియోగానికి విద్యార్థులు బానిసలు అయితే జీవితం నాశనం అవుతుందని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని అన్నారు. గంజాయి తరహా మత్తుపదార్థాల అమ్మకం గానీ, కొనుగోలు గాని అక్రమ రవాణా గాని జరిపినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఎస్ఐ జి. గోపాలరావు. ఏ ఎస్ ఐ ఏ. సత్యనారాయణ (సతీష్ ), పోలీసు సిబ్బంది, వైద్యులు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన

గరివిడి, జూన్ 26, ప్రభాత వార్త :



మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలుపై వసతి గృహ విద్యార్థుల కు గరివిడి ఎస్ ఐ బి.లోకేశ్వర రావు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఆదర్శ డిగ్రీ కళాశాల వసతి గృహ విద్యార్థుల తో ఆయన సమావేశమయ్యారు. వారికి మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలను వివరించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోళ్ల దంపతులు

లక్కవరపుకోట /విజయనగరం, జూన్ 26 ప్రభాత వార్త :

గోవా రాష్ట్ర గవర్నర్, సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు జన్మదిన వేడుకలు విజయనగరంలోని ఆయన నివాసం (అశోక్ బంగ్లా)లో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి తన భర్తతో కలిసి గవర్నర్ అశోక్ గజపతిరాజు గారిని మర్యాదపూర్వకంగా కలుసుకొని, శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక పుట్టినరోజు అభినందనలు తెలియజేశారు; ఆ సింహగిరి అప్పన్న స్వామి ఆశీస్సులతో వారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు శ్రీ మాకెన సీతారామ్ పాత్రుడు కూడా పాల్గొని గవర్నర్ గారికి తమ ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు.

27-06pg10.qxd:27-06pg10.qxd 1/1/02 7:01 AM Page 1






# సాకర్ ప్రపంచకప్‌లో కాబో వెర్డే సంచలనాల మోత

## చిన్న దేశం.. పెద్ద కలలు

**మాజీ ఛాంపియన్ స్పెయిన్‌తో 0-0తో డ్రా**
**మరో మేటి జట్టు ఉరుగ్వేతో 2-2తో డ్రా**

గ్రూప్-హెచ్‌లో ఉన్న ఈ రెండు జట్లు నాకౌట్‌కు చేరుకోవడం నల్లేరుపై నడకే అని అనుకున్నారంతా. బరిలోకి దిగాక కానీ తెలియలేదు. తమను ఓ ఫుట్‌బాల్ కూన ఇంతలా ఇబ్బంది పెడుతుందని. ఆ జట్టే కాబో వెర్డే. ఇప్పటివరకు ప్రపంచానికి పెద్దగా తెలియని పేరు.ఈపేరుతో ఓ దేశం ఉందా అన్నది సాకర్ ప్రపంచకప్‌తోనే అందరికి తెలిసింది.అలాంటి టీమ్... ఫిఫా ప్రపంచకప్‌లో అందరి అంచనాలకు భిన్నంగా రాణిస్తూ మహా మహా జట్లకే చెమటలు పట్టించింది. స్పెయిన్‌ను కనీసం గోల్ చేసే ఛాన్స్ కూడా ఇవ్వని కాబో వెర్డే... ఉరుగ్వేను అలాగే నిలువరించింది. ఓటమనేది లేకుండా ఉన్న కాబో వెర్డే పేరు సాకర్ ప్రపంచకప్‌లో మారుమోగుతోది.

(వార్త క్రీడా విభాగం)

అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న సాకర్ ప్రపంచకప్ లీగ్ స్టేజ్ చివరికొచ్చింది. ఫేవరెట్ జట్లు తమస్థాయి విజయాలతో ముందంజ వేస్తున్నాయి. ఇక స్టార్ ఆటగాళ్లు కూడా గోల్స్ వర్షంతో అంచనాలను అందుకుంటున్నారు. ఈ మధ్యలో ఒకే ఒక జట్టు కాబో వెర్డే అందర్నీ ఆకర్షిస్తోంది.అసలు ఆ దేశం ఉందా అన్నది ఈ సాకర్ ప్రపంచకప్‌తోనే పరిచయమైంది. అందరి అంచనాలకు భిన్నంగా ఈ ఫుట్‌బాల్ కూన... ఆడుతున్న తొలి సాకర్ ప్రపంచకప్‌లోనే సంచలనాల మోత మోగిస్తోంది. స్పెయిన్, ఉరుగ్వేలతో డ్రా చేసి అజేయంగా నిలిచింది. నాకౌట్ రేసులో దూసుకుపోతోంది. సౌదీ అరేబియాతో చివరి లీగ్ మ్యాచ్‌లో గెలుపొందితే నాకౌట్ బెర్త్ పక్కా.

ఆఫ్రికా ఖండానికి పశ్చిమాన అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్న చిన్న ద్వీప దేశం కాబో వెర్డే. ఇది పది అగ్ని పర్వత ద్వీప సమూహం. 9 ద్వీపాలలోనే జానావాసాలు ఉన్నాయి. దేశ జనాభా దాదాపు 5 లక్షల 40వేలు. అధికారిక భాష పోర్చుగీస్. అద్భుతమైన సముద్ర తీరాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉంది. పర్యాటకానికి ప్రసిద్ధి.

కాబో వెర్డేలో ఫుట్‌బాల్ అంటే చెవికోసుకుంటారు. ప్రపంచ ఫుట్‌బాల్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా అడుగులు వేస్తోంది.పరిమిత జనాభా, స్వల్ప వనరులు ఉన్నప్పటికీ... కాబో వెర్డే అంతర్జాతీయ సాకర్ వేదికపై క్రమంగా తన ప్రతిభను చాటుకుంటోంది. ఈ దేశ జాతీయ ఫుట్‌బాల్ జట్టు బ్లూ షార్క్స్ పేరుతో ప్రసిద్ధి చెందింది. ఆఫ్రికన్ ఫుట్‌బాల్ సమాఖ్య నిర్వహించే పోటీల్లో ఈ జట్టు పలుమార్లు మెరుగైన ప్రదర్శన కనబరిచి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత చిన్న దేశాల్లో ఒకటిగా 2026 ఫిఫా ప్రపంచ కప్‌కు అర్హత సాధించి సంచలనం సృష్టించింది. కామరూన్, ఈస్వాటిని లాంటి జట్లను ఓడించి సాకర్ ప్రపంచకప్‌కు అర్హత సాధించి చరిత్ర సృష్టించింది. అదే సంచలనాలను ఫిఫా ప్రపంచకప్‌లోనూ కొనసాగిసూనత యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్‌తో 0-0తో డ్రా చేసింది. రెండుసార్లు సాకర్ ప్రపంచ ఛాంపియన్ ఉరుగ్వేతో 2-2తో డ్రాగా ముగించింది. గత దశాబ్ద కాలంగా కాబో వెర్డే జట్టు ప్రదర్శించిన స్థిరత్వం, ఆ దేశ ఫుట్‌బాల్ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. కాబో వెర్డే జట్టులోని పలువురు ఆటగాళ్లు యూరప్‌లోని ప్రముఖ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహించడం ద్వారా జాతీయ జట్టుకు అంతర్జాతీయ అనుభవాన్ని తీసుకొచ్చారు. చిన్న దేశమైనప్పటికీ, పెద్ద కలలతో ముందుకు సాగుతున్న కాబో వెర్డే, ప్రపంచ ఫుట్‌బాల్‌లో తన ముద్ర వేస్తోంది. చిన్న దేశాలకూ అంతర్జాతీయ క్రీడల్లో విజయావకాశాలు ఉన్నాయని కాబో వెర్డె తన ప్రతిభతో మరోసారి నిరూపిస్తోంది.

## ప్రి క్వార్టర్ ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్

**కాలిఫోర్నియా:** యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. తొలి రౌండ్‌లో 21-14, 21-12తో భారత్‌కే చెందిన సనీత్ దయానంద్‌పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో రౌనక్ చౌహాన్ (భారత్) 23-21, 21-16తో శంకర్ ముత్తుస్వామి (భారత్)పై గెలుపొంది ముందంజ వేశాడు.మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ తన్వీ శర్మ, ఆరో సీడ్ దేవిక సిహాగ్ కూడా శుభారంభం చేశారు. తన్వీ 23-21, 21-16తో వొన్నె లీ (జర్మనీ)పై... దేవిక 21-14, 21-14తో లూసియా కాస్టిల్లో (పెరూ)పై విజయాలు సాధించారు. మరో మ్యాచ్‌లో రక్షిత శ్రీ 21-15, 21-8తో టెరెజా స్వాబికోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి ముందంజ వేసింది. హైదరాబాద్ అమ్మాయి శ్రియాంశి వలిశెట్టి, అన్‌మోల్, తాన్యా హేమంత్, ఆకర్షి తొలి రౌండ్‌లోనే పరాజయం పాలయ్యారు.

## తుర్కియే గెలుపు బోణీ : అమెరికాకు ఝలక్

**లాస్‌ఏంజెల్స్ :** ఫిఫా ప్రపంచకప్2026లో తుర్కియే అనూహ్య రీతిలో పటిష్ట అమెరికాపై విజయం సాధించింది. గ్రూప్-డిలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును 3-2తో చిత్తు చేసి తొలి విజయం నమోదు చేసింది. గ్రూప్-డి నుంచి ఇప్పటికే అమెరికా వరుసగా రెండు విజయాలతో నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఈ క్రమంలో తుర్కియే మీదా గెలిచి హ్యాట్రిక్ విజయంతో అజేయంగా నిలవాలని భావించింది. కానీ తుర్కియే అంచనాలన్నీ తలకిందులు చేసింది. మూడో నిమిషంలోనే ఆస్టన్ ట్రస్టీ గోల్ కొట్టి అమెరికాకు శుభారంభం అందించాడు. అయితే, తుర్కియే ఆటగాడు బారిస్ యిల్మాజ్ ఇచ్చిన పాస్ తో ఆర్దా గూలర్ గోల్ కొట్టి 1-1తో స్కోరు సమం చేశాడు. ఇక రెండో అర్ధ భాగంలో ఒర్కూన్ కొకూ గోల్ కొట్టడంతో తుర్కియే 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, సెబాస్టియన్ బెర్‌హాల్టర్ గోల్ కొట్టడంతో.. అమెరికా 2-2తో స్కోరు సమం చేసింది. అదనపు సమయంలో కాన్ అహ్యాన్ అనూహ్య రీతిలో గోల్ కొట్టి తుర్కియేను విజేతగా నిలిపాడు. అయినా టోర్నీ నుంచి నిష్క్రమించింది.

**ఆసీస్, పరాగ్వే సైతం**

ఇక గ్రూప్‌డి మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా పరాగ్వేతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. దీంతో టేబుల్ టాపర్ అమెరికాతో పాటు.. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన ఆస్ట్రేలియా, పరాగ్వే నాకౌట్‌కు చేరాయి.



## శ్రీలంక-ఏతో ఏకైక టెస్ట్ పట్టుబగించిన భారత్

**గాలే, జూన్26:** నధికారిక టెస్టులో శ్రీలంక-ఏ జట్టుపై భారత్-ఏ ఆధిపత్యం కొనసాగుతోంది. రెండో రోజు ఆట ముగిసేసమయానికి శ్రీలంక 31 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 339 పరుగులు వెనుకబడి ఉంది.క్రీజ్‌లో నువానిదు ఫెర్నాండో(65), ఆష్వేన్ బండారా (18) ఉన్నారు. ఓపెనర్లు వీరసింగే (11), డిక్‌వెల్లా (10) విఫలమయ్యారు. అన్షుల్ కాంబోజ్, యశ్ ఠాకూర్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌ను 6 వికెట్లకు 452 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది.

**కెప్టెన్ ధ్రువ్ జురెల్ సెంచరీ**

తొలి రోజే సాయి సుదర్శన్ (132) సెంచరీ సాధించగా.. రెండో రోజు ఆ పనిని కెప్టెన్ ధృవ్ జురెల్ చేపట్టాడు. ఓవర్ నైట్ స్కోరు 333/4తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్-ఏ కాసేపటికే షేక్ రషీద్ (63) రూపంలో వికెట్ కోల్పోయింది. అయితే, కెప్టెన్ ధ్రువ్ జురెల్ (215 బంతుల్లో 141 రన్స్;13 ఫోర్లు, ఓ సిక్స్) అద్భుత సెంచరీతో జట్టు స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడికి హర్ష్ దూబే (51 బంతుల్లో 30) తోడ్పాటు అందించాడు. భారత్ స్కోరును 450 మార్కు దాటించారు. ఈ దశలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తూ ధ్రువ్ నిర్ణయం తీసుకున్నాడు.

శ్రీలంక బౌలర్లలో చమిక గుణశేఖర 3, దిలుమ్ సుదీరా 2, రవిందు ఫెర్నాండో ఒక వికెట్ పడగొట్టారు.




అభిషేక్ ధనాధన్

## తొలి టి20లో టీమిండియాకు ఐర్లాండ్ షాక్

**బెల్‌ఫాస్ట్,జూన్ 26:** టీ20 ప్రపంచ ఛాంపియన్ టీమిండియాకు ఐర్లాండ్ షాకిచ్చింది. తొలి టీ20 మ్యాచ్ లో 34 పరుగులతో గెలుపొందింది. రెండు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం చాటింది. మొదట ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. లక్ష్యచేధనలో తడబడ్డ మెన్ ఇన్ బ్లూ 18.5 ఓవర్లలో 148 పరుగుల స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. మాథ్యూ హంప్‌రేస్, మాట్‌హోలార్డ్ చెరో మూడు వికెట్లు పడగొట్టి టీమిండియా బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు.

183 పరుగుల లక్ష్య చేధనలో భారత్ ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మ(20 బంతుల్లో 49; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), సంజూ శాంమ్సన్(5) ప్రారంభించారు. తొలి ఓవర్లోనే 16 పరుగులు రాబట్టారు. అయితే మూంద్రా వస్తూనే తొలి బంతికి సంజూను క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఒకవైపు అభిషేక్.. ఐర్లాండ్ బౌలర్లపై విరుచుకుపడుతుంటే, మరో ఎండ్‌లో భారత్ టాప్ ఆర్డర్ పెవిలియన్‌కు క్యూ కట్టింది. ఇషాన్ కిషన్(1), కెప్టెన్ శ్రేయాస్(3)ను వరుస ఓవర్లలో హోలార్డ్ అవుట్‌చేశాడు. అభిషేక్ శర్మ బౌండరీలు, సిక్స్‌లతో హాఫ్ సెంచరీకి చేరువయ్యాడు. భారీ షాట్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసే ప్రయత్నంలో మెక్‌కార్తీ బౌలింగ్‌లో అవుటయ్యాడు. వాషింగ్టన్ సుందర్ కూడా 9 పరుగులే చేసి నిరాశపరిచాడు. తిలక్‌వర్మ(19), శివమ్ దూబే(14 బంతుల్లో 25), అక్షర్ పటేల్(15) భారత్‌ను ఆదుకునే ప్రయత్నం చేసినా హంప్‌రేస్, ముంద్రా వెంటవెంటనే వికెట్లు కూల్చారు. చివరి వరుస బ్యాట్స్‌మెన్ కూడా చేతులెత్తేయడంతో భారత్ మరో 7 బంతులుండగానే 148 పరుగులకు ఆలౌటైంది. ఐర్లాండ్ బౌలర్లలో హంప్‌రేస్, హోలార్డ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. జై మోంద్రా 2, మెక్‌కర్తీ, గరేత్ ఒక్కో వికెట్ తీశారు.

అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ ఆరంభంలో తడబడింది.యువ బౌలర్ హర్షిత్ రాణా టాప్ ఆర్డర్ పనిపట్టాడు. అతనికి అర్షదీప్‌కూడా తోడవడంతో ఐర్లాండ్ 51 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు టిమ్ టెక్టర్(17), రాస్ అదైర్(12), బెన్ కార్లిట్జ్(15)లను హర్షిత్ రాణా అవుట్ చేయగా, హారీ టెక్టర్‌ను అర్షదీప్ డకౌట్ చేశాడు. ఈ దశలో కెప్టెన్ లొర్కాన్ టక్కర్ (50), డాక్‌రెల్ (49) క్రీజ్‌లో నిలదొక్కుకుని భారత్ బౌలర్ల జోరును అడ్డుకున్నారు. ఐర్లాండ్ స్కోరును 150 మార్కు దాటించారు. వీరి అవుట్ తర్వాత ఐర్లాండ్ వేగంగా వికెట్లు కోల్పోయింది. దీంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 రన్స్ చేసింది. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3, అక్షర్ పటేల్ 2, అర్ష్‌దీప్ సింగ్ 2, శివమ్ దూబే ఒక వికెట్ తీశారు. ఈ ఓటమితో ఐర్లాండ్ టూర్‌ను టీమిండియా ఓటమితో ప్రారంభించింది. రెండో టీ20 మ్యాచ్ ఆదివారం జరగనుంది.

# భారత్ ఆర్థికవృద్ధి 6.8శాతం!

## గోల్డ్‌మాన్ శాక్స్ అంచనా




**న్యూఢిల్లీ,జూన్ 26:** అమెరికాఇరాన్ శాంతి ఒప్పందం నేపథ్యంలో భారత్ ఆర్థిక వృద్ధిపై గోల్డ్‌మన్ శాక్స్ సానుకూల అంచనాలతో ఉంది.ముడి చమురు ధరలు తగ్గడం, దేశీయ ఆర్థిక పరిస్థితులు బలోపేతం కావడం వల్ల 2026 క్యాలెండర్ సంవత్సరానికి భారత్ జీడీపీ వృద్ధి అంచనాను 6.8 శాతానికి పెంచింది. ఇదివరకు 6.5 శాతం పరిధిలో అంచనా వేసిన సంస్థ, తాజా పరిణామాల నేపథ్యంలో వృద్ధి అంచనాలను మరింత మెరుగుపరిచింది. ఇండియా: ఇంప్రూవ్డ్ మ్యాక్రో అవుట్‌లుక్ ఆఫ్టర్ ది యూఎస్‌ఇరాన్ డీల్ పేరుతో విడుదల చేసిన నివేదికలో, ముడి చమురు ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటు వంటి స్థూల ఆర్థిక ప్రమాదాలు తగ్గాయని పేర్కొంది. ప్రస్తుతం 2026 మూడు, నాలుగో త్రైమాసికాల్లో బ్యారెల్‌కు సగటు చమురు ధర 82 డాలర్లు, 2027లో 75డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 2026 క్యాలెండర్ సంవత్సరానికి భారత్ వాస్తవ జీడీపీ వృద్ధి అంచనాను 0.3 శాతం పెంచి 6.8 శాతానికి చేర్చినట్లు గోల్డ్‌మన్ శాక్స్ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గతంలో 6.1 శాతం వృద్ధిని అంచనా వేసిన సంస్థ, ఇప్పుడు ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని పేర్కొంది.తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేయడం కూడా ఈ సవరణకు ప్రధాన కారణమని వెల్లడించింది.


పెట్టుబడుల పెరుగుదలతో పాటు సేవల రంగం బలంగా విస్తరించడం వృద్ధికి ఊతమిచ్చిందని తెలిపింది. 2027 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాను 5.1శాతం నుంచి 4.9శాతానికి తగ్గించింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాలు తగ్గడంతో పాటు పెట్రోకెమికల్ ఉత్పత్తుల తయారీ వ్యయాలు కూడా తగ్గనున్నాయని పేర్కొంది.ప్రపంచ మార్కెట్లో యూరియా, ముడిచమురు ధరలు తగ్గడం వల్ల ఎరువుల సబ్సిడీ భారం తగ్గి ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులకు కూడా ఊరట లభిస్తుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. 2026 సంవత్సరానికి కరెంట్ అకౌంట్ లోటు జీడీపీలో 1.1 శాతానికి పరిమితం అవుతుందని, బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ మిగులు 0.7 శాతానికి చేరవచ్చని నివేదికలో పేర్కొంది.

# లక్షకుపైగా ఉద్యోగాలకు వోక్స్ వ్యాగన్ కోత

**బెర్లిన్,జూన్ 26:** జర్మనీకి చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ వోక్స్ వ్యాగన్ గ్రూప్ చేపట్టిన పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా లక్ష మంది వరకు ఉద్యోగులను తొలగించడం, జర్మనీలోని నాలుగు తయారీ ప్లాంట్లను మూసివేయడం, రాబోయే ఐదేళ్ల పెట్టుబడులను గణనీయంగా తగ్గించడం వంటి చర్యలను కంపెనీ యాజమాన్యం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

కంపెనీ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ) ఒలివర్ బ్లూమ్ ప్రతిపాదించిన ఈ ప్రణాళికకు ఇంకా బోర్డు ఆమోదం లభించాల్సి ఉంది. ఈ ప్రణాళిక ప్రకారం పెట్టుబడులను సుమారు 15 శాతం తగ్గించి, వచ్చే ఐదేళ్లలో మూలధన వ్యయాన్ని 130 బిలియన్ యూరోల కంటే కొద్దిగా ఎక్కువ స్థాయికి పరిమితం చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. పునర్వ్యవస్థీకరణలో భాగంగా వోక్స్‌వ్యాగన్ తన ప్రధాన ప్రయాణికుల కార్ల విభాగం, విడిభాగాల వ్యాపారాలను ప్రత్యేక సంస్థలుగా విభజించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడం,లాభదాయకతను పెంచడం ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొంటున్నారు.అమెరికా విధించిన దిగుమతి సుంకాలు,చైనా ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు మార్పుతో పెరుగుతున్న వ్యయాలు వోక్స్‌వ్యాగన్‌పై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చాయి.

ఈ నేపథ్యంలో కంపెనీ తన ప్రధాన ఆటోమొబైల్ వ్యాపారంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సీఈఓ ఒలివర్ బ్లూమ్ పలుమార్లు పేర్కొన్నారు. ప్రస్తుత వాహన ఉత్పత్తి కార్యక్రమాలు ముగిసిన తర్వాత హానోవర్, జ్వికౌ, ఎమ్డెన్ ప్లాంట్లతో పాటు ఆడీకి చెందిన నెకార్సుల్మ్ తయారీ కేంద్రంలో ఉత్పత్తిని నిలిపివేసే అవకాశమున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ప్రస్తుతం అమలులోఉన్న 50 వేల ఉద్యోగాల కోత ప్రణాళికకు మించి ఈ కొత్త చర్యలు ఉండనున్నాయి. ఇవి అమలైతే వోక్స్‌వ్యాగన్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతం మందిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.అయితే ఈ అంతర్గత ప్రణాళికలపై వోక్స్‌వ్యాగన్ అధికారికంగా స్పందించలేదు. అయితే సంస్థలో "విస్తృత స్థాయి మార్పులు తప్పనిసరి" అని మాత్రమే పేర్కొంది.




## ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌లు స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేసుకోవాలి

### ఎన్ఎస్ఈ సీఈఓ అశిష్ చౌహాన్



**ముంబయి,జూన్ 26:** స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌ను అవకాశంగా వినియోగించుకోవాలని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అశిష్ చౌహాన్ సూచించారు. వ్యవస్థాపకులు రోజువారీ షేర్ ధరల మార్పులపై కాకుండా లాభదాయకమైన, దీర్ఘకాలికంగా నిలబడే సంస్థల నిర్మాణంపై దృష్టి పెట్టాలని అన్నారు.పబ్లిక్ లిస్టింగ్ ద్వారా కంపెనీలకు వృద్ధి కోసం అవసరమైన మూలధనం లభిస్తుందని, కార్పొరేట్ గవర్నెన్స్ మెరుగుపడుతుందని, మార్కెట్లో విశ్వసనీయత పెరుగుతుందని, నైపుణ్యం కలిగిన ఉద్యోగులను ఆకర్షించడం సులభమవుతుందని తెలిపారు. కంపెనీపై ప్రమోటర్ల నియంత్రణ కూడా కొనసాగుతుందని స్పష్టంచేశారు. ప్రారంభంలో కంపెనీ ఈక్విటీలో కేవలం 25శాతం వాటాను మాత్రమే మార్కెట్లోకి విడుదల చేసి, మిగిలిన 75 శాతం వాటాను ప్రమోటర్లు తమ వద్దే ఉంచుకోవచ్చని అశిష్ చౌహాన్ వివరించారు.వ్యాపార అవసరాలను బట్టి భవిష్యత్తులో మాత్రమే మరింత వాటాను విక్రయించే అవకాశంఉంటుందని చెప్పారు.ఏడాదికి 2 కోట్ల లాభం ఆర్జించే సంస్థ కూడా స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అనంతరం 40 నుంచి 50 కోట్ల వరకు మార్కెట్ విలువను పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీంతో కంపెనీలు సులభంగా నిధులు సమీకరించి, కొత్త ఇన్వెస్టర్లను తీసుకురాగలిగి వ్యాపార విస్తరణ చేపట్టవచ్చని తెలిపారు.లిస్టెడ్ కంపెనీలకు షేర్ల రూపంలో సొంత కరెన్సీ లభించినట్లేనని, వాటిని ఇతర కంపెనీల కొనుగోళ్లకు, ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్లు ఇవ్వడానికి ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఇన్ఫోసిస్ ప్రారంభ దశలో ఉద్యోగులను ఆకర్షించేందుకు స్టాక్ ఆప్షన్లను సమర్థంగా వినియోగించిన విషయాన్ని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు.లిస్టింగ్ వల్ల కంపెనీలకు విశ్లేషకుల కవరేజ్ లభించడంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు సులభమవుతుందని, వారసత్వ నిర్వహణ కూడా సక్రమంగా జరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## భారత్‌కు మేలుచేస్తేనే యుఎస్ ఎఫ్టీయేపై సంతకం: గోయల్



**లండన్,జూన్ 26:** భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందని భారత ఎగుమతులకు ఇతర దేశాల కంటే ఎక్కువ మేలు చేకూరితేనే ఈ ఒప్పందంపై సంతకం చేస్తామని కేంద్రమంత్రి పియూష్‌గోయల్ స్పష్టం చేశారు. లండన్‌లో మీడియాతో మాట్లాడిన గోయల్ ఫిబ్రవరి 6నుంచే ఒప్పందంలోని ప్రధాన అంశాలపై ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయని, ప్రస్తుతం తుది నిబంధనలు, సుంకాల అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.భారత్‌కు అమెరికా మార్కెట్లో ప్రత్యర్థి దేశాల కంటే మెరుగైన టారిఫ్ రాయితీలు లభించేలా చట్టపరమైన వ్యవస్థను రూపొందించాలన్నదే ప్రస్తుతం ప్రధాన చర్చాంశమని గోయల్ పేర్కొన్నారు.

అలాంటి ప్రయోజనం తర్వాతే ఒప్పందం అమల్లోకి వస్తుందని చెప్పారు. గతంలో 18 శాతం టారిఫ్ రేటుకు భారత్ అంగీకరించినప్పటికీ అది కూడా ఇతర దేశాల కంటే భారత్‌కు ప్రత్యేక ప్రయోజనం ఉంటుందనే షరతుపైనే నని మంత్రి స్పష్టం చేశారు. భారత టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఔషధాలకు అమెరికాలో వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాల ఉత్పత్తుల కంటే తక్కువ దిగుమతి సుంకం ఉంటే భారత ఎగుమతిదారులకు భారీ ప్రయోజనం లభిస్తుంది. దీంతో ఎగుమతులు పెరగడంతో పాటు మార్కెట్ వాటా, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది. ప్రతిపాదిత భారత్అమెరికా వాణిజ్య ఒప్పందంలో టారిఫ్‌లు, రూల్స్ ఆఫ్ ఒరిజిన్, పెట్టుబడులు, పలు రంగాల్లో పరస్పర సహకారం వంటి అంశాలు చోటు చేసుకోనున్నాయి. ఈ ఒప్పందం ప్రపంచంలోని అతిపెద్ద, ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు భారత వ్యాపారాలకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## భారత్ ఫారెక్స్ ఖజానా కళకళ



**ముంబయి,జూన్26:** భారత్ విదేశీ మారక నిల్వలు మరోసారి పెరిగాయి. ఈనెల 19తో ముగిసిన వారానికి భారత విదేశీ మారక నిల్వలు 963 మిలియన్ డాలర్లు పెరిగి 672.587 బిలియన్ డాలర్లకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. అంతకుముందు వారంలో విదేశీ మారక నిల్వలు 9.985 బిలియన్ డాలర్లు తగ్గి 671.625 బిలియన్ డాలర్ల వద్ద నమోదయ్యాయి.ఈసారి విదేశీ కరెన్సీ ఆస్తులు 3.072 బిలియన్ డాలర్లు తగ్గి 541.217 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్‌తో పోలిస్తే యూరో, పౌండ్, యెన్ వంటి కరెన్సీల విలువల్లో వచ్చిన మార్పులు కూడా విదేశీ కరెన్సీ ఆస్తులపై ప్రభావం చూపినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

మరోవైపు, బంగారం నిల్వల విలువ గణనీయంగా పెరిగింది. బంగారం నిల్వలు 4.110 బిలియన్ డాలర్లు పెరిగి 107.930 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అలాగే, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్‌లు) 52 మిలియన్ డాలర్లు తగ్గి 18.647 బిలియన్ డాలర్లకు చేరగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత రిజర్వ్ స్థాయి 22 మిలియన్ డాలర్లు తగ్గి 4.793 బిలియన్ డాలర్లుగా నమోదైంది. దీంతో ఖజానా కళకళ లాడుతోది.



## డాక్టర్ రెడ్డీస్‌లో ఎఫ్‌డిఎ తనిఖీలు

**న్యూఢిల్లీ,జూన్ 26:** ప్రముఖ ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ బాచుపల్లిలోని బయోలాజిక్స్ తయారీ కేంద్రంపై నిర్వహించిన తనిఖీల అనంతరం అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఏడు పరిశీలనాత్మక అభ్యంతరాలు జారీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈనెల 16 నుంచి 25, వరకు బాచుపల్లి బయోలాజిక్స్ తయారీ కేంద్రంలో ఎఫ్‌డిఎ ప్రీలైసెన్స్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించింది. తనిఖీలు పూర్తైన అనంతరం ఫామ్483 కింద ఏడు పరిశీలనలు జారీ చేసినట్లు తెలిపింది. వాటికి నిర్దేశిత గడువులోగా సమాధానాలు ఇచ్చి, అవసరమైన సవరణ చర్యలు చేపడతామని కంపెనీ పేర్కొంది. గతంలోకూడా 2025 సెప్టెంబర్ 4 నుంచి 12 వరకు ఇదే ప్లాంట్‌లో నిర్వహించిన ప్రీఅప్రూవల్ ఇన్‌స్పెక్షన్ అనంతరం ఎఫ్‌డిఎ ఐదు అభ్యంతరాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో డాక్టర్ రెడ్డీస్ పనితీరు గణనీయంగా బలహీనపడింది.కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 86 శాతం తగ్గి రూ.1,593 కోట్ల నుంచి రూ.221 కోట్లకు పడిపోయింది. లెనాలిడొమైడ్ ఔషధానికి సంబంధించిన షెల్ఫ్ స్టాక్ అడ్జస్ట్‌మెంట్ కారణంగా కంపెనీకి రూ.4,530 కోట్ల ప్రభావం పడింది. అలాగే కార్-టి ఆస్తులు, ఎప్టిలాగిమోడ్ ఆల్ఫాకు సంబంధించిన రూ.27 కోట్ల ఇంపెయిర్మెంట్, వ్యాట్ బకాయిలకు సంబంధించిన రూ.14 కోట్ల ప్రొవిజన్లు కూడా ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపాయి.

కంపెనీ ఆదాయం కూడా 12 శాతం తగ్గి రూ.8,528 కోట్ల నుంచి రూ.7,546 కోట్లకు చేరింది. ఇక ఎబిట్డా వార్షిక ప్రాతిపదికన 60 శాతం క్షీణించి రూ.2,475 కోట్ల నుంచి రూ.981 కోట్లకు పడిపోయింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.